www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
VELTHURU TELUGU DAILY
రంగారెడ్డి
# వెలుతురు
తెలుగు దినపత్రిక
బుధవారం 06 నవంబర్ 2024
సంపుటి :06 సంచిక : 157 , పేజీలు : 12 వెల:రూ.5/-
TELANGANA, ANDHRA PRADESH

# కులగణన ద్వారా అన్ని కులాలకు న్యాయం



- నష్టపోతున్న కులాలకు ప్రాతినిధ్యం దక్కుతుంది
- కులగణన అవసరాన్ని పార్లమెంట్‌లోనే ప్రస్తావించా
- కులగణనపేరు చెప్పగానే దేశ విభజనపేరుతో విమర్శలు
- కులగణన పేరు చెబితేనే ప్రధాని మోడీ విమర్శలు
- దేశానికి ఆదర్శంగా నిలవబోతున్న తెలంగాణ కులగణన
- హైదరాబాద్ సదస్సులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ వ్యాఖ్యలు



**హైదరాబాద్, నవంబర్5 వెలుతురు:** కులగణన ద్వారా అన్ని కులాలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ అగ్రనేత, పార్లమెంటులో విపక్షనేత రాహుల్ అన్నారు. కులాల వారీగా జనాభా లెక్కిస్తే తరాలుగా నష్టపోతున్న వారికి తగిన ప్రాతినిధ్యం దొరుకుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కులగణన గురించి ప్రస్తావించగానే దేశాన్ని విభజించేస్తున్నామని ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలను తిప్పి కొట్టారు. తెలంగాణలో కులగణన దేశానికి ఆదర్శంగా నిలవబోతున్నదని రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ బోయిన్‌పల్లిలోని గాంధీ ఐడియాలజీ కేంద్రంలో కులగణనకు సంబంధించి పౌరహక్కులు, మేధావులతో నిర్వహించిన సభలో రాహుల్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా పలువురు మంత్రులు, మేధావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. దేశసంపద సమానంగా పంచాలంటే..దేశం మొత్తం కులగణన సర్వే చాలా కీలకం అన్నారు. కులగణన సర్వే ఎందుకు కీలకమో వివరించారు. దేశంలో కుల వివక్ష కొనసాగుతుందని.. కులం విషయంలో ఓ విజన్ తో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని మతాలపై మన విజన్ తో వెళ్లడం తప్పనిసరి అన్నారు. దేశాన్ని విభజించే కుట్ర చేస్తున్నానని ప్రధాని మోదీ అంటున్నారు.. దేశం గురించి నిజం చెబితే దేశాన్ని విభజించడం అవుతుందా అని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. కుల గణన సర్వే ద్వారా కులాల లెక్క తెల్చవచ్చు.. దేశవ్యాప్తంగా కులగణనపై పార్లమెంట్ చర్చపెట్టింది తానేనని రాహుల్ గాంధీ అన్నారు. భారతదేశంలో కులవ్యవస్థ చాల



2 లో..

## రాహుల్ మాట ప్రకారం కులగణన

- సామాజికన్యాయం రాహుల్ ఆశయం
- కులగణన సదస్సులో సిఎం రేవంత్ వ్యాఖ్య



భారత్ జోడో యాత్ర ఎంతో మందిని కదిలించిందని కులగణన సంప్రదింపుల సమావేశంలో రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం కులగణన చేస్తున్నామని అన్నారు.



## 25నుంచి పార్లమెంట్ సమావేశాలు

- కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వెల్లడి

**న్యూఢిల్లీ,నవంబర్5 వెలుతురు:** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నవంబర్ 25 నుంచి ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ 20 వరకు కొనసాగనున్నాయి. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మంగళవారం వివరాలు

2 లో..

## ఆహారకల్తీని ఉపేక్షించబోం

- ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు
- ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



**హైదరాబాద్,నవంబర్5 వెలుతురు:** ఆహారాన్ని కల్తీ చేసేందుకు ప్రయత్నిస్తే ఎట్టి పరిస్థితుల్లో వదలబోమని.. కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ హెచ్చరించారు.

2 లో..

## కాంగ్రెస్ పాలనలో గురుకులాల్లో 36 మంది మృతి



- ఏడునెలల్లో 600 మందికిఫుడ్ పాయిజనింగ్
- గురకుల పాఠశాలల్లో కనీస వసతులు మృగ్యం
- ప్రభుత్వం తీరుపై మండిపడ్డ హరీష్ రావు

**హైదరాబాద్,నవంబర్ 5 వెలుతురు:** ఇప్పటి వరకు ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లలో 36 మంది విద్యార్థులు వివిధ కారణాలతో చనిపోయారని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. 36 మంది విద్యార్థుల మరణాలు అంటే చిన్న విషయం కాదన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలన్నారు. దాదాపు 600 మంది విద్యార్థులు ఈ ఏడు నెలల్లో ఫుడ్ ఫాయిజనింగ్ బారిన పడ్డారని.. అంతేకాకుండా పాములు, ఎలుకల కాట్లకు గురవుతున్నారన్నారు. నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గురుకుల పాఠశాల బాలికలను

### కుటుంబ సర్వే నుంచి టీచర్లను మినహాయించండి

### విద్యాహక్కుచట్టానికి వ్యతిరేకంగా ప్రభుత్వ నిర్ణయం

### సిఎం రేవంత్‌కు ఎమ్మెల్యే హరీష్ రావు లేఖ

2 లో..

## దాశరధిని స్మరించుకున్న కెసిఆర్



**హైదరాబాద్,నవంబర్ వెలుతురు:** నా తెలంగాణ కోటి రతనాల వీణ అని నినదించిన తెలంగాణ కవి రచయిత దాశరథి కృష్ణమాచార్య వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వారి సేవలను స్మరించుకున్నారు. తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు కోసం సాగిన ఉద్యమంలో దాశరథి అందించిన పోరాట స్ఫూర్తి ఇమిడివుందన్నారు. దాశరథి కృషిని గుర్తించిన నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం వారి స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించటానికి పలు కార్యక్రమాలు చేపట్టిందని కేసీఆర్ గుర్తుచేశారు.

## ఆటో డ్రైవర్లూ ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి

### కాంగ్రెస్ ప్రభుత్వంతో అన్ని వర్గాల్లోనూ ఆందోళన

### ఆటో డ్రైవర్ల మహాధర్నాలో కేటీఆర్ విమర్శలు

**హైదరాబాద్,నవంబర్5 వెలుతురు:** మార్పు, మార్పు అనుకుంటూ అందరి కొంపలు ముంచుకున్నారు... ఈ కాంగ్రెసోళ్లు అని రేవంత్ రెడ్డి సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ఆటో డ్రైవర్లు కూడా ఆత్మహత్య చేసుకునే దుస్థితి వచ్చిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితిని తీసుకొచ్చింది. దాదాపు ఆరున్నర లక్షల మంది

- సాగునీటి రంగం బలోపేతం చేసిన కెసిఆర్
- భూముల ధరలపెరుగుదలకు అదే కారణం
- రియల్టర్స్ ఫోరమ్‌లో బిఆర్ఎస్ నేత కెటిఆర్



2 లో..

## రాహుల్ ....6 గ్యారంటీలపై సమాధానం చెప్పే దమ్ముందా?

- ఏం సాధించాని మహారాష్ట్ర ఎన్నికల్లో తెలంగాణ కాంగ్రెస్ యాడ్స్ ఇస్తోంది?
- కేసీఆర్ ను మించిపోయిన కాంగ్రెస్
- మాజీ సర్పంచుల పక్షాన బీఆర్ఎస్ ఆందోళన సిగ్గు చేటు
- చంపినోడే సంతాప సభ పెట్టినట్లుంది
- కాంగ్రెస్ అగ్రనేత అల్లుడి కోసమే మూసీ పునరుజ్జీవం
- 15 వేల కోట్లు ఖర్చయ్యే ప్రాజెక్టుకు లక్షన్నర కోట్లు ఖర్చు చేయాలనుకోవడమేంది?
- శంషాబాద్ లో ఆంజనేయస్వామి ఆలయంపై దాడి అమానుషం
- హిందూ ఆలయాలపై వరుస దాడులు జరుగుతున్నా సీఎం నోరు మెదపరా?
- హిందువులంతా రోడ్డెక్కే పరిస్థితి కొనితెచ్చుకోకండి
- తక్షణమే దుండుగలను అరెస్ట్ చేయాలి
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హాట్ కామెంట్స్
- వేములవాడ నియోజకవర్గం రుద్రంగిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**వేములవాడ వెలుతురు నవంబర్ 05:** రాష్ట్రానికి విచ్చేస్తున్న కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీకి 6 గ్యారంటీలకు సమాధానం చెప్పే దమ్ముందా? అని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. దేశమంతా పాదయాత్ర చేశానని చెప్పుకున్న రాహుల్

5 లో..

## కమిషనర్ ను కలిసిన టీయూడబ్ల్యూజే బృందం



**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 05:** రాష్ట్ర సమాచార మరియు పౌర సంబంధాల శాఖ కమిషనర్ గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్.హరిష్ ను మంగళవారం నాడు సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ నేతృత్వంలో ప్రతినిధి బృందం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా జర్నలిస్టుల ఆయా సమస్యలను వారు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా, మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి సలహాలతో సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని హరిష్ తెలిపారు. ప్రతినిధి బృందంలో టీయూడబ్ల్యూజే ఉప ప్రధాన కార్యదర్శి కలుకూరి రాములు, కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ. రాజేష్, తెలంగాణ రాష్ట్ర చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్షులు యూసుఫ్ బాబు, రాష్ట్ర నాయకులు మాతంగి దాస్ లు ఉన్నారు.

## విద్యుత్ ఛార్జీల భారం మోపితే ఊరుకోం

- ఇచ్చిన హామీ మేరకు టారిఫ్ తగ్గించండి
- గత ప్రభుత్వం పాపాలంటూ భారం మోపుతారా
- ప్రభుత్వ తీరుపై పిసిసి చీఫ్ షర్మిల విమర్శలు

2 లో..

**విజయవాడ,నవంబర్ 5 వెలుతురు:** విద్యుత్ ఛార్జీలపై ప్రజలను మోసం చేస్తూ

## ఇంటర్ పరీక్ష ఫీజుల తేదీ ప్రకటన

2 లో..

**హైదరాబాద్,నవంబర్5 వెలుతురు:** ఇంటర్ ఎగ్జామ్ ఫీజు తేదీలు షెడ్యూల్ వచ్చింది. ఈ నెల 6వ తేదీ నుంచి 26వ తేదీ వరకు విద్యార్థులు ఫీజు చెల్లించాలి. రూ. 100 ఆలస్య

## చంద్రబాబుతో మందకృష్ణ మాదిగ భేటీ

- ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తిచేయాలని వినతి
- దళిత హోంమంత్రిని పవన్ అవమానించారని విమర్శ



**అమరావతి,నవంబర్5 వెలుతురు:** ఎస్సీ వర్గీకరణ పక్రియను వేగంగా పూర్తి చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక

2 లో..

# సరస్వతీ ప్లాంట్ భూములకు రక్షణ

### బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

### పవర్ ప్రాజెక్ట్ పేరుతో 400 ఎకరాల అటవీభూముల స్వాధీనం

### డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ భరోసా

**నరసరావుపేట,నవంబర్ 5 వెలుతురు:** వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కుటుంబానికి చెందిన సరస్వతి పవర్ ఇండస్ట్రీస్ భూములకు సంబంధించిన బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. మంగళవారం పల్నాడు జిల్లాలోని మాచవరం మండలం.. వేమవరం, చెన్నాయపాలెం గ్రామాల్లోని సరస్వతి పవర్ ప్లాంట్ భూములను ఆయన పరిశీలించారు. అనంతరం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. వైఎస్ఆర్ హయాంలో ఈ సరస్వతి పవర్ ప్రాజెక్ట్ తీసుకు వచ్చారని గుర్తు చేశారు. ఈ ప్రాంతంలో 400 ఎకరాల అటవీ భూములుంటే.. వాటిని రెవెన్యూ భూములుగా మార్చేసి లాక్కున్నారని పవన్ కల్యాణ్ ఈ సందర్భంగా మండిపడ్డారు. 2009లో ఈ భూములను 30 ఏళ్లకు లీజుకు తీసుకుని.. మళ్లీ వాటిని 50 ఏళ్లకు పెంచారని చెప్పారు. తాము పరిశ్రమ ఏర్పాటు చేసి.. అందులో ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి.. ఈ



2 లో..

(మొదటి పేజీ తరువాయి..)

## ఆహారకల్తీని ఉపేక్షించబోం

ఇటీవల ఆహారకల్తీపై వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే వారిని ఉపేక్షించబోమని మంత్రి హెచ్చరించారు. నగరంలోని వెంగళరావు నగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌లో ఫుడ్ సేఫ్టీ విభాగం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఫుడ్ సేఫ్టీ విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం.. వ్యాపారం చేసుకునే వారికి ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. వసతి గృహాల్లో పిల్లలకు మంచి భోజనం పెట్టకుండా ఇబ్బంది పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పెరిగిన హోటళ్ల సంఖ్య, జనాభాకు అనుగుణంగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ల సంఖ్యను పెంచనున్నట్టు మంత్రి ప్రకటించారు.ఫుడ్ సేఫ్టీ విభాగం కమిషనర్ ఆర్‌వి కర్ణన్, ఐపీఎం డైరెక్టర్ శివలీల, జీహెచ్ఎంసీ అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొంత మంది స్ట్రీట్ ఫుడ్ వెండర్లకు ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు అందించారు.

## 25నుంచి పార్లమెంట్ సమావేశాలు

వెల్లడించారు. ఈ సెషన్‌లో భాగంగా నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. సంవిధాన్ సదన్ (పార్లమెంట్ పాత భవనం) సెంట్రల్ హాల్ ఇందుకు వేదికకానుంది. ప్రస్తుతం మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలపై అన్ని పార్టీలు దృష్టి సారించాయి. నవంబర్ 23న ఫలితాలు వెల్లడికానున్నాయి. ఆ తర్వాతే ఈ సెషన్ ప్రారంభంకానుంది. ఈ సమావేశాల్లోనే కేంద్రం వక్ఫ్ బిల్లును ప్రవేశపెట్టనుందని తెలుస్తోంది. గత సెషన్‌లోనే కేంద్రం ఈ బిల్లును తీసుకువచ్చింది. అయితే విపక్షాలు దీనిపై తీవ్ర నిరసన వ్యక్తంచేయడంతో కేంద్రం ఒక్క అడుగు వెనక్కివేసి..దానిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపింది.

## ఇంటర్ పరీక్ష ఫీజుల తేదీ ప్రకటన

రుసుంతో నవంబర్ 27 నుంచి డిసెంబర్ 4వ తేదీ వరకు చెల్లించొచ్చు. రూ. 500 ఆలస్య రుసుంతో డిసెంబర్ 5 నుంచి 11 వరకు, రూ. 1000 ఆలస్య రుసుంతో డిసెంబర్ 12 నుంచి 18 వరకు, రూ. 2 వేల ఆలస్య రుసుంతో డిసెంబర్ 19 నుంచి 27 వరకు చెల్లించే అవకాశం కల్పించారు. ఫస్టియర్ జనరల్ కోర్సులకు రూ. 520, వొకేషనల్ కోర్సులకు రూ. 750, సెకండియర్ జనరల్ ఆర్ట్స్ కోర్సులకు రూ. 520, సైన్స్, వొకేషనల్ కోర్సులకు రూ. 750గా ఫీజు నిర్ధారించారు.

## విద్యుత్ ఛార్జీల భారం మోపితే ఊరుకోం

వారిపై భారం మోపితే ఊరుకునేది లేదని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల విమర్శలు చేశారు. ఎవరి పాపమో అన్నది పక్కనపెట్టి ప్రస్తుత ప్రభుత్వం ప్రజలపై భారం పడకుండా చూడాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన పాపాల గురించి ప్రస్తావించడం కాదని, ఆ పాపాలకు ప్రాయశ్చిత్తం చేయాల్సింది పోయి, ఆ పాపపు పరిహారాన్ని ప్రజల నెత్తిన మోపేందుకు కూటమి సర్కార్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రూ.18వేల కోట్ల సర్దుబాటు ఛార్జీల వసూళ్ళ విషయంలో మా తప్పేం లేదని, మాకసలు సంబంధమే లేదని, భారం మాది కాదని, ప్రజల మీదే ఆ మొత్తాన్ని మోపుతున్నారని విరుచుకుపడ్డారు. విద్యుత్ ఛార్జీల గురించి కూటమి ప్రభుత్వ తీరును వైఎస్ షర్మిల తప్పు పట్టారు. విద్యుత్ ఛార్జీలపై సర్కార్‌ది సర్దుబాటు కాదు ఇది, ప్రజలకు 'సర్దుపోటు'. కూటమి సర్కారు ప్రజలకు ఇచ్చిన భారీ కరెంటు షాక్. విద్యుత్ ఛార్జీల విషయంలో వైసీపీ చేసింది పాపం అయితే రాష్ట్ర ప్రజలకు కూటమి సర్కార్ పెడుతుంది శాపం. గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో ప్రజలకు ఏం సంబంధమని అన్నారు. ఎక్కువ ధరకు విద్యుత్ కొనుగోలు చేస్తే పడే అదనపు భారం ప్రజల నెత్తిన మోపుతారా అని ప్రశ్నించారు. ఐదేళ్లలో వైసీపీ భారం రూ.35 వేల కోట్లు అయితే 5 నెలల్లో కూటమి భారం రూ.18 వేల కోట్లా అని ప్రశ్నించారు. వైసీపీకి మీకు ఏంటి తేడా అన్నారు. వైసీపీ 9 సార్లు ఛార్జీలు పెంచిందని, కూటమి అధికారంలో కొస్తే ఒక్క రూపాయి కూడా ఛార్జీలు పెంచమని, అవసరం అయితే 30 శాతం తగ్గించేలా చూస్తాం అని ఎన్నికల్లో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీలపై కట్టుబడి ఉంటే, తప్పు ఎవరు చేసినా ఆ భారాన్ని ప్రజలపై మోపొద్దనే చిత్తశుద్ధి మీకుంటే.. వెంటనే రూ.18 వేల కోట్ల సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయండని' వైఎస్ షర్మిల ఏపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై పడుతున్న భారంపై నిధులు ఇవ్వాలని ప్రధాని మోదీని గల్లా పట్టి అడగండి. ప్రజల నుంచి ఒక్క రూపాయి కూడా అదనంగా వసూలు చేస్తే ఊరుకోబోం. కూటమి ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ హెచ్చరిస్తోందన్నారు. ప్రజల ముక్కు పిండి ట్రూఅప్ ఛార్జీల రూపంలో, అధిక కరెంటు బిల్లులు వసూల్ చేయడం దారుణం. వసూల్ చేయడాన్ని నిరసిస్తూ రేపటి నుంచి మూడు రోజుల పాటు కాంగ్రెస్ పార్టీ తరఫున రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు పిలుపునిస్తున్నాం అని వైఎస్ షర్మిల స్పష్టం చేశారు.

## సరస్వతీ ప్లాంట్ భూములకు రక్షణ

భూములు విక్రయించేలా నాటి పెద్దలు నమ్మబలికారన్నారు. ఇష్టం లేకున్నా.. ఈ భూములు అమ్మాల్సిన పరిస్థితి తీసుకు వచ్చారని వివరించారు. అందుకోసం ప్రజలు, రైతులపై తీవ్ర ఒత్తిడి తీసుకు వచ్చారన్నారు. క్రమంలో పెట్రోల్ బాంబులు వేసి వారిని భయపెట్టారని గుర్తు చేశారు. ఇక ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావును వేధించి వేధించి చంపేశారన్నారు. ఫర్నిచర్‌పై కోడెలను వేధించిన వ్యక్తి.. ఎ÷-లాంట్ పేరుతో భూములు లాక్కున్నారంటూ వైఎస్ జగన్‌పై పవన్ కల్యాణ్ మండిపడ్డారు. ఎస్సీ కుటుంబాలకు చెందిన 24 ఎకరాల భూమిని భయపెట్టి మరీ తీసుకున్నారని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వివరించారు. లా లాక్కున్న భూముల్లో 20 ఎకరాలు వేమవరంలోనే ఉన్నాయని చెప్పారు. అయితే ఎవరైనా ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే మాత్రం ఊరుకునేది హెచ్చరించారు. అలాగే 24.78 ఎకరాల కుంటలు, చెరువులు స్వాధీనం చేసుకున్నారని వివరించారు. అలా భూములు లాక్కొని సొంత ఆస్తి మాదిరిగా కుటుంబంలో కొట్టుకుంటున్నారని డిప్యూటీ సీఎం వ్యంగ్యంగా పేర్కొన్నారు. సహజ వనరులు ఒకరి సొత్తు కాదు.. ఒకరి సొంతం కాదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఇక పోలీస్ ఉన్నతాధికారులు సైతం మెత్తబడిపోయారన్నారు. లేకుంటే వారు సైతం భయపడుతున్నారా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. స్థానిక యువతను గత ప్రభుత్వంలోని వారు భయపెడితే ఊరుకుంటారా? పెట్రోల్ బాంబులు, నాటు బాంబులు వేసి బెదిరిస్తుంటే ఏం చేస్తున్నారంటూ ఈ సందర్భంగా పోలీస్ ఉన్నతాధికారులను డిప్యూటీ సీఎం ప్రశ్నించారు. ప్రజలను కాపాడాల్సిన బాధ్యత పోలీసులది కాదా? రౌడీయిజాన్ని అరికట్టాల్సిన బాధ్యత పోలీసులదని పవన్ కల్యాణ్ గుర్తు చేశారు. వైసీపీ నాయకులు ఇంకా తమ ప్రభుత్వమే అధికారంలో ఉన్నదన్నట్లుగా ప్రవర్తిస్తున్నారంటూ నిప్పులు చెరిగారు. శాంతి భద్రతలు అంటే ఎంత బలంగా ఉంటాయో వాళ్లకు చూపించాలని పోలీస్ అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు.

# కులగణన ద్వారా అన్ని కులాలకు న్యాయం

(మొదటి పేజీ తరువాయి..)

బలంగా ఉందని అన్నారు. ఇది కాదనలేని వాస్తవమని అన్నారు. అగ్రకులాలకు ఎప్పుడూ కుల వ్యవస్థ అనేది కనిపించదని చెప్పారు. కులగణన ద్వారా ఏళ్లుగా నష్టపోతున్న వారికి న్యాయం జరుగుతుందని అన్నారు. కుల వ్యవస్థ అన్ని రంగాల్లో ఉందని.. రాజకీయ, న్యాయ వ్యవస్థలోనూ అది బలంగా పాతుకుపోయిందని చెప్పుకొచ్చారు. కుల వ్యవస్థ అనేది కొంత మంది ఆత్మ విశ్వాసం దెబ్బతీస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల యువత సైతం ముందుకు వెళ్లలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని రాహుల్ గాంధీ చెప్పారు. తెలంగాణలో జరిగే కులగణన దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని రాహుల్ గాంధీ అన్నారు. కులగణనలో ఏ ప్రశ్నలు అడగాలనేది అధికారులు నిర్ణయించకూడదని, సామాన్యులే నిర్ణయించాలని చెప్పారు. కులవివక్ష, కులవ్యవస్థ ఉన్నప్పుడు అసమానతలు కూడా ఎక్కువగా ఉంటాయన్నారు. దేశంలో కుల వ్యవస్థ, కుల వివక్ష ఉందని అంగీకరిద్దాం. నేను దేశాన్ని విభజించే ప్రయత్నం చేస్తున్నానని ఆరోపణలు చేస్తున్నారు. దేశం గురించి నిజం చెబితే దేశాన్ని విభజించడమా? కులగణన ద్వారా దళితులు, ఓబీసీలు, మహిళల సంఖ్యపై స్పష్టత వస్తుంది. కులగణన తర్వాత ఎవరి దగ్గర ఎంత ఆర్థిక వనరులున్నాయో తెలుసుకుందాం. కులగణన చేస్తామని పార్లమెంట్‌లో స్పష్టంగా చెప్పాను. రిజర్వేషన్ల పరిమితిని తీసేస్తాం అని రాహుల్ గాంధీ అన్నారు. బుధవారం నుంచి కులగణన ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ప్రాథమిక పాఠశాలలకు సర్కార్ ఒంటిపూట బడులను ప్రకటించింది. దేశవ్యాప్తగా ఇప్పటికీ అన్ని రంగాల్లో కుల వివక్ష ఉందన్నారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించడానికి కులగణన అవసరం అన్నారు. ఏ వ్యవస్థలో ఎంత మంది ఓబీసీలు ఉన్నారో తెలియాల్సిఉందన్నారు. కులగణనతో అభివృద్ధి , రాజకీయ స్థితిగతులు మారుతాయని రాహుల్ గాంధీ స్పష్టంచేశారు. తాను దేశవ్యాప్తంగా పర్యటించినప్పుడు దాదాపుగా అన్ని రాష్ట్రాల్లో కుల వివక్ష ఉందని తాను గుర్తించానని అన్నారు. అగ్రకులాలకు ఎప్పుడూ కుల వ్యవస్థ కనిపించదన్నారు. కుల వివక్ష కారణంగా ఇతర కులాల వారు అవకాశాలు కోల్పోతున్నారని చెప్పుకొచ్చారు. తాము అధికారంలోకి రాగానే యాభై శాతం రిజర్వేషన్లను ఎత్తి వేస్తామని కులగణన ద్వారా సమానంగా అందరికీ అవకాశాలు కల్పించాల్సి ఉందన్నారు. ఈ విషయంలో తాను అందరికీ అవకాశం కల్పిస్తానన్నారు. దేశంలోని అన్ని వ్యవస్థల్లో కుల వివక్ష ఉందన్నారు. రాజకీయ న్యాయవ్యవస్థల్లో ఉందని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. దేశంలోని పారిశ్రామికవేత్తల్లో ఎస్సీ, ఎస్టీ, గిరిజన కమ్యూనిటీలకు ప్రాతినిధ్యం తక్కువగా ఉందని ప్రతిభ ఉన్నప్పటికీ వారికి పాలనా వ్యవస్థలో భాగస్వాములయ్యే అవకాశం రావడం లేదన్నారు. అందువల్లే తాము కులగణన చేపట్టామని చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు చేపడుతున్న కులగణన అంటే అది కేవలం కులాల లెక్కలు కాదు. ప్రభుత్వ విధానాల రూపకల్పనకు పునాది అని రాహుల్ గాంధీ స్పష్టంచేశారు. మేము దేశాన్ని చీల్చాలని ప్రయత్నం చేస్తున్నాం అంటున్నారని...దేశంలో సంపదను ఎవరి వాటా వారికి ఇవ్వడం దేశాన్ని చీల్చడమా అని రాహుల్ ప్రశ్నించారు. ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ప్రశ్నలు తయారు చేయాలని రాహుల్ సూచించారు. కులగణన చేసినంత మాత్రాన సరిపోదు. వివిధ కులాల మధ్య సంపద పంపిణీ ఎలా ఉందో అధ్యయనం చేయాలి. అదేవిధంగా బ్యూరోక్రసీ, జ్యుడిషియరీ, మీడియాలో ఓబీసీలు, దళితులు, కార్మికుల భాగస్వామ్యం ఎంతుందో కూడా తెలుసుకోవాల్సి ఉందన్నారు. అందుకే కులగణన చేపట్టామన్నారు. కులగణన విషయంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా ఉంటుందని ఈ విషయంలో తాను తెలంగాణ నాయకత్వాన్ని అభినందిస్తున్నానని తెలిపారు. రాహుల్ గాంధీ కార్యక్రమానికి ప్రముఖులైన ఆహ్వానితుల్ని మాత్రం సమావేశంలోకి ఆహ్వానించారు. ఈ సమగ్ర కుటుంబ సర్వే ఎవరు చేస్తారు, ఎలా చేస్తారు అనే దానిపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. స్కూలు టైమింగ్స్ పూర్తయ్యాక ఉపాధ్యాయులు రోజుకు 5 నుంచి 7 ఇళ్లల్లో సమగ్ర సర్వే చేయనున్నారు.

### - రాహుల్ మాట ప్రకారం కులగణన

ఇందిరా గాంధీ 'గరీబ్ హఠావో' అనే నినాదంతో చరిత్రలో నిలిచారని సీఎం గుర్తుచేశారు. ఇప్పుడు రాహుల్ సామాజిక న్యాయం పేరుతో ఇచ్చిన పిలుపుతో ముందుకు కదులుతున్నామని అన్నారు. ప్రస్తుతం తెలంగాణలో కులగణన చారిత్రకం కాబోతోందని, రాహుల్ గాంధీ నేతలకు మాట ఇస్తే అది శాసనమని రేవంత్ చెప్పారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో కులగణనపై ముందుకెళు_న్నామని, కులగణన చేసి తెలంగాణ దేశంలో ఆదర్శంగా రాష్ట్రంగా నిలవబోతోందని సీఎం రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో చెప్పారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ, ఉపాధి కుల గణన సర్వే ప్రభుత్వం బాధ్యతగా భావించిందన్నారు. పౌరసమాజం నుంచి సూచనలు తీసుకోవడానికి రాహుల్ గాంధీ ఇక్కడకు రావడం గొప్ప విషయమని, ఈ నిర్ణయం తీసుకోవాలంటే గుండె ధైర్యం కావాలన్నారు. సామాజిక బాధ్యత, సమాన అవకాశాలు ఇవ్వాలన్న ఆలోచనతో రాహుల్ గాంధీ ఇక్కడకు వచ్చారని, మాటలు కాదు చేతలతో చూపాలన్నది రాహుల్ గాంధీ ఆలోచన అని ఆయన వ్యాఖ్యానించారు. విద్య, వైద్యం, ఉద్యోగం, సామాజిక న్యాయం ప్రజలకు అందించాలని రాహుల్ గాంధీ అడుగు ముందుకు వేశారని, రాహుల్ గాంధీ ఇచ్చిన మాటను నెరవేర్చడమే మన కర్తవ్యమన్నారు. ఇటీవల నిర్వహించిన గ్రూప్ 1 పరీక్షలో 31,383 మంది మెయిన్స్ కు ఎంపికయ్యారని, ఇందులో ఓసీలు-3076 (9.8శాతం), ఈడబ్ల్యూఎస్- 2774 (8.8శాతం), ఓబీసీలు-17,921(57.11శాతం), ఎస్సీలు-4828 (15.3శాతం), ఎస్టీలు-2783 (8.8శాతం) అని ఆయన తెలిపారు. ఇది మా చిత్తశుద్ధికి నిదర్శనమని ఆయన తెలిపారు. మనది రైజింగ్ తెలంగాణ అని ఆయన వ్యాఖ్యానించారు. దేశానికి రాహుల్ గాంధీ ఇచ్చిన మాటను అమలు చేయడం మన కర్తవ్యమన్నారు. కులగణన పూర్తి చేసి బీసీలకు న్యాయంగా అందాల్సిన రిజర్వేషన్లు అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. కులగణనను 2025 జనగణనలో పరిగణనలోకి తీసుకోవాలని ఈ వేదికపై తీర్మానం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌కు రాగా ఆయనకు సిఎం రేవంత్ తదితరులు ఘనంగా స్వాగతంపలికారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 6 నుంచి తెలంగాణలో ప్రారంభించనున్న కుల గణనపై ప్రజలు, మేధావులు, వివిధ సామాజిక వర్గాల వారి సలహాలు, సూచనలు స్వీకరించేందుకు ఆయన ఇక్కడకు వచ్చారు. బోయిన్ పల్లి గాంధీ ఐడియాలజీ సెంటర్ లో ఈ సదస్సు జరిగింది.

# కాంగ్రెస్ పాలనలో గురుకులాల్లో 36 మంది మృతి

(మొదటి పేజీ తరువాయి..)

హరీష్‌రావు మంగళవారం పరామర్శించారు. కొమరం భీం జిల్లా వాంకిడి మండల గిరిజన బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో ఫుడ్‌పాయిజన్‌తో 60 మంది బాలికలు అస్వస్థతకు గురవగా.. వారిలో ముగ్గురు విద్యార్థినిల పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. చికిత్స పొందుతున్న విద్యార్థినిల్లో ఒకరు వెంటిలేటర్‌పై చావుబతుకుల మధ్య కొట్టమిట్టాడుతున్నారని అన్నారు. ధైర్యంగా ఉండాలని విద్యార్థినిల తల్లిదండ్రులకు చెప్పానన్నారు. గత పదకొండు నెలల కాంగ్రెస్ పాలనలో తల్లిదండ్రుల నమ్మకాన్ని పోగొట్టే విధంగా ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లలో పరిస్థితులు దిగజారిపోయాయని మండిపడ్డారు. గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలన కల్పనలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కరెంట్ షాక్‌లు కూడా కామన్ అయిపోయాయన్నారు. ఇటీవలనే మెదక్ హవేలీ ఘన్ పూర్ బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో పిల్లలకు కరెంట్ షాక్ తగిలి హాస్పిటల్‌లో చేరాల్సి వచ్చిందన్నారు. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చినప్పటికీ దున్నపోతు మీద వాన పడ్డట్లు సర్కార్ వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం, మంత్రులు మహారాష్ట్ర ,ఝార్ఖండ్ ఎన్నికల బిజీగా ఉన్నారని.. రెసిడెన్షియల్ స్కూళ్ల పై పట్టించుకునే తీరిక వారికి లేదన్నారు. రెసిడెన్షియల్ ప్రభుత్వ పాఠశాలల్లో పరిస్థితిపై అప్పటికప్పుడు చర్యలు తీసుకోవడం కాదు.. శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. 36 మంది రెసిడెన్షియల్ విద్యార్థుల మరణాలు ప్రభుత్వం చేసిన హత్యలే అని ఆరోపించారు. ఈ మరణాలపై ప్రభుత్వంలో ఏ స్థాయిలోనూ సమీక్షలు జరగడం లేదన్నారు. కేసీఆర్ హయాంలో 1023 ప్రభుత్వ గురుకులాలు ఏర్పాటు అయ్యాయని తెలిపారు. ప్రతి విద్యార్థిపై సంవత్సరానికి లక్షా 20 వేల రూపాయలు కేసీఆర్ వెచ్చించారని తెలిపారు. కేసీఆర్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఎవరెస్టు స్థాయికి పెంచితే.. రేవంత్ రెడ్డి రెసిడెన్షియల్ స్కూళ్లలో ఎలుకలు విద్యార్థులను కరిచే స్థాయికి తీసుకుపోయారని ఎద్దేవా చేశారు. విద్యార్థులు జబ్బు పడితే కనీస మందులు అందుబాటులో లేవన్నారు. విద్యార్థులు పడుకునేందుకు కనీసం మంచాలు లేవన్నారు. రెసిడెన్షియల్ స్కూళ్లకున్న పేరును పాడు చేయొద్దని హరీష్‌రావు పేర్కొన్నారు.

### - కుటుంబ సర్వే నుంచి టీచర్లను మినహాయించండి

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టబోయే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నుండి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను మినహాయించాలని బిఆర్ఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు.రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కోసం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సేవలను వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించడం విద్యాహక్కు చట్టం ఉల్లంఘన కిందకు వస్తుందని అన్నారు. 36,559 ఎస్జీటీలను, 3414 మంది ప్రధానోపాధ్యాయులను ఈ సర్వేలో భాగం చేస్తూ నవంబర్ 1వ తేదీన విద్యాశాఖ విడుదల చేసిన ఉత్తర్వులు నిబంధనలకు విరుద్ధం అన్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకే పాఠశాలలు నిర్వహించాలనేది ఈ ఉత్తర్వుల సారాంశంగా కనిపిస్తున్నదని హరీశ్‌రావు పేర్కొన్నారు.మీ పాలన పుణ్యమా అని ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలపై ఉన్న నమ్మకం రోజురోజుకీ దిగజారుతున్నది. మీ నిర్లక్ష్యం, అనాలోచిత నిర్ణయాలు విద్యార్థులు, తల్లిదండ్రులకు తోడు ఉపాధ్యాయులకు శాపాలుగా మారుతున్నాయి. ఇప్పుడు కుటుంబ సర్వే పేరుతో టీచర్లు, విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తూ, విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం, ఉపాధ్యాయులను జనాభా గణన లెక్కలు, ప్రకృతి వైపరీత్యాలలో సహాయ విధులు, పార్లమెంటు, రాష్ట్ర శాసన సభ, స్థానిక ప్రభుత్వాలకు జరిగే ఎన్నికలకు సంబందించిన విధులకు మాత్రమే వినియోగించాలని స్పష్టం చేస్తుంది. ఇవి కాకుండా మరేఇతర పనులకు వినియోగించకూడదని విద్యా హక్కు చట్టం నిర్దేశిస్తురది. ఈ నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం కుల గణన కోసం ఉపాధ్యాయులను వినియోగించుకోవడం విద్యా హక్కు చట్ట ఉల్లంఘన కిందికి వస్తుందని హరీశ్‌రావు తెలిపారు. ప్రభుత్వ బడులలో చదివే పిల్లల తల్లిదండ్రులు అత్యధిక శాతం కూలినాలి చేసుకునే వారే. అకస్మాత్తుగా ఒంటి పూట బడులు నడపడం వలన పిల్లలకే కాకుండా తల్లిదండ్రులకు కూడా ఇబ్బందులు ఉంటాయి. పిల్లల చదువులు కుంటుపడటంతో పాటు వారి భవిష్యత్తుపై ప్రభావం పడుతుంది. కాబట్టి, విద్యా హక్కు చట్టాన్ని దృష్టిలో ఉంచుకొని సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నుండి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను మినహాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు తన లేఖలో పేర్కొన్నారు.

# ఆటో డ్రైవర్లూ ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి

(మొదటి పేజీ తరువాయి..)

ఆటోడ్రైవర్ల పరిస్థితి చాలా దయనీయంగా ఉందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరా పార్క్ వద్ద ఆటో డ్రైవర్ల మహాధర్నాలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వస్తుందని ఎన్నడూ అనుకోలే దన్నారు. గత పదేళ్లలో కేసీఆర్ హయాంలో అభివృద్ధి ఫలాలు అనుభవించామని రోజుకు దాదాపు రూ. 2 వేలు సంపాదించే పరిస్థితి ఉండేదని ఆటో డ్రైవర్లు చెప్పారు. ఇప్పుడు రూ. 200 నుంచి రూ. 300 కూడా సంపాదించలేని పరిస్థితి వచ్చిందని ఆటోడ్రైవర్లు ఆవేదన చెందుతున్నారు. గతేడాది రాహుల్ గాంధీ వచ్చి ఆటో ఎక్కి ఆటో డ్రైవర్ల సమస్యలు తీరుస్తానని రంగుల కల చూపించారు. నెలకు వెయ్యి రూపాయలు ఇస్తామన్నారు. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. మనం మంచి కార్యక్రమాలకు వ్యతిరేకం కాదు. మహాలక్ష్మి పేరుతో మహిళలకు రూ. 2500 ఇస్తా అన్నారు. వాటిని ఇవ్వాలని కోరుతున్నాం. కానీ గత 11 నెలల్లో వీళ్లు చెప్పిన దానికి చేసిన దానికి ఎంత తేడా ఉందో?ఏం మార్పు వచ్చిందో ఒక్కసారి ఆలోచించాలని ఆటో అన్నలను కోరుతున్నాని కేటీఆర్ పేర్కొన్నారు. రైతులు, నేత కార్మికులు, ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు ఈ ప్రభుత్వం వచ్చాక ప్రారంభ మయ్యాయి. ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వస్తుందని ఎప్పుడూ అనుకోలేదన్నారు. శాసన సభలో ఆత్మహత్యలు చేసుకున్న వారి పేర్లతో సహా మేము చెప్పాం. వాళ్ల కుటుంబాలను కూడా ఆదుకోలేదు. ఉచిత బస్సు ప్రయాణానికి మేము వ్యతిరేకం కాదు. కానీ మీరు ఆటో డ్రైవర్లకు ఇస్తా అన్న నెలకు వెయ్యితో పాటు రూ. 5 వేలు నెలకు ఇవ్వాలని కోరుతున్నా. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డును వచ్చే శాసనసభ సమావేశాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించాలి. థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్‌ను ఆటో డ్రైవర్లు కావాలని కోరుతున్నారు. ప్రభుత్వం ఈ డిమాండ్‌ను నేరవేర్చాలి. మా ప్రభుత్వం తెచ్చిన ఇన్సూరెన్స్‌ను తీసివేసే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. అది సరికాదు. కేంద్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇబ్బంది పెట్టేలా చట్టం చేసింది. అది కూడా రద్దు చేయాలి. గతంలో కాంగ్రెస్ పార్టీ మీకు చాలా హామీలు ఇచ్చి?మీ నోట్లో మట్టి కొట్టింది. రాహుల్ గాంధీ చెప్పిన తియ్యని, కమ్మని మాటలు గుర్తు చేసుకోవాల్సిన అవసరముంది అని కేటీఆర్ పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లు ఇక్కడకు ఎక్కువ మంది రాకుండా పోలీసులు ప్రయత్నం చేశారు. దయచేసి పోలీసులు అలా చేయవద్దు. ఎందుకంటే మిమ్మల్ని మీతోనే కొట్టించే పరిస్థితి తీసుకువచ్చారు. పోలీసులు డ్యూటీలు చేయండి. కానీ పేద వాళ్ల పట్ల దయతో ఉండండి. సెక్యూరిటీ లేకుండా బయటకు వెళితే రేవంత్ రెడ్డిని తన్నే పరిస్థితి ఉంది. అందుకే ఆయనకు భయం పట్టుకుంది. నల్గొండలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఉన్న కాంగ్రెస్ పార్టీ సభలో కాంగ్రెస్ నాయకుడే మనం బయటకు వెళితే తన్నే పరిస్థితి ఉందని చెప్పాడు. మనం ఇచ్చిన హామీలు ఒక్కటి నెరవేర్చలేదని చెప్పాడు. రేవంత్ రెడ్డికి పోలీసుల మీద కూడా నమ్మకం లేక సెక్యూరిటీలో నుంచి బెటాలియన్ పోలీసులను తీసేశారు. నిరుద్యోగులు, రైతులు, వృద్ధులు, మహిళలు అందరినీ కాంగ్రెస్ మోసం చేసిందని కేటీఆర్ మండిపడ్డారు. ఎన్ని కేసులు పెట్టినా, జైల్లో పెట్టినా సరే ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల కోసం పోరాడతాం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని మనం కోరుతున్నాం. కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం అందరూ కలిసి పోరాటం చేయాల్సిన అవసరముంది. మీ తరఫున శాసనసభలోనూ మేము పోరాటం చేస్తాం. మీడియా కూడా భయపడకుండా పోరాటం చేసే వాళ్ల సమస్యలకు మద్దతుగా నిలవాలని కోరుతున్నానని కేటీఆర్ తెలిపారు.

### -సాగునీటి రంగం బలోపేతం చేసిన కెసిఆర్

ఉమ్మడి ఏపీలో రైతులకు మేలు చేయాలని పాలకులు ఆలోచించ లేదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ప్రత్యేక తెలంగాణలో కెసిఆర్ రైతుల బాగు గురించి ఆలోచించి సాగునీటి రంగానికి ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. దీంతో భూముల ధరలు కూడా పెరిగాయని అన్నారు. తన తాతకు 400 ఎకరాల ఆస్తి ఉండేదని.. అయితే అన్ని ఎకరాలు ఉన్నప్పటికీ నీళ్లు లేకపోవడంతో అవి నిరుపయోగంగా, విలువ లేకుండా ఉండేవన్నారు. నగరంలోని శ్రీనగర్ కాలనీలో నిర్వహించిన తెలంగాణ రియల్టర్స్ ఫోరమ్ సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ఎన్నికల ముందు మార్పు కోసం అని కాంగ్రెస్ నేతలు ఊదరగొట్టారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పుడు పెట్టుబడులు రావని భయపెట్టారు. ప్రత్యేక తెలంగాణ వచ్చినప్పుడు 2 రోజులు పవర్ హాలీడే ఉండేది. 2014కు ముందు రాష్ట్రంలో భూముల ధరలు చాలా తక్కువగా ఉండేవి. భారాస అధినేత కేసీఆర్ కృషి వల్లే భూముల ధరలు పెరిగాయి. సాగునీరు లేకపోతే వ్యవసాయం చేయడం సాధ్యం కాదు. అదే జరిగితే సంపద సృష్టించడం అసాధ్యం. కేసీఆర్ పాలనలో 24 గంటల విద్యుత్, అనేక సంక్షేమ పథకాలు అమలు చేశాం. తెలంగాణలో సంపద పెరిగింది. సాగునీటి సదుపాయాలు మెరుగయ్యాయి. తొమ్మిదిన్నరేళ్ల భారాస పాలన తర్వాత తెలంగాణలో వచ్చిన మార్పులు, చేసిన అభివృద్ధి ఏంటనేది తెలంగాణ ప్రజలందరికీ తెలుసని కేటీఆర్ అన్నారు.

## చంద్రబాబుతో మందకృష్ణ మాదిగ భేటీ

(మొదటి పేజీ తరువాయి..)

అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబును మంగళవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు 32 అంశాలపై చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చామన్నారు. వర్గీకరణ సహా వివిధ అంశాలపై గంటపాటు చర్చించామన్నారు. కూటమి గెలుపులో మా భాగస్వామ్యం ఉందని గుర్తించాలి. తెదేపా, జనసేన, భాజపాతో కలిసి నాలుగో స్తంభంగా మేం పని చేశాం. మాదిగలకు అన్ని చోట్లా భాగస్వామ్యం కల్పించాలనేదే మా లక్ష్యం' అని మందకృష్ణ తెలిపారు. పవన్ కల్యాణ్ దళిత బిడ్డ అయిన హోంమంత్రి వంగలపూడి అనితను అవమానించారని మండిపడ్డారు. ఏదైనా అంశం ఉంటే కేబినెట్‌లో చర్చించుకోవాలన్నారు. వంగలపూడి అనితపై అలా మాట్లాడటం దురదృష్టకరమన్నారు. అభిప్రాయం ఎలా ఉన్నా పబ్లిక్‌లో మాట్లాడటం సరి కాదన్నారు. హోంశాఖకు సంబందించిన అభ్యంతరాలు ఉంటే.. కేబినెట్‌లో చర్చించుకోవడమే ముఖ్యమన్నారు. ఇలా ప్రజల ముందు పెట్టి దళిత బిడ్డ అయిన వంగలపూడి అనితను అవమానించడం సరి కాదని మందకృష్ణ అన్నారు. ఈ విషయాన్ని తాము మనసులో పెట్టుకుంటామన్నారు. పవన్ కల్యాణ్ మాదిగలకు ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. ఎన్నికల సమయంలో సామాజిక న్యాయం గురించి పవన్ మాట్లాడారని.. అయితే ఆయన పార్టీ తరఫున పోటీ చేసేందుకు అవకాశం వచ్చిన మూడు స్థానాల్లో ఒక్క చోట కూడా మాదిగ వర్గానికి చెందిన నేతకు అవకాశం ఇవ్వలేదన్నారు.గోదావరి జిల్లాల్లో రెండుచోట్ల పోటీకి అవకాశం వస్తే ఒకే వర్గానికి ఇచ్చారని మరి రాయలసీమలో రైల్వే కోడూరులో అయినా మాదిగవర్గానికి అవకాశం ఇవ్వాల్సి ఉందని కానీ పవన్ కల్యాణ్ అక్కడ కూడా మాల వర్గానికి చెందిన వారికే ఇచ్చారన్నారు. అక్కడ మాదిగలు గెలిచి మంత్రులు కూడా అయ్యారని గుర్తు చేశారు. జనసేన పాటించే సామాజిక న్యాయం ఇదేనా అని ఆయన ప్రశ్నించారు.అందర్నీ సమానంగా చూడాలన్నారు. జనసేన తరఫున ముగ్గురు మంత్రులు అయ్యారని అందులో రెండు సామాజికవర్గాలకు చెందిన వారే ఉన్నారన్నారు. రెండు పదవులు ఇతరులకు పోయినా ఒక్క పదవిని అయిన బడుగు బలహీనవర్గాలకు ఇవ్వాలి కదా అని ప్రశ్నించారు. జనసేన పార్టీ అన్ని వర్గాలను ఆదరిస్తేనే గెలిచిందని గుర్తు చేసుకున్నారు. ఒక ఎస్సీ,ఎస్టీ లేదా బీసీకి ఇవ్వొచ్చు కదా అని ప్రశ్నించారు. పవన్ వెనుక కష్టనష్టాల్లో ఉన్న బలహీనవర్గాల వారికి అవకాశం కల్పించాల్సి ఉందన్నారు. మందకృష్ణ వ్యాఖ్యలు వైరల్ గా మారుతున్నాయి.

## ముఖ్య మంత్రి ని కలిసిన డెడికేటెడ్ కమీషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వర రావు



(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు. హైదరాబాద్ బ్యూరో, నవంబర్ 5:**
జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంగళ వారం డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వర రావు మర్యాద పూర్వకంగా కలిశారు. వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి న్యాయస్థానాల సూచనలను పరిగణలోకి తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం డెడికేటెడ్ (ప్రత్యేక) కమిషన్ చైర్మన్‌గా వెంకటేశ్వర రావు ను నియమించిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే రాష్ట్ర ముఖ్య మంత్రి నీ చైర్మన్ గా నియామకమైన వెంకటేశ్వర రావు కలిశారు.

## నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించిన మంత్రులు

- విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రులు పొన్నం, కొండ ఆదేశం



( రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు. హైదరాబాద్ బ్యూరో, నవంబర్ 5:**
కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో అనారోగ్యానికి గురై నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించి
విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై సహచర మంత్రి కొండా సురేఖ తో కలిసి నిమ్స్ డైరెక్టర్ బీరప్ప ను అడిగి తెలుసుకోన్న మంత్రి పొన్నం ప్రభాకర్. ఈ సందర్భంగా మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థినులకు మంచి వైద్యం అందించాలని డాక్టర్లను ఆయన ఆదేశించారు.విద్యార్థినులు ఆరోగ్యం నిలకడగా ఉందని ధైర్యంగా ఉండాలని తల్లిదండ్రులకు మంత్రి ప్రభాకర్ తెలిపారు.

## రాష్ట్రంలోని భూదాన్ భూములను పేదలకు పంచాలి: సీపీఐ




**వెలుతురు, హైదరాబాద్, నవంబర్ 5:**
సిపిఐ పార్టీ హైదరాబాద్ కౌన్సిల్ రౌండ్ టేబుల్ సమావేశం మంగళవారం జరిగింది, రాష్ట్రంలో అన్యాక్రాంత మైన భూదాన్ భూములను స్వాధీనం చేసుకొని అర్హులైన పేదలకు భూములు పంచాలని ఈ కార్యక్రమంలో ప్రసంగించిన తెలుగు రాష్ట్రాల సర్వసేవ సంఘ్ సర్వోదయమండలి ప్రధాన కార్యదర్శి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఎమ్మెల్యే పాల్వాయి దీక్ష

### అటవీ అధికారులపై చర్యకు డిమాండ్

**కొమురంభీం,నవంబర్5( వెలుతురు):**
అటవీ అధికారులపైచర్యతీసుకోవాలని కోరుతూ చేపట్టిన ఎమ్మెల్యే పాల్వాయి దీక్ష కొనసాగుతున్నది. సిర్పూర్ (టి ) అటవీ శాఖ కార్యాలయం ముందు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు నిరాహార దీక్ష కొనసాగుతోంది. ఈ దీక్ష రెండురోజులుగా కొనసాగుతోంది. సోమవారం నుంచి ఎమ్మెల్యే దీక్ష చేస్తుండటంతో ఆయన ఆరోగ్యంపై బీజేపీ నేతలు ఆందోళన చెందుతున్నారు. వైద్యులు ఎమ్మెల్యేను పరీక్షించారు. బెంగాలీ క్యాంపు రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి, అక్రమ కేసులు పెట్టిన అటవీ అధికారులపై చర్యలకు ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. అమాయక రైతులపై అటవీశాఖ దాడులు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకునేదాకా దీక్ష విరమించేది లేదని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు స్పష్టం చేశారు.కాగా.. వారం రోజుల క్రితం మండలంలోని బెంగాలీ క్యాంపునకు చెందిన ఏడుగురిపై అక్రమంగా కేసుపెట్టి చితకబాధిన అటవీశాఖ అధికారుల తీరును నిరసిస్తూ నిరాహారదీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. గతంలో సైతం అటవీశాఖ అధికారులు వన్యప్రాణులను చంపారన్న నెపంతో లక్షలు వసూలు చేసి కాగజ్‌నగర్ డీఎఫ్‌వోకు కట్టబెట్టారని ఆరోపించారు. అలాగే కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో కేంద్ర ప్రభుత్వం నుంచి అటవీశాఖకు మంజూరైన కంపా నిధులలో అటవీ అధికారులు లక్షలరూపాయల అవినీతికి పాల్పడ్డారని అవికూడా బహిర్గతం చేయాలన్నారు. అటవీశాఖ అధికారులపై రాష్ట్ర, మంత్రి, మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు తెలిపారు.

# 2050- విజన్‌తో వరంగల్ మాస్టర్ ప్లాన్ సిద్ధం

యుద్ధప్రాతిపదికన వరంగల్ ఎయిర్ పోర్ట్ పనులు

వరంగల్ అభివృద్ధిపై విస్తృత స్థాయి సమావేశం

రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాలు, వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి శ్రీపొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 05:**
గొప్ప చారిత్రిక నేపథ్యం ఉన్న వరంగల్ నగర అభివృద్ధికి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 2050 జనాభాను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన మాస్టర్ ప్లాన్ తుది దశకు చేరుకుందని త్వరలో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మాస్టర్ ప్లాన్‌ను విడుదల చేస్తారని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాలు , వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి శ్రీపొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎమ్ .సి. హెచ్ .ఆర్.డీ లో వరంగల్, హన్మకొండ జిల్లాల అభివృద్ధి కార్యక్రమాలపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి , ఆయా జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన మాస్టర్ ప్లాన్ , వరంగల్ ఇన్నర్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్, భద్రకాళి టెంపుల్ అభివృద్ధి, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, మెగా టెక్స్‌టైల్ పార్క్, మామునూరు ఎయిర్‌పోర్ట్, ఎకో టూరిజం తదితర అంశాలపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ హైదరాబాద్ నగరానికి ధీటుగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి పరచాలన్న కృతనిశ్చయంతో వరంగల్ నగర అభివృద్ధిపై గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న వరంగల్ మాస్టర్ ప్లాన్‌ను తమ ప్రభుత్వం కొలిక్కి తీసుకువచ్చిందని అన్నారు. అభివృద్ధి పనుల వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఇన్నర్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్‌కు అవసరమైన భూసేకరణను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 41 కిలోమీటర్ల పరిధి ఉన్న వరంగల్ ఔటర్ రింగ్ రోడ్డును మూడు దశల్లో చేపట్టాలని మొదటి దశలో 20 కిలో మీటర్లు, రెండవ దశలో 11 కిలోమీటర్లు, మూడవ దశలో 9 కిలోమీటర్లు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. హైదరాబాద్ మినహా రాష్ట్రంలో మరెక్కడా ఎయిర్‌పోర్ట్ లేదని వరంగల్ జిల్లాలో ఎయిర్ పోర్ట్ రాబోతోందని, వీలైనంత త్వరగా ఎయిర్‌పోర్ట్ పనులను ప్రారంభించి ఏడాదిలోపు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన కార్యాచరణను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. 382 ఎకరాల పరిధిలో ఉన్న చారిత్రాత్మకమైన భద్రకాళి చెరువులో పేరుకుపోయిన పూడికను తీయాలని , ఇందుకు సంబంధించిన పనులను రేపటినుంచే మొదలు పెట్టాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండ చెరువును ఖాళీ చేయాలని అధికారులకు సూచించారు . ఈ చెరువు 40 శాతం గుర్రపుడెక్కతో నిండిపోయిందన్నారు. మెగా టెక్స్ టైల్ పార్క్ లో ఏర్పాటు చేసిన కంపెనీలు తప్పనిసరిగా స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులను వీలైనంత త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య, శాసనసభ్యులు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కె.నాగరాజు, నాయిని రాజేందర్ , ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ మేయర్ శ్రీమతి గుండు సుధారాణి, సిఎం ప్రత్యేక కార్యదర్శి బి. అజిత్ రెడ్డి, ఎం.ఎ.యూ.డి. ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్, రోడ్లు , భవనాల కార్యదర్శి శ్రీమతి హరిచందన, హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు సత్యశారద, పి. ప్రావీణ్య తదితరులు పాల్గొన్నారు



## రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు కేంద్రాలు సాఫీగా జరిగేందుకు చర్యలు: సిఎం

**వెలుతురు. హైదరాబాద్ బ్యూర్. నవంబర్ 5:**
రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను సమర్ధంగా అమలు చేసేందుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఉమ్మడి జిల్లాకో ఐఏఎస్?ను ప్రత్యేక అధికారిగా నియమించింది. రైతులకు ఇబ్బంది తలెత్తకుండా అన్ని జిల్లాల్లో కొనుగోళ్లు చేపట్టాలని, ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని సీఎం రేవతి ఆదేశించారు. కొనుగోళ్లు జరుగుతున్న తీరును పరిశీలించి, ఏమైనా సమస్యలుంటే అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు. జిల్లా లకు ప్రత్యేకాధికారులు ఆదిలాబాద్, నిర్మల్?,



కుమ్రంభీం అసిఫాబాద్?, మంచిర్యాల జిల్లాలకు కృష్ణ ఆదిత్య,కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా జిల్లాలకు ఆర్‌వీ కర్ణన్,నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేటకు అనితా రామచంద్రన్ ,నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు డా. ఏ.శరత్, రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ మల్కాజ్?గిరి జిల్లాలకు డి. దివ్య , మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల్ మరియు నాగర్‌కర్నూల్ జిల్లాలకు రవి ,వరంగల్, హనుమకొండ, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాలకు టి. వినయ కృష్ణా రెడ్డి మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు హరిచందన దాసరి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు కె. సురేంద్ర మోహన్



*హైదరాబాద్ లోని బోయినపల్లి లోని గాంధీ ఐడియాలజీ సెంటర్ లో జరిగిన కులగణన డెలిగేట్ మీటింగ్ లో పాల్గొన్న జాజుల లింగం గౌడ్ రాష్ట్ర కార్యదర్శి బిసి సంక్షేమ సంఘం తెలంగాణ.*

హైదరాబాద్ వెలుతురు నవంబర్ 05

## ఐఏఎస్ అమోయ్ కుమార్ పై ఎందుకీ కక్ష .....??


### బీసీగా పుట్టడమే ఐఏఎస్ అమోయ్ కుమార్ కు శాపమా...??

### అమోయ్ కుమార్ కు మద్దతుగా పోరుకు బీసీ సంఘాలు సిద్ధం కావాలని పిలుపునిచ్చిన బీసీ నేత జాజుల లింగంగౌడ్



బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్

**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 05:**
ఎంత కష్టపడి చదువుకున్న. ఉన్నత స్థాయి హోదా సాధించిన. అమితమైన పరిజ్ఞానం కలిగి ఉన్న. పేరు చివర రెండు అక్షరాల తోక లేకపోతే మాత్రం గౌరవం ఉండదా..! వివక్ష తప్పదా..? వెనుకబడిన కులంలో పుట్టడం శాపమై వేదిస్తదా.? అందరూ సుద్దపూసలే.. కానీ ఒక బీసీ బిడ్డ ఐఏఎస్ అమోయ్ కుమార్ ఒక్కడే అవినీతికి సహకరించిన అధికారి అయితడా..? ఎవరికి తెలియని రాజనీతి. ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. అటెండర్ స్థాయి నుంచి ఉన్నతాధికారి స్థాయి ఉద్యోగుల వరకు పోస్టులను ఇచ్చేది ఎవరు. బదిలీలు చేయించేది ఎవరు. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల కులాలను బట్టే కదా ఆ ప్రాంతంలో కీలక శాఖల ఉద్యోగుల భర్తీ ఆధారపడి ఉండేది. ఇది అందరూ ఒప్పుకోవాల్సిన నిష్టూర సత్యమే కదా. అయినా గత, ప్రస్తుత ప్రభుత్వాల పాలనలో అధికార పార్టీ నేతల ఆదేశాలు తోసిరాజని పనిచేసే అధికారులు ఎంతమంది ఉంటారో ఎవరైనా లెక్క తేల్చగలరా.....ఇటువంటి రాజకీయ కుల ఆధిపత్య వ్యవస్థలో.. కలెక్టర్ గా తనదైన శైలిలో



ప్రజలకు సేవలు అందిస్తూ.. పనిచేసిన ప్రతి జిల్లాలోనూ తన నిష్పక్షపాత నిధుల నిర్వహణతో అందరి మన్ననలు అందుకున్న ఐఏఎస్ అమోయ్ కుమార్.. ఇప్పుడు ప్రభుత్వానికి ఎందుకు లక్ష్యంగా మారి.. అవినీతి మరక వేయించుకోవాల్సి వచ్చింది. ప్రభుత్వం.. ప్రతిపక్ష పార్టీ పెద్ద తలలను బయటకు లాగేందుకు అమోయ్ కుమార్ ను పావుగా వాడుకుంటుందా అనే ప్రశ్న బీసీ వర్గాల్లో ఉంది. వాస్తవంగా.. గత ప్రభుత్వ హయాంలో అక్రమంగా భూములకు అధికారిగా క్లియరెన్స్ ఇచ్చి ఉంటే.. ఇప్పటి ప్రభుత్వం రద్దు చేసే అవకాశం ఉంది. కానీ ఒక వెనుకబడిన కులానికి చెందిన ఐఏఎస్ అమోయ్ కుమార్ ను ఒంటరిని చేసి.. కోట్ల రూపాయల అవినీతికి పాల్పడినట్లుగా బదనాం చేసి అతని సిన్సియార్టీని అపహాస్యం చేయడం.. ఏ మేరకు సమంజసం అనే ప్రశ్న బీసీ వర్గాల్లో ఉదయిస్తుంది. గత ప్రభుత్వ హయాంలో పెద్దల ఆదేశాలు లేకుండా ఏ అధికారి అయినా పని చేశారా.. అనే ప్రశ్నకు ఎప్పటికైనా సమాధానం లభిస్తుందా. అట్లాంటి పరిస్థితుల్లో ఉన్నత స్థాయి అధికారిగా అప్పటి ప్రభుత్వ పెద్దల ఒత్తిళ్లకు తలొగ్గి ఏదైనా పొరపాటు చేసి ఉంటే.. ఆ భూముల హక్కుల రద్దు చేయవచ్చు. కానీ బలహీన వర్గాలకు చెందిన అధికారిని టార్గెట్ చేసి సమాజం ముందు అతడిని అవినీతిపరుడిగా చిత్రీకరించే ప్రయత్నం చేయడం బీసీ వర్గాలను విస్మయానికి గురిచేస్తుంది. అందుకే రాష్ట్రంలోని బీసీ సంఘాలు ఐఏఎస్ అమోయ్ కుమార్ కు జరిగిన అన్యాయంపై పోరాడేందుకు సమాయత్తమవుతున్నాయి. రాష్ట్రంలో బీసీల ఉద్యమం ఊపందుకున్న నేపథ్యంలో ఒక బీసీ కలెక్టర్ ను కాపాడుకునేందుకు ఆయనకు అండగా నిలిచేందుకు బీసీ సంఘాల పెద్దలు సంసిద్ధమవ్వాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తెలిపారు.

## రాహుల్ స్వాగతంలో అంబనీతో ఉన్న ఫ్లెక్సీలు

### కావాలనే చేశారని మండిపడుతున్న అనుచరులు

**హైదరాబాద్,నవంబర్5( వెలుతురు):**
కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ రాష్ట్రంలో పర్యటించనున్న సందర్భంగా ఆయనకు స్వాగతం పలుకుతూ కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వాటిలో ప్రముఖ పారిశ్రామిక వేత్త అదానీతో కలిసి రేవంత్ రెడ్డి దిగిన ఫ్లెక్సీలు కూడా ఉన్నాయి. అయితే కొందరు వీటిని కావాలనే ఏర్పాటుచేసినట్లు అర్థం అవుతోంది. దీనిపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అదానీ కంపెనీతో ఒప్పందం చేసుకోవడం, పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించడం జరిగింది. అయితే రామన్నపేటలో అంబానీకి చెందిన అంబూజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకు వెళ్తున్నదని స్థానికులు మండిపడుతున్నారు. ఇది అంబానీ–రేవంత్ బంధానికి నిదర్శణమని చెబుతున్నారు. ఈ క్రమంలో కొందరు కావాలనే ఇలాంటి ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు అర్థం అవుతోంది.

## వికీపీడియాకు కేంద్రం నోటీసులు జారీ

**న్యూఢిల్లీ, నవంబర్ 5 ( వెలుతురు):**
ప్రముఖ వ్యక్తులు.. చారిత్రక కట్టడాలు.. ప్రముఖ ప్రదేశాలు.. ఇలా ఏ సమాచారం కావాలన్నా ముందుగా గుర్తొచ్చేది వికీపీడియా. ఈ ఎన్‌సైక్లోపీడియా మనకు చితంగా సమాచారన్ని అందిస్తోన్న విషయం తెలిసిందే. అయితే, ఈ వికీపీడియాకు కేంద్రం నోటీసులు జారీ చేసింది. ఇందులో కచ్చితత్వం లేని సమాచారం ఉంటోందన్న ఫిర్యాదుల మేరకు నోటీసులు పంపింది. వికీపీడియాలో పక్షపాతంగా సమాచారం ఉంటోందని పలువురు నుంచి ఫిర్యాదులు అందినట్లు కేంద్రం నోటీసుల్లో తెలిపింది. చిన్న సంపాదకులకు, సంస్థలకు కూడా కంటెంట్‌పై ఎడిటోరియల్ నియంత్రణ ఉంటుందని.. వికీపీడియాకు ఆ వ్యవస్థ ఎందుకు లేదని ప్రశ్నించింది. వికీపీడియాను మధ్యవర్తిగా కాకుండా.. పబ్లిషనర్‌గా ఎందుకు పరిగణించకూడదని ప్రశ్నించింది. కొంతమంది వ్యక్తులతో కూడిన బృందానికి మాత్రమే ఈ పేజీల్లోని సమాచారంపై నియంత్రణ ఉందనే అభిప్రాయం ప్రజల్లో ఉందని పేర్కొంది. కాగా, ఇటీవలే వికీపీడియా న్యాయపరమైన చిక్కులు ఎదుర్కొంటోన్న విషయం తెలిసిందే. ప్రముఖ న్యూస్ ఏజెన్సీ ఏఎన్‌ఐ కూడా వికీపీడియాపై కోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు దావా వేసింది. ఈ విషయంలో ఢిల్లీ హైకోర్టు వికీపీడియాపై ఆగ్రహం కూడా వ్యక్తం చేసింది.

## పెండింగ్ బిల్లులు, అన్ని డిఏలు, పిఆర్సి ని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించిన (TPUS) తపస్



వెలుతురు యాదాద్రి భువనగిరి జిల్లా నవంబర్ 05:
తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ పిలుపుమేరకు ఉపాధ్యాయ ధర్మాగ్రహదీక్ష లో భాగంగా పెండింగ్ లో ఉన్న 4 డిఏలు, ఏరియర్స్ తో సహా అన్ని రకాల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, పిఆర్సి ని వెంటనే ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 05 మంగళవారం నాడు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ముందు సాయంత్రం 4 గంటలకు తపస్ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శాంతియుత ధర్నా మరియు నిరసన కార్యక్రమం నిర్వహించి, శ్రీయుత జిల్లా కలెక్టర్ గారికి మెమోరాండం సమర్పించడం జరిగిందని తపస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రేపాక ఉమా, కొమిరెల్లి భాస్కర్ రెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలియజేశారు ఉద్యోగ ఉపాధ్యాయులను మభ్యపెట్టి మేనిఫెస్టోలో వారికి సంబంధించిన అంశాలను ఆకర్షణీయంగా చెప్పి వారి మద్దతు పొంది గద్దెనెక్కి వారి మేనిఫెస్టోను మరిచి అధికారంలోకి వచ్చిన 15 రోజులలో పెండింగ్ బిల్లులను చెల్లిస్తామని తక్షణమే పెండింగ్లో ఉన్న అన్ని డి.ఏ లను ప్రకటిస్తామని ఆరు నెలల్లో పిఆర్సి నివేదికను తెప్పించుకొని పిఆర్సిని అమలుపరుస్తామని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పది నెలలు కావస్తున్నా వాటి ఊసే లేకుండా ఐదు డిఏలు పెండింగ్లో ఉంటే ఒకటి ప్రకటించి ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లను ఉసూరుమనిపించి మోసం చేశారని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని విమర్శించారు. ప్రభుత్వ తాత్సార నిర్లక్ష్య వైఖరికి నిరసనగా తపస్ రాష్ట్రస్థాయిలో చేపట్టిన ఉద్యమ కార్యాచరణలో భాగంగా మంగళవారం రోజున జిల్లా కలెక్టరేట్ ముందు నిరసన కార్యక్రమం చేసి జిల్లా కలెక్టర్ గారికి సమస్యలతో కూడిన వినతి పత్రం సమర్పించడం జరిగిందని తెలియజేశారు. ప్రభుత్వ వైఖరి ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల పట్ల ఇలానే కొనసాగితే రాబోయే కాలంలో పెద్ద ఎత్తున నిరసన చవి చూడాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయుల పట్ల తమ నిర్లక్ష్య ధోరణిని మార్చుకొని ఉద్యోగ ఫ్రెండ్లీ ప్రభుత్వం అని చెప్పుకున్న విధంగా సమస్యలన్నిటినీ వెంటనే పరిష్కరించి ఉద్యోగ ఉపాధ్యాయుల పట్ల తన యొక్క సానుకూల వైఖరిని ప్రదర్శించాలని తెలియజేశారు. ఇట్టి ధర్నా కార్యక్రమానికి జిల్లాలో తపస్ రాష్ట్ర కార్యదర్శి సి వి శ్రీనివాస్, తపస్ రాష్ట్ర క్రీడా కో కన్వీనర్ కొత్తకొండ శ్రీధర్, జిల్లా, మండల బాధ్యులు పొట్లపల్లి స్వామి, , మంజుల, వై వి ఎన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, వేణు,సంతోష్, యాదగిరి, వెంకటేశ్వర్లు, గౌరీశంకర్ ,దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



# సంపాదకీయం..

## కుదిపేస్తున్న ధరల దాడి..

# ద్రవ్యోల్బణం !

దేశంలో ద్రవ్యోల్బణ పరిస్థితులను నివారించడంలో పటిష్టమైన చర్యలు తీసుకోవడం లేదు. రూపాయి మారకం విలువ నానాటికి దిగజారుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం 84 రూపాయలు దాటింది. ధరలు స్వారీ చేస్తున్నాయి. ప్రధానంగా బియ్యం,ఉప్పు,పప్పుల ధరలు విపరీతంగా పెరుగుతున్నా అజమాయిషీ చేయడంలేదు. ధరలను కంట్రోల్ చేయడం తమ పని కాదన్న రీతిలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయి. ధరలను అదుపు చేసే యంత్రాంగం లేకుండా పోయింది. పాలకులకు ఇది పని కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. మరీ ముఖ్యంగా మోదీ పాలనలో గత పదేళ్లుగా అన్నిరకాల వస్తువుల ధరలు, మందుల ధరలు దాడి చేస్తున్నా పట్టించుకోవడం లేదు. జిఎస్టీ గురించి సమీక్షించకుండా నిరంకుశం గా వ్యవహరిస్తున్నారు. దీనికితోడు నిత్యావసర ధరలతో పాటు, నిత్యం వాడే మందుల ధరలు కూడా ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. ఇవన్నీ వాటంతట అవే పెరుగుతున్నాయని అనుకోవడానికి లేదు. అయినా నియంత్రించే వ్యవస్థ లేకుండా పోయింది. వ్యాపారులపై అజమాయిషీ లేకపోవడంతో ధరలతో దాడి చేస్తున్నారు. పేదవాడు మరింత పేద వాడుగా, ధనవంతులు మరింత ధనవంతులుగా మారుతున్నారు. పేదరిక నిర్మూలన గురించి మాట్లాడుతున్న మోదీ సర్కార్ ఈ పరిస్థితులను సమీక్షించడం లేదు. ఎక్కడ పేదరికం పోయిందో చెప్పడం లేదు. పేదరికం పోతే పేదలకు ఉచిత బియ్యం పంపిణీ ఎందుకు చేస్తున్నారో చెప్పడం లేదు.

వ్యవసాయోత్పత్తులను పెంచి, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడం ద్వారా దేశంలోని పేదలకు అన్నం పెట్టాలన్న ప్రణాళికలకు అడుగులు పడడం లేదు. సహజంగానే వ్యవసాయిక దేశమైన భారత్‌లో ఉన్న నేలలు అన్ని పంటలకు అనువుగా ఉన్నాయి. సహజవనరులు కూడా ఉన్నాయి. పరిమితంగా ఉన్న వనరులను సమర్ధవంతంగా ఉపయోగించడం వంటి విధానాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాటించట్లేదు. పథకాల పేరుతో పంచడం తప్ప, ఆదాయం పెంచే మార్గాలను అన్వేషించడం లేదు. నీటి వనరులను సద్వినయోగం చేసే దిశగా సాగడం లేదు. వ్యవసాయోత్పత్తులు పెరుగుతున్నా వాటిని ప్రజలకు చేరవేయడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. అలాగే వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహించి..వేదేశీ మారక ద్రవ్యం సంపాదించేలా ప్రణాళికలు లేకుండా పోయాయి. వ్యవసాయ అభివృద్ధి, పరిశ్రమల అభివృద్ధి కుంటుపడటమే ధరలు నానాటికీ పెరగడానికి కారణంగా చూడాలి. ఇబ్బడిముబ్బడిగా ఉచిత పథకాలు, డబ్బుల పందేరంతో ప్రజలను సోమరులుగా తయారు చేస్తున్నారు. అన్నింటికీ ప్రభుత్వాలపై ఆధారపడేలా చేస్తున్నారు. పేదరికానికి మూలం ప్రభుత్వ విధానాలే అన్నది గుర్తించడం లేదు. ప్రజలను దేశ ఉత్పత్తిలో భాగస్వాములుగా చేయడం అన్నది పక్కన పెట్టేశారు. ప్రజలను చైతన్యవంతులుగా, విజ్ఞానవంతులుగా, ఆలోచనా పరులుగా, అవగాహనాపరులుగా చేస్తే తమకు ముప్పు అన్న ఆలోచనలో రాజకీయ పార్టీల నేతలు, పాలకులు ఉన్నారు. భారతదేశంలో ఆర్థిక, సామాజిక, రంగాల అభివృద్ధి జరుగుతుందని అనుకుంటున్నా అది ఎంతన్నది ...మన ఆర్థికాభివృద్దిని లెక్కలేసుకుంటే కొంతేనని తేలుతుంది. భారతదేశ ఆర్థిక వ్యవస్థ నానాటికీ దిగజారి చివరకు ఎటుదారితీస్తుందోఅన్న భయం కలుగుతోంది. దారిద్య్ర సూచికలో భారతదేశం 107వ స్థానానికి పడిపోయింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో దేశ స్థితిని దారిద్య్రం వైపు, దివాళాకోరుతనం వైపు చూడడానికి ఒక అవకాశం కలిగింది. ఈ విధంగా భారతదేశం దిగజారిపోవడానికి కారణం పాలకవర్గం తీసుకుంటున్న తిరోగమన చర్యలే అని చెప్పక తప్పదు. కార్పొరేట్ శక్తులు, బ్యాంకులకు డబ్బులు ఎగవేసిన వాళ్ళు, అవినీతి అధికారులు, దోపిడీని కొనసాగిస్తున్న రాజకీయ నాయకులే అత్యధికం. భారతదేశం ఎందుకు ఆర్థికంగా సంక్షోభంలో వుందని పరిశీలిస్తే పాలకుల తిరోగమన విధానాలు కారణంగా చెప్పుకోవాలి. వ్యవసాయ పశు గుణాభివృద్ధి ద్వారా భారతదేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే అవకాశాలను ఎవరు కూడా పట్టించు కోవడం లేదు. గ్రామీణ అర్థిక వ్యవస్థకు ఊతంగా ఉండే వ్యవసాయ రంగాన్ని,పాడి పరిశ్రమను శాస్త్రీయంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వాలు కృషి చేయడం లేదు. రైతులను, రైతు కూలీలను నిరంతరం సంక్షోభంలో ముంచుతున్నారు. దేశంలో వ్యవసాయ భూమి విస్తరించట్లేదు. పేద ప్రజలకు భూములు ఇవ్వడంలేదు. పాలకవర్గాలు వీటన్నింటినీ విస్మరించడం వల్లే ఈ రోజున పేదరికం పెరిగిపోతోంది. వ్యవసాయాన్ని అభివృద్ధి చేసే వివిధ ప్రణాళికలు కేవలం కాగితాలకే పరిమితం అయ్యాయి. వ్యవసాయ రంగంలో అధిక ఉత్పత్తి సాధించడం, ఆహార వస్తువుల ధరలస్థిరీకరణ సాధించడం,పేద ప్రజలకు ఆహార భద్రత కలిగించడం, వ్యవసాయదారులు, వినియోగదారుల ప్రయోజనాల మధ్య సమతూకం సాధించడం వంటివి ముందుకు సాగడం లేదు. ముఖ్యంగా సంస్కరణలు వృద్ధిరేటును పెంచినప్పటికి నిరుద్యోగ నిర్మూలనకు పెద్దగా తోడ్పడలేదు. ముఖ్యంగా సంఘటిత రంగంలో ఉపాధి తగ్గిపోతున్నది. రెగ్యులర్ ఎంప్లాయీస్ తగ్గుతూ క్యాజువల్ లేబర్ పెరుగుతున్నారు. క్యాజువల్ లేబర్‌ను, ప్రభుత్వ ఉద్యోగులను రెగ్యులర్ ఉద్యోగులుగా మార్చకపోవడం వలన వారు అభద్రతలో వున్నారు.సమగ్రాభివృద్ధి చెందాలి అంటే పారిశ్రామిక అభివృద్ధి ద్వారానే సాధ్యమని గుర్తించి ముందుకు సాగాలి. వ్యవసాయఅభివృద్దికి చర్యలు తీసుకోవాలి. విప్లవాత్మక చర్యలకు పూను కోవాలి. అలాగే పాడి రంగాన్ని, కోళ్ల పరిశ్రమల అభివృద్ది తదితర రంగాలను ప్రోత్సహించాల్సి ఉంది. దేశంలో ఉత్పత్తి రంగాల్లో మాంద్యం పెరిగింది.పారిశ్రామికాభివృద్ధి పూర్తిగా పడకేసింది. పెట్టుబడులు లేవు, పరిశ్రమలు లేవు, ఉపాధి కల్పన లేదు. మరోవైపు పెద్దఎత్తున ఉద్యోగాలు పోయాయి. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఖాళీలను భర్తీ చేసిన పాపాన పోలేదు. విద్యాధికులైన యువతకు సంపాదనా మార్గాలను పూర్తిగా మూసేశారు. మరీ ముఖ్యంగా బడుగు, బలహీనవర్గాల ఆర్థికస్థితిని చావుదెబ్బ తీశారు. వాళ్ల భవిష్యత్తును అనిశ్చితిలోకి నెట్టారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగితే తప్ప మన ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకోలేం.

# మోడీ పదేళ్ల పాలనలో ఆర్థికాభివృద్ధి డొల్ల

### ఏడుశాతం అభివృద్ధి పేరుతో గొప్పలు

### 90శాతం మందికి దక్కని ఆర్థికప్రయోజనాలు

### ప్రభుత్వ గణాంకాలకు అందనంతగా ధరల పెరుగుదల



**న్యూఢిల్లీ,నవంబర్5( వెలుతురు):** ఆర్థికాభివృద్ధిలో భారతదేశం ఏడు శాతం వృద్ధితో ప్రపంచంలోనే అగ్రగామి గా ఉందని మోడీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకొంటున్నా ..90 శాతం మంది ప్రజలకు దీని ప్రయోజనాలు అందడం లేదన్నది కఠోర వాస్తవం. ప్రజలు ఎదుర్కొంటున్న అసలైన ధరల పెరుగుదల ప్రభుత్వ గణాంకాలకు అందనంతగా ఉందన్నది మరో వాస్తవం. భారత ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొం టోందని వివిధ ప్రభుత్వ శాఖలు ఇటీవల విడుదల చేసిన వివిధ గణాంకాలు విదితం జేస్తున్నాయి. రూపాయి విలువ క్షీణించడం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, స్టాక్ మార్కెట్ నుండి విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, విపరీతమైన విదేశీ రుణాలు, విదేశీ వాణిజ్యలోటు వంటివి మన ఆర్థిక వ్యవస్థ దుస్థితిని వెల్లడించడమే కాదు.. క్షీణతను సూచిస్తున్నాయి. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి అత్యధికంగా నష్టపోయింది. డాలర్ విలువ రూ.84.07 పైసలు. ఆ మారకపు విలువను కొనసాగించేందుకు రిజర్వ్ బ్యాంక్ తన నిల్వల నుంచి పెద్ద మొత్తంలో డాలర్లను విడుదల చేస్తోంది. ఇది విదేశీ మారక నిల్వలను కూడా తగ్గిస్తుంది. మోడీ ప్రభుత్వం 2014 మేలో అధికారంలోకి వచ్చినప్పుడు డాలర్ మారకం విలువ రూ.59.44 పైసలు కాగా పదేళ్లలో దాదాపు రూ.25 పడిపోయి రూ.84కి దిగజారింది. విదేశీ వాణిజ్య లోటు కూడా పెరుగుతోంది. ఆగస్టులో వాణిజ్య లోటు 2,970 డాలర్లకు పెరిగింది. గతేడాది ఆగస్టులో ఇది 2,421 కోట్లు. భారతదేశ ఎగుమతులు చాలా బలహీన స్థితిలో ఉన్నాయి. పెరుగుతున్న ద్రవ్యోల్బణం ప్రజల కొనుగోలు శక్తిని కూడా తగ్గిస్తుంది. భారత ఆర్థిక వ్యవస్థ స్థిరత్వంపై విదేశీ పెట్టుబడిదారులు విశ్వాసం కోల్పోయారు. విదేశీ మదుపరులు తమ పెట్టుబడులను భారతీయ స్టాక్ మార్కెట్ నుంచి ఉపసంహరించు కుంటున్నారు. విదేశీ మదుపరులు ఈ నెలలో ఇప్పటివరకు రూ.85,000 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో, భారతీయ కంపెనీల ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉండడంతో విదేశీ పెట్టుబడిదారులు దూరమవుతున్నారు. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు చైనా ఉద్దీపన ప్యాకేజీని ప్రకటించడం భారత మార్కెట్‌ను కూడా తాకింది. ప్రపంచ ఆర్థిక మాంద్యం కారణంగా 2008లో భారతీయ స్టాక్ మార్కెట్ నుండి విదేశీ పెట్టుబడులు ఉపసంహరించబడ్డాయి. అప్పట్లో అది పెద్ద ప్రభావం చూపింది. రూపాయి విలువ క్షీణతకు అది కూడా కారణమైంది. సెప్టెంబర్‌లో వస్తు, సేవల పన్ను వసూళ్లే ఇందుకు నిదర్శనం. 40 నెలల్లో అత్యల్ప వృద్ధి రేటు (-) 6.5 శాతం నమోదైంది. ప్రస్తుత ద్రవ్యోల్బణం రేటుతో పోలిస్తే సెప్టెంబర్‌లో జీఎస్‌టి ఆదాయం పెద్దగా పెరగలేదు. బొగ్గు, విద్యుత్, ముడి చమురు ప్రాసెసింగ్, మైనింగ్ వంటి ఎనిమిది కీలక రంగాల్లో ఉత్పత్తిపై ఆధారపడిన పారిశ్రామికోత్పత్తి సూచీ ఆగస్టులో ప్రతికూల వృద్ధిని నమోదు చేసింది. గత ఏడాదితో పోలిస్తే సెప్టెంబర్‌లో కార్ల విక్రయాలు 19 శాతం తగ్గాయి. సేవల రంగ సూచీ కూడా 10 నెలల కనిష్టానికి చేరింది. ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో గృహ రుణాల పంపిణీ తొమ్మిది శాతం పడిపోయింది. బలమైన మరియు చలనశీలమైన ఆర్థిక వ్యవస్థకు అవసరమైన ఇటువంటి అంశాలు క్షీణిస్తున్నాయి. పేలవమైన ఆర్థిక విధానాల ఫలితంగా మధ్యతరగతి, దిగువ తరగతులవారి ఆదాయం తగ్గింది. దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య కొనుగోలు శక్తి లేకపోవడం. కొనుగోలు శక్తి కోవిడ్ పూర్వ స్థాయికి చేరుకోలేదని చాలా సూచికలు చూపిస్తున్నాయి. కొనుగోలు శక్తిని పెంచుకోవాలంటే దిగువన ఉన్న 50 శాతం మంది చేతిలో ఎక్కువ డబ్బు రావాలి. కానీ కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, ఇతర సంక్షేమ పథకాల కేటాయింపులు పెంచడం లేదు. దానికి బదులుగా, కార్పొరేట్ లకు పన్ను మినహాయింపులతో సహా భారీ సబ్సిడీలు ఇస్తోంది. మాంద్యం నుంచి ఆర్థిక వ్యవస్థను కాపాడేందుకు ప్రత్యేక ప్యాకేజీలను అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధం కావాలి. పెరుగుతున్న నిరుద్యోగం, వేతన పెరుగుదల లేకపోవడం ప్రజల కొనుగోలు శక్తిని క్షీణింపజేసింది. ఏడు శాతం వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ స్తబ్దుగా ఉందనడానికి ఇంతకన్నానిదర్శనం అక్కర్లేదు.

# ఐదేళ్ల విధ్వంసం నుంచి గట్టెక్కే ప్రయత్నం

### విదేశీ పెట్టుడులు..పారిశ్రామిక అభివృద్ధి లక్ష్యం

### ఒక్కో మెట్టు ఎక్కేలా ముందుకు సాగుతున్న బాబు

### ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడి



**అమరావతి,నవంబర్5( వెలుతురు):** విభజనతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ ..ఒక ఎత్తయితే, గత ఐదేళ్ల జగన్ పాలనలో నష్టపోయింది కూడా అంతకు మించి అన్నట్లుగా ఉంది. ఒక్కో వ్యవస్థను పట్టాలకు ఎక్కించే ప్రయత్నాల్లో కూటమి ప్రభుత్వం ఉంది. తెలుగుదేశం కూటిమి ప్రభుత్వం ఆ దిశగా ప్రణాళికలు రూపొందించి చర్యలు చేపట్టింది. సున్నాతో పరిపాలన ప్రారంభించి కూడా సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్ పేరుతో భాగస్వామ్య సదస్సుల్లో లక్షల కోట్ల విలువైన ఒప్పందాలతో ఐదేళ్ల క్రితంవరకు ఆంధ్రప్రదేశ్ ఒక వెలుగు వెలిగింది. పారిశ్రామికాభివృద్ధిలో రాష్ట్రం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో దేశంలో మూడో స్థానంలో ఉండగా, ఐదేళ్ల జగన్ పాలనలో అట్టడుగుకు దిగజారింది. జగన్ దావోస్ పర్యటన కూడా వినోదాలకే తప్ప రాష్ట్రాభివృద్ధికి దోహదపడలేదు. పెట్టుబడులు రాబట్టేందుకు చేసింది శూన్యం. దావోస్ టూర్ ఖర్చులకు సరిపడా ఇన్వెస్ట్‌మెంట్స్ కూడా తేని ముఖ్యమంత్రిగా జగన్‌దే రికార్డు. గత ఐదేళ్లలో విశాఖ–చెన్నై పారిశ్రామిక కారిడార్‌కు వచ్చిన పెట్టుబడులెన్ని, నెలకొల్పిన పరిశ్రమలెన్ని, కల్పించిన ఉద్యోగాలెన్ని? వైఎస్సార్ జగనన్న మెగా ఇండస్ట్రియల్ హబ్ ఏమైంది? స్కీమ్‌లకు తన పేరు, తండ్రి పేరు పెట్టుకోడంలో ఉన్న శ్రద్ధ, తపన, వాటిని ఫలవంతం చేయడంలో లేకపోవడం కారణంగా ఎపి ఆర్థిక స్థితి అంతకంతకూ దిగజారింది. బడుగు బలహీన వర్గాల పారిశ్రామికవేత్తలను ఎదగనీయకుండా పాలనసాగింది. స్వయం ఉపాధిని పూర్తిగా అటకెక్కించారు. టిడిపి హయాంలో ఇచ్చిన రుణాల బలవంతపు వసూళ్లపైనే జగన్ ప్రభుత్వం దృష్టి సారించింది. చంద్రబాబు హయాంలో పారిశ్రామిక, సేవా రంగాలు జెట్ స్పీడ్‌తో పరుగులు తీస్తే, జగన్ రెడ్డి వచ్చాక తిరోగమన దిశగా సాగాయని ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. టిడిపి హయాంలో ఎకనామిక్ గ్రోత్ ఇంజిన్లను గుర్తించి వాటిపైనే పూర్తిగా దృష్టిపెట్టి జిఎస్‌డిపి పెంపునకు కృషి చేసింది. దానివల్లే వరుసగా నాలుగేళ్లు డబుల్ డిజిట్ గ్రోత్ సాధ్యమైంది. కానీ జగన్ పాలనలో ఆయా గ్రోత్ ఇంజన్లన్నీ రివర్స్ చేసి, నెగటివ్ ట్రెండ్ తెచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనార్టీల జీవన ప్రమాణాలు పూర్తిగా దిగజారాయి. మైనస్ గ్రోత్, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, సున్నా పెట్టుబడులతో బడుగుల సంక్షేమం సంక్షోభంలో చిక్కుకుంది. జగన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ఆకర్షణలో రాష్ట్రం 13వ స్థానానికి పడిపోయింది. గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించి భయానక వాతావరణం నెలకొనడం, ప్రతి పనిలో నీకది నాకిది అనే ఫార్ములాకు భయపడి పారిశ్రామికవేత్తలు పారిపోయారని పయ్యావుల అన్నారు. దేశంలోనే అతిపెద్ద ఎఫ్‌డిఐ రూ.13,500 కోట్ల పెట్టుబడితో 18వేల మందికి ఉద్యోగాల కల్పనతో అనంతపురంలో కియా కార్ల తయారీ పరిశ్రమను తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో నెలకొల్పితే వైసీపీ ఎంపీ, మంత్రుల బెదిరింపుల కారణంగా కియా అగ్జిలరీ యూనిట్లు ఇతర రాష్ట్రాలకు తరలిపోయాయన్నారు. కర్నూలులో సోలార్, విండ్ పవర్ ప్లాంట్లను తెలుగుదేశం ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తే వాళ్ళను వైసీపీ నాయకులు తుపాకులతో బెదిరించి సోలార్ ప్యానళ్లను ధ్వంసం చేశారు. అమరావతిలో 139 సంస్థలకు భూములు కేటాయిస్తే రాజధాని పనులు ఆపేసి ఆయా సంస్థలు రాకుండా అడ్డుకొన్నారు. రాజకీయ కక్షసాధింపు చర్యలతో పరిశ్రమలు రాష్ట్రం నుండి వెళ్లి పోగా, కొత్తగా రాష్ట్రానికి పారిశ్రామికవేత్తలు రావాలంటేనే వణికి పోయాన్నారు. అందుకే మళ్లీ అందరిలో నమ్మకం కలిగించి ముందుకు సాగుతున్నామని మంత్రి కేశవ్ అన్నారు. వైసిపి పాలనలో ఒక్క సమ్మిట్ నిర్వహించకపోగా టిడిపి ప్రభుత్వం తెచ్చిన పెట్టుబడులను వెళ్లగొట్టి 32 లక్షల మంది యువతకు ఉద్యోగాలు రాకుండా చేసిన ఘనత జగన్ రెడ్డిదన్నారు. ఆంధ్రప్రదేశ్ వివిధ రంగాల్లో పెట్టుబడులు ఆకర్షించేందుకు పాలనలో చూపిన సమర్థత, నిరంతర శ్రమ, సరళీకృత విధానాలు, పలు సంస్కరణలు సులభతర వాణిజ్యంలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోవడానికి దోహదపడ్డాయి. రాష్ట్రంలో వనరులు, పరిశ్రమల ఏర్పాటులో కల్పించే సౌలభ్యాలను, ప్రోత్సాహకాలను, నాయకుడి చిత్తశుద్ధి, సమర్ధతలను బట్టి పారిశ్రామికవేత్తలు పరిశ్రమల ఏర్పాటుకు సుముఖత చూపిస్తారు. పెట్టుబడుల సాధనకు ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో అన్ని విధాలా కృషి జరిగింది. ఎవరు ఏమన్నా రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందాలంటే బయటి నుంచి పెట్టుబడులు రావాలి. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందని పెట్టుబడిదారులు భావించాలి. అందుకే కూటమి నేత చంద్రబాబునాయుడు అలుపెరగకుండా పనిచేస్తున్నారని, మళ్లీ విశ్వాసం కల్పించేలా పెట్టుబడులను ఆకర్షించడం జరుగుతోందని ఆర్థికమంత్రి అన్నారు.

# భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

### పుట్టలో పాలుపోసి భక్తి చాటుకున్న మహిళలు



**వేములవాడ,నవంబర్5( వెలుతురు):** కార్తీక శుద్ధ చతుర్థిని నాగుల చవితి పండుగగా జరుపుకుంటారు. నాగుల చవితి సందర్భంగా పుట్టలో పాలు పోసి పూజలను చేస్తారు. తెలుగు రాష్ట్రాల్లో నాగుల చవితి వేడుకలను మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ప్రకృతి మానవ మనుగడకు జీవనాధారమైనది. కనుక చెట్టును, పుట్టను, రాయిని, నదులను, పశు పక్ష్యాదుల సహా సమస్త ప్రాణికోటిని దైవస్వరూపంగా భావించి పూజిస్తారు. అందులో భాగంగానే నాగుపామును నాగరాజుగా, నాగదేవతగా పూజిస్తారు. నాగుల చవితికి పుట్టకు నూలు చుట్టి పూజలు చేస్తారు. పట్టణం, పల్లెలు అనే తేడా లేకుండా నాగుపాము పుట్టల వద్ద స్థానిక దేవాలయాల వద్ద సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. శ్రీ వల్లీ దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణెశ్వర స్వామి దేవస్థానం వద్ద నాగుల చవితి సందర్భంగా భక్తులు పుట్టలో పాలు పోయటానికి ఉదయం నుండి బారులు తీరారు. పుట్టకు పూజలు చేసి పాలు పోసి తమని చల్లా చూడమంటూ నాగదేవతను వేసుకుంటున్నారు. వేములవాడ,ధర్మపురిలో నాగుల చవితి వేడుకలు మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కార్తీక మాసం నాగుల చవితి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి తెల్లవారుజాము నుండే పుట్టలో పాలు పోసేందుకు మహిళలు తరలివచ్చారు. నాగదేవత విగ్రహంపై పాలు పోసి, మొక్కలు చెల్లించుకుంటున్నారు. పుట్టపై దీపం వెలిగించి, పూలు, పండ్లు పెట్టి నాగేంద్రుడి కృపాకటాక్షాలు తమపై ఉండాలని పుట్ట మట్టి బొట్టు పెట్టుకొని పూజలు నిర్వహించారు. పలు జిల్లాలోని ప్రజలు తెల్లవారు జామునుండే ప్రత్యేక పూజలు చేస్తున్నారు. సిద్దేశ్వరాలయం, వేయి స్తంభాల గుడి, రామప్ప, కాళేశ్వరంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మహిళా భక్తులు నాగేంద్ర స్వామిని దర్శించుకుని పుట్టలో పాలు పోసి, ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

# కమలాహారిస్ గెలుపు కోసం తమిళనాడులో ప్రత్యేక పూజలు

**చెన్నై, నవంబర్ 5 ( వెలుతురు) :** కమలా హారిస్ గెలుపుకై తమిళనాడులో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. తిరువరూర్ జిల్లాలో గల హారిస్ పూర్వీకుల గ్రామం తులసేంద్రపురంలో స్థానికులు ఇవాళ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అంతేకాదు.. కమలకు మద్దతుగా గ్రామ వీధులు, ప్రధాన కూడళ్ల వద్ద భారీగా పోస్టర్లు పెట్టారు. ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. అమెరికా ఎన్నికల వేళ.. ఇటీవలే కొంత కాలంగా ఈ గ్రామం హెడ్‌లైన్స్‌లో నిలుస్తోన్న విషయం తెలిసిందే. కమలా హారిస్ తల్లి పేరు శ్యామల. 19 ఏండ్ల వయసులో ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లింది. ఆ రోజుల్లో ఆ కుటుంబానికి అమెరికాలో తెలిసిన వాళ్లు కానీ, సాయం చేస్తామన్న వాళ్లూ కానీ ఎవరూ లేరు. న్యూఢిల్లీలోని లేడీ ఇర్విన్ కళాశాలలో హోమ్‌సైన్స్ చదువుతూ ఇంట్లో ఎవరికీ తెలియకుండా శ్యామల అమెరికాలో పై చదువుకు దరఖాస్తు చేసింది. కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో సీటు వచ్చింది. స్కాలర్‌షిప్ వచ్చింది. శ్యామల వాళ్ల నాన్న సెంట్రల్ సెక్రటేరియట్ ఉద్యోగి. తండ్రి అంగీకారంతో తమిళనాడు నుంచి అమెరికా బయలుదేరింది శ్యామల. కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో ఎండోక్రైనాలజీలో పీహెచ్‌డీ పట్టా సాధించింది. అక్కడే (బ్రిటిష్) జమైకా నుంచి అమెరికా వచ్చిన ఎకనామిక్స్ విద్యార్థి డొనాల్డ్ జె. హారిస్ ఆమెకు పరిచయం అయ్యాడు. ఆ తర్వాత వాళ్లిద్దరూ ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇల్లినాయిస్ యూనివర్సిటీలో ఇద్దరూ ఉద్యోగాల్లో చేరారు. ఆ తర్వాత వేర్వేరు విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగాలు చేస్తూ ప్రయాణాలు చేశారు. ఈ దంపతులకు రెండో సంతానంగా కమలా హారిస్ పుట్టింది. అమెరికాలో పెరిగినా అమ్మమ్మ ఊరైన మద్రాస్‌తో హారిస్‌కు అనుబంధం ఉంది. చాలాసార్లు ఇక్కడికి వచ్చింది.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించిన ఏమ్మెల్యే సుధీర్ రెడ్డి



**వెలుతురు. ఎల్ బి నగర్, నవంబర్ 5**
ఎల్.బి.నగర్ నియోజకవర్గానికి చెందిన పలువురికి ముఖ్యమంత్రి సహాయనిది ద్వారా మంజూరైన చెక్కులను మంగళవారం ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పలువురు లబ్ధిదారులకు ఏమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

## ఇబ్రహీంపట్నం అభివృద్ధికి కృషి చేస్తాం
### - ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి



**ఇబ్రహీంపట్నం,వెలుతురు : నవంబర్ 05**
ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం కేంద్రంలో ఎమ్మెల్యే రైతు కొనుగోలు కేంద్రాలు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి మాట్లాడుతూ పట్నం నియోజకవర్గం లో మొత్తం 15 వడ్ల కేంద్రాలు ఉంటాయి అని తడి 17 శాంతం లోపు ఉంటే సరిపోతుందని రైతులు ఆర్థిక భారం తగ్గించనికే రైతులకు ఉచితంగా ధాన్యం బస్తాలు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ వైస్ చైర్మన్, రంగారెడ్డి జిల్లా కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రతిమ సింగ్, అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పిలవని పేరంటానికి కేటీఆర్ వచ్చాడంటున్న ఆటో యూనియన్ నాయకులు




**వెలుతురు, హైదరాబాద్, నవంబర్ 5:**
బిఆర్ ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ధర్నా చౌక్ నిషేధించి ప్రజలకు రాజ్యాంగం కల్పించిన భావ స్వేచ్ఛ హక్కులను కాలరాసి నియంత పాలన అందిస్తే, అనుముల రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు నిరసన వ్యక్తం చేసే అవకాశం అనుమతులు ఇచ్చిందని ఆటో కార్మికుల జాక్ కన్వీనర్ వెంకటేష్ తెలిపారు, అలాగే మాకు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందని నమ్మకం ఉందన్నారు ,కాని మేము చేస్తున్న శాంతియుత ధర్నాకి ఆహ్వానం లేకుండానే వచ్చిన కేటిఆర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మమ్మల్ని రెచ్చగొట్టి రాజకీయం చేద్దామని కుట్ర చేస్తున్నారని ఆటో జాక్ కన్వీనర్ వెంకటేష్ ఆరోపించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి ఆటో కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు. కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## హాస్పిటల్ చికిత్స పొందుతున్న వారిన్ని పరామర్శించిన అభిషేక్ రెడ్డి



**వెలుతురు ఇబ్రహీంపట్నం, నవంబర్5:**
రంగారెడ్డి జిల్లా యాచారం - మాల్ మధ్యలో నాగార్జున సాగర్ హైవేపై ఆటో ప్రమాదంలో క్షతగాత్రులైన నంది వనపర్తి గ్రామస్తులను కాంగ్రెస్ యువ నాయకుడు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి పరామర్శించారు. మాల్ లోని పీపుల్స్ హాస్పిటల్ లో మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి ఇతర స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలసి పరామర్శించారు, ఈ సందర్భంగా అభిషేక్ రెడ్డి మాట్లాడుతూ క్షతగాత్రులకు మెరుగైన చికిత్స కోసం అవసరమైతే పెద్ద హాస్పిటల్ కి పంపించాలనిసూచించారు.అదేవిధంగా ఇదే ఆసుపత్రిలో ఇతర డాక్టర్లు అవసరమైతే వారిని సంప్రదించాలని ఆయన కోరారు.

## కారు బీభత్సం: మహిళ మృతి

**సూర్యాపేట,నవంబర్5( వెలుతురు):**
కారు బీభత్సం సృష్టించిన ఘటనలో ఓ మహిళ మృతి చెందింది. ఈ విషాద సంఘటన సూర్యాపేటలో చోటుచేసుకుంది. మంగళవారం మునగాల మండలం మాధవరం వద్ద వేగంగా దూసుకొచ్చిన ఓ కారు అదుపుతప్పి.. పాదచారులు, ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఓ మహిళ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు వెంటనే అంబులెన్స్ ద్వారా సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి క్షతగాత్రుల తరలించారు. సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించిన పోలీసులు.. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని చెప్పారు.

# అజయ్ తల్లిదండ్రులకు అండగా పాఠశాల వద్ద వివిధ పార్టీల ఆందోళన

### -పలువురు విద్యార్థులనేతలు. బీజేపీ నేతలు



**వెలుతురు, హయత్ నగర్. నవంబర్ 5:**
హయత్ నగర్ జిల్లా ప్రాథమిక ఉన్నత పాఠశాల వద్ద తరగతుల అనంతరం 1 వ తరగతి చదువుతున్న అజయ్ అనే విద్యార్థి పై స్కూల్ గేట్ విరిగి బాబు పై పడి అక్కడికక్కడే మృతి చెందాడంతో విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాల ముందు బైఠాయించి ఆందోళనకు దిగారు ,వీరికి న్యాయం చేయాలంటూ స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ,బీజేపీ రంగా రెడ్డి జిల్లా అధ్యక్షులు సామ రంగా రెడ్డి లు అజయ్ తల్లిదండ్రులకు అండగా నిలిచి ఘటనకు పూర్తి నైతిక బాధ్యత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మరియు విద్యాశాఖ అధికారులు బాధ్యత వహించాలని స్కూల్ ఎదుట బైఠాయించి ధర్నా చేయడం జరిగింది.ఘటనకు సంబంధించి పూర్తి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ తరపున బాధిత కుటుంబానికి 20లక్షల నష్టపరిహారం మరియు ఒక డబల్ బెడ్ రూమ్ మరియు తల్లికి గాను తండ్రికి గాను స్కూల్ లో ఉద్యోగం కల్పించాలని వారు డిమాండ్ చేశారు,విద్యాశాఖ తరపున పూర్తి నైతిక బాధ్యత వహిస్తూ జిల్లా విద్యా శాఖ అధికారి శు శిందర్ కలెక్టర్ తో మాట్లాడి 5 లక్షల రూపాయల నష్టపరిహారం, ఒక డబల్ బెడ్ రూమ్ మరియు ఉద్యోగం ఇప్పించే పూర్తి బాధ్యత తీసుకుంటామని డీఈ ఓ హామీ ఇచ్చారు.అదేవిధంగా స్థానిక పాఠశాల సిబ్బందిపై తగిన చర్యలతో పాటు మరల ఇలాంటి ఘటనాలు పునరావృత్తం అవ్వకుండా ప్రభుత్వ పాఠశాలలో తగు జాగ్రత్తలు తీసుకుంటామని ఆయన తెలిపారు.ఈ ధర్నా కార్యక్రమం లో బీజేపీ మల్కాజ్గిరి పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ బండారి భాస్కర్ ,డివిజన్ అధ్యక్షులు ఉగాది ఎల్లప్ప ,నాయకులు గంగాని శ్రీను, జిల్లా మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్ ,శంకర్ నాయక్ ,బాలు నాయక్ , ఏ ఐ ఎస్ ఎఫ్ నాయకులు,వివిధ పార్టీల నాయకులు, ముదిరాజ్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# దళిత మహిళకు దక్కిన గౌరవం



**వెలుతురు న్యూస్ తలకొండపల్లి నవంబర్ 5.**
రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం రాంపూర్ గ్రామంలో ఎస్సీ మహిళ కాకి అమృత W/O అంజయ్య ను శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం వైస్ చైర్మన్ గా ఎన్నిక కాబడిన సందర్భంగా ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు జినుకుంట్ల భాస్కర్ ఆధ్వర్యంలో రాంపూర్ గ్రామంలో వెంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పుల నర్సింహా మాట్లాడుతూ . హిందూ సమాజం మార్పును కోరుకుంటుంది అనడానికి ఈ సంఘటననే నిదర్శనం. ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఈ మార్పు నే కోరుకుంటుందని కులాంతరాలు లేని సమాజాన్ని నిర్మించాలని, హిందువులంతా సంఘటితంగా సమన్వయంతో మెలగాలని, హిందూ సమాజ పునాదులలో దళితుల యొక్క భాగస్వామ్యం ఉందని, సమాజమంతా కూడా రాంపూర్ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని హిందూ సమాజ కార్యక్రమాలలో దళితులను భాగస్వామ్యం చేయవలసిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఒక దళిత మహిళలకు ఈ సామాజిక గౌరవం అందించిన రాంపూర్ గ్రామ ప్రజలకు రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి వినోద్ గారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో. రాంపూర్ గ్రామం మాజీ సర్పంచ్ శ్యామ్ సుందర్ రెడ్డి, శ్రీనివాసచారి, కాకి కృష్ణ,ఆలయ పూజారి నర్సింహా అయ్యగారు తలకొండపల్లి మండల అధ్యక్షులు చెన్నం శెట్టి పవన్ గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీకి ఘనస్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు

**కూకట్ పల్లి వెలుతురు నవంబర్ 5:**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, టిపిసిసి చైర్మన్ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరగనున్న కుల గణన సదస్సుకు హాజరయ్యేందుకు ముఖ్యఅతిథిగా ఏఐసిసి అగ్రనేత, రాహుల్ గాంధీ మంగళవారం హైదరాబాద్ బోయిన్ పల్లి గాంధీ ఐడియాలజీ సెంటర్ కి చేరుకున్నారు. ఈ సందర్భంగా అనురాధ టింబర్ డిపో వద్ద కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్వాగత వేదిక వద్ద కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ , కూకట్ పల్లి ఇంచార్జ్ బండి రమేష్, కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంజీవరావు, కెపిహెచ్బి డివిజన్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ కుమార్, పొడుగు



అప్పారావు, శ్రీధర్ చారి, బాబురావు, రామకృష్ణారెడ్డి, శేషగిరి నాయుడు, శివ చౌదరి, గోపాల్ చౌదరి, కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని అగ్ర నేత రాహుల్ గాంధీకి ఘన స్వాగతం పలికారు.

# రాహుల్ ....6 గ్యారంటీలపై సమాధానం చెప్పే దమ్ముందా?



(మొదటి పేజీ తరువాయి..)
గాంధీకి ధైర్యముంటే 6 గ్యారంటీలపై తెలంగాణలో పాదయాత్ర చేయాలని సవాల్ విసిరారు. ఎన్నికల హామీలతో కర్నాటక, తెలంగాణ ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ... మహారాష్ట్రలోనూ దొంగ హామీలు, అబద్దాలతో ఓట్లు దండుకోవాలని చూస్తోందన్నారు. తెలంగాణలో రుణమాఫీ చేసినట్లుగా, 6 గ్యారంటీలను అమలు చేస్తున్నట్లుగా, ఎంతో అభివృద్ధి చేసినట్లుగా గొప్పలు చెప్పుకుంటూ మహారాష్ట్రలో అన్ని పేపర్లకు యాడ్స్ ఇవ్వడం సిగ్గు చేటన్నారు. గతంలో కేసీఆర్ ఇట్లనే తెలంగాణ సొమ్మును మహారాష్ట్ర, పంజాబ్ లకు పంచారని... కాంగ్రెస్ నేతలు ఆయనను మించిపోయారని మండిపడ్డారు. మంగళవారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గంలోని రుద్రంగి మండల కేంద్రానికి విచ్చేసిన బండి సంజయ్ కుమార్ జిల్లా అధ్యక్షులు ప్రతాప రామక్రిష్ణ, రాష్ట్ర నాయకులు చెన్నమనేని వికాస్ రావులతో కలిసి రూ.22 లక్షల విలువైన ఎంపీ లాడ్స్, ఉపాధి హామీ నిధులతో వివిధ అభివృద్ధి పనులకు శంకు స్థాపన చేశారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. స్థానిక లక్ష్మీనర్సింహాస్వామి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా బండి సంజయ్ ఏమన్నారంటే...

### రాహుల్ గాంధీ రాకపై....

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇయాళ ఏ ముఖం పెట్టుకుని తెలంగాణకు వస్తున్నారు? వంద రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేస్తానని హామీ ఇచ్చి మోసం చేశారు. రాష్ట్రానికి వస్తున్న రాహుల్ గాంధీ ఆ విషయంపై మాట్లాడే దమ్ముందా? 6 గ్యారంటీలపై పాదయాత్ర చేసే దమ్ముందా? ప్రజలకిచ్చిన హామీలపై సమాధానం చెప్పిన తరువాతే రాహుల్ గాంధీ తెలంగాణకు రావాలి.

### సీఎం రేవంత్ రెడ్డి మూసీ పాదయాత్ర చేసేందుకు సిద్ధమవడంపై...

నా పాదయాత్రలో మూసీ వద్దకు వెళ్లిన. విషం కక్కుతున్న నీళ్లను కళ్లారా చూసిన. ఆ విషపు నీటి కోరల్లో చిక్కుకుని యాదాద్రి జిల్లా ప్రజలు ఏ విధంగా విలవిల్లాడుతున్నారో... సాగు నీరు సంగతి దేవుడెరుగు, తాగు నీటి కోసం నీళ్లు కొనుక్కొని, వాటర్ ప్లాంట్ ద్వారా తెచ్చుకునేందుకు ఏ విధంగా బాధలు పడుతున్నరో చూసిన. మూసీని ప్రక్షాళన చేయాలని బీజేపీ మొదటి నుండి కోరుతోంది. కానీ ఆ పేరుతో పేదల ఇండ్లను కూల్చొద్దన్నదే మా డిమాండ్. అట్లాగే మూసీని అడ్డుపెట్టుకుని లక్షన్నర కోట్ల దోపిడీని ఆపాలన్నదే మా డిమాండ్. 15 వేల కోట్లతో ఖర్చయ్యే ప్రాజెక్టుకు లక్షన్నర కోట్లకు పెంచి కమీషన్లు దండుకోవడానికి మేం వ్యతిరేకం. తెలంగాణ నిండా అప్పుల్లో మునిగిపోయింది. బీఆర్ఎస్ చేసిన అప్పులను తీర్చేందుకు గంటకు 3 కోట్ల మిత్తి కట్టాల్సి వస్తోందని మీ మంత్రులే మొత్తుకుంటున్నరు. ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంది జీతాలకే ఇబ్బందిగా ఉందని చెబుతున్నరు. అట్లాంటప్పుడు మళ్లీ లక్షన్నర కోట్ల అప్పు తెచ్చి జనంపై రుద్దడం ఎంత వరకు కరెక్ట్? కాంగ్రెస్ అగ్రనేత కుటుంబానికి కాంట్రాక్ట్ కట్టబెట్టడానికి తెలంగాణ ప్రజల జీవితాలను ఫణంగా పెడతారా? కాళేశ్వరం పేరుతో కేసీఆర్ కుటుంబం లక్ష కోట్లు దోచుకుంటే... మీరు లక్షన్నర కోట్లు దోచిపెట్టడానికి మూసీని వాడుకుంటారా? ....

### మహారాష్ట్ర ఎన్నికల సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అక్కడ అన్ని పత్రికలకు ఫుల్ పేజీ యాడ్స్ ఇవ్వడంపై.....

తెలంగాణలో 6 గ్యారంటీలను అమలు చేస్తున్నమని, రుణమాఫీ చేసినమని ఊదరగొడుతూ మహారాష్ట్రలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ పేరుతో కోట్ల రూపాయల యాడ్స్ ఇచ్చింది. కేసీఆర్ కూడా ఇట్లనే మహారాష్ట్ర ఎన్నికల్లో ఖర్చు చేసిండు. పంజాబ్ రైతులకు పప్పు బెల్లాల మాదిరిగా పంచిండు. తెలంగాణ రైతులను అరిగోస పెట్టిండు... మీరు అంతకు మించి దోచుకుంటున్నరు. ఒకవైపు ఢిల్లీ పెద్దలకు కప్పం కడుతూ ఇంకోవైపు మహారాష్ట్ర ఎన్నికలకు తెలంగాణ పైసలను వాడుకుంటరా? సిగ్గుండాలే...
ఎంత దుర్మార్గమంటే... 6 గ్యారంటీల అమలు కాలేదు. రుణమాఫీ పూర్తి కాలేదు. ఇంకా 20 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయాల్సి ఉందని వ్యవసాయ శాఖ మంత్రే ప్రకటించిండు... కానీ మహారాష్ట్రలో మాత్రం రుణమాఫీ చేసినం...6 గ్యారంటీలను అమలు చేస్తున్నమని గొప్పలు చెబుతూ యాడ్స్ ఇస్తారా? మహారాష్ట్ర చెవిలో పూలు పెడదామనుకుంటున్నారా? దొంగ హామీలతో అధికారంలోకి వచ్చి కర్నాటక, తెలంగాణ ప్రజలను మోసం చేసినట్లుగానే ఇప్పుడు మహారాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ నేతలు సిద్ధమవ్వడం సిగ్గు చేటు. తెలంగాణ సమాజం కాంగ్రెస్ మోసాలను గ్రహించాలని కోరుతున్నా.



## కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ కి భారీ స్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు
### హిమాయత్ నగర్ నుంచి కార్పొరేటర్ మహా లక్ష్మి రామన్ గౌడ్ ఆదర్యంలో భారీగా తరలిన కాంగ్రెస్ శ్రేణులు



**వెలుతురు, హిమాయత్ నగర్, నవంబర్ 5:**
మంగళ వారం హిమాయత్ నగర్ డివిజన్ నుంచి భారీ సంఖ్యలో ఏఐసీసీ అగ్రనేత లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కి స్వాగతం పలకడానికి బేగంపేట్ ఎయిర్పోర్ట్ కి పెద్ద సంఖ్యలో బయలుదేరారు హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ఆధ్వర్యం లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రస్థాయి, నగర స్థాయి, అసెంబ్లీ మరియు డివిజన్ స్థాయి నాయకులు , కార్యకర్తలు. తదితరులు పాల్గొన్నారు,

## జగద్గిరిగుట్ట సిఐని మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు...



**కూకట్ పల్లి వెలుతురు నవంబర్ 5:**
జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహ ని వివేకానంద నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి పూల బొకే అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం వివేకానంద నగర్ డివిజన్ పరిధిలో రాత్రి సమయంలో కొంతమంది యువకులు తిరుగుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. కాలనీవాళ్లు కాకుండా వేరే కాలనీకి చెందిన యువకులు వచ్చి రాత్రి సమయంలో ప్రజలకు ఇబ్బంది పెడుతున్నారని అలాంటి వారికి పెట్రోలింగ్ పోలీసులు ద్వారా గుర్తించి కౌన్సిలింగ్ ఇచ్చి వినని యెడల యాక్షన్ తీసుకొని ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని రంగారావు కోరారు.

## రాహుల్ గాంధీకి ఘన స్వాగతం పలికిన : యుగంధర్ రెడ్డి...



**కూకట్ పల్లి వెలుతురు నవంబర్ 5:**
తెలంగాణ పిసిసి ఆధ్వర్యంలో నిర్వహించనున్న కుల గణన సదస్సుకు హాజరయ్యేందుకు ముఖ్యఅతిథిగా ఏఐసిసి అగ్రనేత, లోక్ సభ విపక్ష నేత రాహుల్ గాంధీ హైదరాబాద్ బోయిన్ పల్లి గాంధీ ఐడియాలజీ సెంటర్ కి చేరుకున్నారు. ఈ సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జ్ బండి రమేష్, కూకట్ పల్లి కాంగ్రెస్ ముఖ్య నాయకులతో కలసి ఏ . బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి అగ్ర నేత రాహుల్ గాంధీకి ఘన స్వాగతం పలికారు.


## బాలనగర్ లో లైన్స్ క్లబ్ అదనపు భవనానికి శంకుస్థాపన చేసిన మంత్రి దామోదర్ రాజనర్సింహ..



**కూకట్ పల్లి వెలుతురు నవంబర్ 5:**
కూకట్ పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ డివిజన్ రాజు కాలనిలో లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రి వారు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య, సైన్స్, టెక్నాలజీ మంత్రి దామోదర రాజానర్సిములు మంగళవారం హాజరై లయన్స్ క్లబ్ అదనపు బ్లాక్ నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద ప్రజానీకానికి లైన్స్ క్లబ్ చేస్తున్న సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్, గొట్టిముక్కల వెంకటేశ్వర రావు, కొప్పిశెట్టి దినేష్ కుమార్, మధు గౌడ్, ఆకుల నరేందర్, గంధం రాజు, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

## కెపిహెచ్బి సిఐ కి దీపావళి శుభాకాంక్షలు తెలిపిన పిడికిడి గోపాల్ చౌదరి...

**కూకట్ పల్లి వెలుతురు నవంబర్ 5:**



కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి తరపున కెపిహెచ్బి సిఐ వెంకటేశ్వరరావుకి కాంగ్రెస్ పార్టీ నాయకులు పిడికిడి గోపాల్ చౌదరి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కెపిహెచ్బి కాలనీకి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు శేషగిరి నాయుడు, శ్రీధర్, చారి తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకార కుటుంబాల్లో సిరులు కురవడమే ప్రభుత్వ లక్ష్యం



**రామన్నపేట వెలుతురు నవంబర్ 5:**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో భాగంగా నేడు యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, పెద్ద తుమ్మలగూడెం ( ఇంద్రపాల నగరం ) చెరువులో ఉచిత చాప పిల్లలని వదిలిన భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి , నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, భువనగిరి శాసనసభ్యులు కుంభ అనిల్ కుమార్ రెడ్డి ,మిర్యాలగూడ శాసనసభ్యులు శ్రీ బత్తుల లక్ష్మారెడ్డి,జిల్లా కలెక్టర్ హనుమంతరావు , డిసిపి రాజేష్ చంద్ర .చెరువులే జీవనాధారంగా బతుకుతున్నటు వంటి మత్స్యకారుల కుటుంబాల్లో సిరులు పండాలని, మత్స్యకారులకు ఆర్థిక తోడ్పాటు అందించేందుకు, ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుందని అన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా మత్స్యశాఖ అధికారులు, మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల నాయకులు,జిల్లా ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం వరంగల్ నల్లగొండ టీచర్ ఎమ్మెల్సీ ఓటర్ అనౌన్స్మెంట్లో భాగంగా

## బిజెపి టీచర్స్ ఎమ్మెల్సీ నకిరేకల్ కన్వీనర్ బండ మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో




**రామన్నపేట వెలుతురు నవంబర్ 5:**
ఖమ్మం వరంగల్ నల్గొండ టీచర్ ఎమ్మెల్సీ ఓటర్ ఎన్రోల్మెంట్ లో భాగంగా బిజెపి టీచర్ ఎమ్మెల్సీ నకిరేకల్ కన్వీనర్ బండ మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈరోజు రామన్నపేట మండలంలో గర్ల్స్ హైస్కూల్, గౌట్ హైస్కూల్, డిగ్రీ కాలేజ్, జూనియర్ కాలేజ్. కొమ్మయగూడెం జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ తుమ్మలగూడెం హైస్కూల్లో టీచర్ ఎమ్మెల్సీ ఓటు కొరకు నమోదు చేసుకోవాలని, చెప్పేసి టీచర్స్ ని అభ్యర్థించడం జరిగింది అలాగే జాతీయ వాదులకు మద్దతు తెలపాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా బందారపు లింగస్వామి. పార్లమెంట్ కన్వీనర్ నకరికంటి మొగులయ్య . ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు వనం అంజయ్య. బిజెపి మండల అధ్యక్షుడు పల్లపు దుర్గయ్య , దంతూరి సత్తయ్య, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణ , శ్రీరాములు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# నేడు ఎపికేబినేట్ భేటీ

## పలు కీలక అంశాలపైచర్చ

**అమరావతి,నవంబర్5( వెలుతురు):**
అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో కేటినేట్ కీలక భేటీ బుధవారం జరుగనుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు కేబినెట్ సమావేశం జరగనుంది. ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ 1982 బిల్లు ప్రతిపాదనపై మంత్రి వర్గం చర్చించనుంది. భూసేకరణ చట్టంలోని కొన్ని నిబంధనల కారణంగా భూ ఆక్రమణల్లో కేసుల నమోదుకు ఇబ్బందులు వస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. వైకాపా ప్రభుత్వ హయాంలో లక్షల ఎకరాలు అన్యాక్రాంతం అయినట్టు కూటమి ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వానికి అందుతున్న ఫిర్యాదుల్లో 80 శాతం భూ ఆక్రమణలపైనే ఉన్నాయి. ప్రస్తుత చట్టంతో అక్రమార్కులపై చర్యలు తీసుకునేందుకు ఇబ్బందులు ఉన్నాయని.. దీని స్థానంలో కొత్త చట్టం తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే భూసేకరణ చట్టం 1982ను రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొత్తగా ల్యాండ్ గ్రాబింగ్ ప్రోహిబిషన్ బిల్లు 2024ను తీసుకువచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై మంత్రివర్గంలో చర్చించి ఆమోదం తెలిపే అవకాశం ఉంది. నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించే అంశం కేబినెట్ భేటీలో చర్చకు రానుంది. వైకాపా హయాంలోని నామినేటెడ్ పదవుల కేటాయింపు చట్టం 2019ని రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి అనుబంధంగా ఇచ్చిన జీవో 77ను రద్దు చేస్తూ మంత్రివర్గంలో నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. 2017లో చేసిన స్మార్ట్ పల్స్ సర్వే నివేదికను నామినేటెడ్ పోస్టుల నియామకానికి ప్రాతిపదికగా తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. కొత్త క్రీడా విధానం, డ్రోన్, సెమీకండక్టర్, డేటా సెంటర్ పాలసీల రూపకల్పనపై మంత్రివర్గ సమావేశంలో చర్చించి ఆమోదం తెలిపే అవకాశం ఉంది. ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటాను 2 నుంచి 3 శాతానికి పెంపు, ఒలింపిక్స్ క్రీడల్లో బంగారు పతకం సాధించిన క్రీడాకారులకు ప్రోత్సాహకాన్ని రూ.7 కోట్లకు పెంపు అంశాలపై కేబినెట్లో చర్చించనున్నట్లు తెలుస్తోంది.

# సర్వేను సమగ్రంగా పూర్తి చేయాలి: కలెక్టర్

**ఆసిఫాబాద్,నవంబర్ 5( వెలుతురు):**
ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక,కులసర్వే కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో పూర్తిచేయాలని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. ఈనెల 6నుంచి ప్రారంభ మయ్యే సర్వేపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్‌లు, పంచాయతీ ప్రత్యేకాధికారులు, మండల ప్రత్యేకాధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. మండల ప్రత్యేకాధికారులు సర్వేనిర్వహణపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి విజయవంతం చేయాలని తెలిపారు. సమగ్ర కుటుంబ సర్వే పక్కాగా చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సర్వే కార్యక్రమాన్ని సకాలంలో పూర్తిచేయాలన్నారు. ఎన్యుమరేటర్లకు సర్వే బ్లాక్‌లు కేటాయించామన్నారు. తమకు కేటాయించిన ఇండ్లను సందర్శించి కుటుంబ సభ్యుల వివరాలను నిర్ణీత సమయంలో ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని సూచించారు.

# రామన్న పేటలో పెట్టబోయే అదానీ అంబుజా సిమెంటు కంపెనీ రద్దు చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాలో అడుగు పెట్టాలి

## యాదాద్రి భువనగిరి జిల్లా నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని కొమ్మాయిగూడెం, చిట్యాల పెద్దకాపార్తి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



**వెలుతురు న్యూస్ రామన్నపేట:**
అక్కడ కొనుగోలు కేంద్రాలలో వర్షాలకు మొలకెత్తిన రైతుల ధాన్యాన్ని పరిశీలించారు. నకిరేకల్ నియోజక వర్గంలో ఏ మండలానికి ,గ్రామాలకు వెళ్ళినా ధాన్యం కొనుగోలు కేంద్రాలను అలంకార ప్రాయంగ ఫోటో ల పోజుల కోసం ప్రారంభించారు. తప్ప ధాన్యం కొనుగోలు చేయడం లేదు. నెల రోజుల నుండి రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చి గన్ని బ్యాగ్లు లేక అకాల వర్షాలకు మొలకెత్తిన ధాన్యాన్ని అధికారులు స్థానికంగా ఉన్న ప్రజా ప్రతినిధులు పట్టించు కోవడం లేదు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి నానా తంటాలు పడుతున్నారు.



ఎన్నికల హామీల్లో భాగంగా, అన్ని రకాల వడ్లకు ఐదు వందల రూపాయల బోనస్ ఇస్తామని, బోగస్ హామీ ఇచ్చి రైతులను మోసం చేసిన, ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల ఉసురు తగులుతుంది. రైతులు కొనుగోలు కేంద్రాల్లో, అధికారులు ధాన్యం కొనుగోలు చేయకపోవడం వల్ల, ఎక్కువగా రైతులు నాలుగు వందల రూపాయల తక్కువ ధరకు మిల్లర్ కు అమ్ముకుని నష్ట పోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రాష్ట్రం లోని అన్ని కోనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి సరిపడా, గన్ని బ్యాగులను సరఫరా చేసి మిల్లర్లు మరియు అధికారులతో మాట్లాడి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి. పెద్దకాపార్తి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఓపెన్ చేసి ముప్పై మూడు రోజులు అవుతున్న ఇప్పటి వరకు ఒక్క గింజ కూడా ప్రభుత్వం కొనలేదు. అని ఆ గ్రామ రైతులు తమ ఆవేదన లు తన దృష్టికి తీసుకు రాగ, అక్కడ ఉన్న రైతులతో కలిసి కొనుగోలు కేంద్రం లో ధర్నా నిర్వహించారు. అక్కడ నుండి మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య నల్లగొండ జిల్లా కలెక్టర్, మరియు డిసిఓ లలో ఫోన్ లో విషయం వివరించగా వారు, స్పందించి ఇంకో గంటలో కొనుగోలు చేస్తామని, వారు హామీ ఇవ్వడం తో ధర్నా విరమించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల ఎనిమిదవ తేదీన యాదాద్రి జిల్లా లో ,మూసి సుందరీకరణ పేరుతో చేసే, పాదయాత్ర రామన్నపేట లో ఏర్పాటు చేయనున్న, సిమెంటు కంపెనీ ఏర్పాటు తో, నష్ట పోయే రైతుల వరకు సాగాలి సిమెంట్ కంపెనీ ఏర్పాటు వల్ల నష్టపోయే రైతుల గోడు వినాలి. కంపెనీ ఏర్పాటు వలన డెబ్బై లక్షల రూపాయల విలువ చేసే, భూములు,ఎందుకు పనికి రాకుండా పోతాయని, దాని వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారు. ఇక్కడ ఉన్న ప్రజల కోరిక మేరకు, సిమెంటు కంపెనీ ఏర్పాటు రద్దు చేసి, అక్కడ ఉన్న ప్రభుత్వ భూమిని నిరు పేదలకు పంచాలి. రామన్న పేట ప్రజల పక్షాన సిమెంటు కంపెనీ రద్దుకు ఎలాంటి ఉద్యమానికైన, సిద్ధంగా బిఆర్ఎస్ పార్టీ పక్షాన నేను అండగా ఉంటాను. ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి సిమెంటు కంపెనీ రద్దు ప్రకటన చేయకుండా జిల్లా లో అడుగు పెట్టకుండా స్థానిక గ్రామాల ప్రజలతో మీ పర్యటనను అడ్డుకుంటాం. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల కార్యదర్శి పోష బోయిన మల్లేశం. మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బందెల రాములు. మాజీ ఎంపీటీసీలు వేమవరం సుధీర్ బాబు, సాల్వేరు అశోక్, గొరిగే నరసింహ, పట్టణ కార్యదర్శి జాడ సంతోష్, నాయకులు బద్దుల రమేష్, మిర్యాల మల్లేశం, లవణం రాము, బొడ్డు అన్నయ్య, జాల అమరేందర్ రెడ్డి, ఆవుల శ్రీధర్, ఎండి ఆజాబ్, బుర్ర శ్రీశైలం, మోటే రవీందర్, బొడ్డుపల్లి రాజు ,మోటె నరేష్ ,గుజ్జుల సంజీవరెడ్డి, నల్ల సైదులు, కొండగడప చింటూ, బాసని రాజు ,లవణం ఉపేందర్, ఎండి మోసబ్, తీర్పాల శీను, నరసింహ తదితరులు పాల్గొనడం జరిగింది.

# రాష్ట్ర ప్రభుత్వం రవాణా కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలి

## - ఎం రాంబాబు.



**వెలుతురు న్యూస్ సూర్యాపేట అక్టోబర్ 5**
అసెంబ్లీ ఎన్నికల సమయం లో కాంగ్రెస్ పార్టీ రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, ఆటో కార్మికులకు సంవత్సరానికి 12వేలు ఇస్తామని ట్రాన్స్ పోర్ట్ రంగ వర్కర్స్ చెప్పిన విధంగా అమలు చేయాలని తెలంగాణ పబ్లిక్ & ప్రయివేట్ రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ సూర్యాపేట జిల్లా కార్యదర్శి యం. రాంబాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కలెక్టరెట్ కార్యాలయం ముందు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కార్మికులు ధర్నా నిర్వహించినారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ రవాణా రంగంలో వివిధ విభాగాల్లో ఆటో, లారీ, గూడ్స్ లారీ, టాక్సీ స్కూల్, కాలేజీ బస్సు, ఆర్టీసీ అద్దె బస్సు లపై అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్నా వారికి ఎలాంటి ప్రభుత్వ పథకాలు లేవన్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప డ్రైవర్ల కుటుంబాలలో ఎలాంటి మార్పు లేదన్నారు. ప్రజా రవాణా చేయటం లో, సరుకులను ప్రజల వద్దకు చేరవేయటం ట్రాన్స్ పోర్ట్ కార్మికులు కీలక పాత్ర పోషిస్తూన్నారని అన్నారు. ప్రమాధాల వలన కొంత మంది అంగ




వైకల్యం తో బాధపడుతున్నారని, మరి కొంతమంది మరణిస్తున్నారని ఆకుటుంబాలను ప్రభుత్వాలు ఆదుకోవలసిన కనీస బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకం వల్ల ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్ లను ఆదుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పినప్పటికి 10మాసాలు గడుస్తున్నా ఆటో కార్మికులపై ఎలాంటి స్పందన లేదన్నారు. ప్రమాద బీమా ను 5లక్షల నుండి 10 లక్షలకు పెంచాలని కోరారు. అర్హత కలిగిన డ్రైవర్లకు రేషన్ కార్డు, ఇల్లు లేని వారికి ఇండ్లు రాష్ట్ర ప్రభుత్వమే మంజూరి చేయాలని, రవాణా కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న 2019మోటారు వాహన చట్టాన్ని సవరణ చేయాలని, పట్టణ, మండల కేంద్రల్లో ఆటో అడ్డాలను ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సట్టు యాదగిరి హుజూర్నగర్ ఆటో యూనియన్ అధ్యక్షులు కేశరాజు గోపి j కృష్ణ వి.యర్రయ్య జి ఉపేందర్ గౌడ్ యన్ ఆనంద్, భవన నిర్మాణ కార్మికులు సంఘీభావం తెలియజేశారు. జిల్లా నాయకులు అనంతరం మల్లయ్య యల్క సోమయ్య గౌడ్ కరిమెల శేఖర్ ఒగ్గు సైదులు మల్లెపాక నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలందరూ సహకరించాలి

## యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ

**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు అక్టోబర్ 11:**
తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టాలనే మంత్రి మండలి నిర్ణయం మేరకు 04 ఫిబ్రవరి 2024 న శాసనసభ తీర్మానం చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల6వ,తేదీ నుంచి చేపట్టబోయే ఇంటింటికి సమగ్ర సర్వే సామాజిక,ఆర్థిక,విద్యా, రాజకీయ,కులాల సర్వే కు రాష్ట్ర ప్రజలంతా సహకరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ పత్రిక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో రాహుల్ గాంధీ ఎన్నికలలో ఇచ్చిన మాట మేరకు జరుగుతున్న ఈ సర్వేను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది. ఈ సర్వే రాబోయే కాలంలో అన్ని రకాల పథకాలను లబ్ధిదారులకు అందించేందుకు ఒక మెగా హెల్త్ చెకప్ మాదిరిగా ఉపయోగపడుతుందన్నారు.ఈ నేపథ్యంలో సర్వేలోసమాచారం సేకరిస్తున్నవారు , సమాచారం తెలుపుతున్నవారు ప్రతి తెలంగాణ బిడ్డ ఈ సర్వేలో భాగస్వాములు కావాలని కోరారు.రాష్ట్రంలో వెనుకబడిన తరగతులు,ఎస్సీ,ఎస్టీ,పౌరులతో పాటు ఇతర బలహీనవర్గాల అభ్యున్నతి కోసం వివిధ సామాజిక ఆర్థిక,విద్యా,ఉపాధి,రాజకీయ అవకాశాలపై ప్రణాళికలు



రచించడానికి ఉపయోగ పడుతుంది. సర్వే కోసం ఫిబ్రవరిలోనే శాసనసభలో సిఎం రేవంత్ రెడ్డి,ప్రభుత్వం ఏకగ్రీవ తీర్మానం చేసిందని మునుగోడు నియోజకవర్గం లో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఎమ్మెల్యే సహకారంతో సబ్బండ కులాలకు ప్రభుత్వ పథకాలు అందించే విధంగా కాంగ్రెస్ శ్రేణులు కృషి చేస్తారని ప్రజలు సహకారం అందించి సమగ్ర సర్వే విజయవంతం అయ్యే విదంగా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి నోముల మాధవరెడ్డి,మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ్మ,పి.ఎ.సి.ఎస్ డైరెక్టర్ ఉప్పల కృష్ణ,ఎస్టీ సెల్ నాయకులు కాట్రూట్ రవీందర్ నాయక్,బానోతు లాలు,సీనియర్ నాయకులు జక్కల విక్రమ్,ఉప్పల నాగరాజు,గునిగంటి రాజు గౌడ్,కొండ నవీన్ గౌడ్,లింగంపల్లి నరసింహ,బొమ్మరబోయిన రవికుమార్, కాట్రతు రాములు,తదితరులు పాల్గొన్నారు.

# ఏకపక్షంగా ఆస్తుల స్వాధీనం కుదరదు

## అన్ని ఆస్తులను సమాజ ఆస్తులుగా గుర్తించలేం

## సుప్రీం కోర్టు ధర్మాసనం చారిత్రక తీర్పు

**న్యూఢిల్లీ,నవంబర్5 వెలుతురు:**



ఏకపక్షంగా వ్యక్తుల ఆస్తులను స్వాధీనం చేసుకునే హక్కు ప్రభుత్వాలకు లేదని, ప్రైవేటు ఆస్తుల స్వాధీనం విషయంలో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. ప్రైవేటు యాజమాన్యంలోని అన్ని ఆస్తులను ఉమ్మడి ప్రయోజనం కోసం ప్రభుత్వాలు స్వాధీనం చేసుకోవడానికి వీలులేదని తేల్చిచెప్పింది. ఈ మేరకు 8:1 మెజారిటీతో సుప్రీంకోర్టు ఈ తీర్పు ఇచ్చింది. అయితే కొన్ని కేసుల్లో మాత్రం మినహాయింపు ఉంటుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రైవేటు వ్యక్తుల ఆస్తులను సమాజ వనరుగా పరిగణించొచ్చా అన్న కీలక కేసుపై కొద్దినెలల క్రితం ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని తొమ్మిది మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఏ ప్రైవేటు ఆస్తి సమాజ వనరు కాదు.. అన్ని ప్రైవేటు ఆస్తులూ సమాజ వనరులే.. ఈ రెండు పరస్పర భిన్నమైన విధానాలు. వీటిపై ప్రస్తుత ప్రైవేటీకరణ, జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సమకాలీన వ్యాఖ్యానం చేయాల్సిన అవసరం ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది. 1950లో భారతదేశాన్ని దృష్టిలో ఉంచుకొని ఇప్పుడు వ్యాఖ్యానం చేయకూడదు. అప్పుడు జాతీయీకరణ జరుగుతోంది. ఇప్పుడు పెట్టుబడుల ఉపసంహరణ జరుగుతోంది. ప్రైవేటు పెట్టుబడులు ఉన్నాయి. ఇది పరివర్తన. కాబట్టి న్యాయస్థానం వ్యాఖ్యానం కొత్తగా ఉండాలి. ప్రస్తుత భారత్‌కు అనుగుణంగా ఉండాలి. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోవాలని ధర్మాసనం పేర్కొంది. తాజాగా ఈ వ్యాఖ్యలను పునరుద్ఘాటిస్తూ దీనిపై తీర్పు వెలువరించింది. అలాగే కోల్‌కతాలో పార్కు నిర్మాణం కోసమంటూ స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ ఓ వ్యక్తి ఆస్తిని స్వాధీనం చేసుకున్న కేసులోనూ సుప్రీం తీర్పునిస్తూ.. చట్టప్రకారం మున్సిపల్ కార్పొరేషన్ నష్టపరిహారం చెల్లించినా సరైన పద్ధతులు మాత్రం పాటించలేదు. వ్యక్తుల ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించినప్పటికీ రాజ్యాంగం తగిన రక్షణ కల్పించింది. నిర్బంధ స్వాధీనాలు, హడావుడి నిర్ణయాలు, న్యాయబద్ధంగాలేని పరిహారాల కారణంగా పౌరులు నష్టపోవడానికి చట్టం అనుమతించబోదని ధర్మాసనం తెలిపింది. ఆస్తి స్వాధీనం విషయాన్ని ముందుగా తెలియజేయడం, తగినంత సమయం ఇవ్వడం, అభ్యంతరాలు స్వీకరించడం, వాటిని పరిష్కరించడం, పునరావాసం కల్పించడం, ప్రజాప్రయోజనం కోసమేనని వివరించడం వంటివన్నీ ప్రభుత్వాలు చేయాల్సి ఉంటుందని పేర్కొంది.

# నిత్యకృత్యంగా అత్యాచారాలు, హత్యాచారాలు

## 120 రోజుల్లో ఇలాంటి ఘటనలు 110 జరిగాయి

## రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలం

## మాజీమంత్రి రోజా విమర్శలు

**తిరుపతి,నవంబర్ 5( వెలుతురు):**
రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, హత్యాచారాలు నిర్మూలించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసీపీ నేత రోజా అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గడిచిన 120 రోజుల్లో ఇలాంటి ఘటనలు 110 జరిగాయని రోజా మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలం అయ్యాయని, మహిళల మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని మాజీ మంత్రి రోజా ఆరోపించారు.మహిళలపై వరుస అఘాయిత్యాలు జరుగుతుంటే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి అనిత ఏం చేస్తున్నారని ఆమె ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌లో మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు జరగకుండా చూడడంలో హోంమంత్రి అనిత సరిగా పనిచేయడం లేదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అనడం వెనక కారణం ఏంటి?. దళితవర్గానికి చెందిన హోంమంత్రిపై నిందలు వేసి చేతులు దులుపుకోవాలని చూస్తున్నారా?. పిఠాపురం నియోజకవర్గంలో పాఠశాల నుంచి



ఇంటికి వెళ్తున్న బాలికకు మత్తు మందు ఇచ్చి అత్యాచారం చేసినప్పుడు పవన్ ఎక్కడికి వెళ్లారు. చిన్నారిపై అఘాయిత్యం జరిగితే కనీసం బాధిత కుటుంబాన్ని పవన్ పరామర్శించలేదు. ఉత్తర్ ప్రదేశ్ సీఎం యోగి లాగా పనిచేయాలని ఆయన చెబుతున్నారు. యోగిలా పనిచేయమని ముఖ్యమంత్రి చంద్రబాబుకు పవన్ చెప్పాలి. అధికారం చేతిలో ఉన్న వాళ్లు తప్పులు జరగకుండా చూడాలి. కానీ సీఎం, డిప్యూటీ సీఎం, హోంమంత్రి తమ విధి నిర్వహణలో విఫలం అయ్యారు. ఇప్పుడు తిరుపతి ఘటనలోనూ నిజాన్ని కప్పిపుచ్చేందుకు బాలికను పరీక్షల పేరుతో అనేక ఆస్పత్రులకు తిప్పడం నిజం కాదా?. ప్రభుత్వం నుంచి తిరుపతి ఎస్పీకి ఎంత ఒత్తిడి వస్తుందో ఆయన మాటలు బట్టే అర్థం అవుతోందన్నారు. డీజీపీ నుంచి కిందస్థాయి సిబ్బంది వరకూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయన తనయుడు మంత్రి లోకేశ్ బదిలీలు చేసుకున్నారు. నచ్చిన వారికి పోస్టింగులు ఇచ్చుకుని ఇప్పుడు లైంగిక దాడులకు పాల్పడే నిందితులను కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్రంలో ఇన్ని అఘాయిత్యాలు జరుగుతుంటే లోకేశ్ విదేశాల్లో తిరుగుతున్నాడు. ఆయనకి ఎవరు నచ్చలేదో వారిపై రెడ్ బుక్ రాజ్యాంగం రుద్దుతారు. గుడ్లవల్లేరులో మాన, ప్రాణాలు పోయేలా విద్యార్థినిల వీడియోలు తీస్తే వారిని బెదిరించి విషయాన్ని కప్పిపుచ్చారు. ఈ ఘటనలో విద్యాశాఖ మంత్రి పూర్తిగా విఫలం అయ్యారు. కాలేజీల్లో అమ్మాయిలపై దాడులు జరుగుతుంటే విద్యా శాఖ మంత్రి ఏం చేస్తున్నారని రోజా ప్రశ్నించారు. తిరుపతి వాసవీ నగర్‌లోనూ యువతిపై దాడి జరిగింది. రిషికొండ ఎక్కడికీ పోదు.. అక్కడే ఉంటుంది. ఇక్కడ మహిళలపై జరుగుతున్న దాడుల్ని చూడండి. మీ వల్ల కాకపోతే రాజీనామా చేయండి. ప్రధాని మోదీని వేడుకుంటున్నా. మీరూ కూటమి ప్రభుత్వంలో ఉన్నారు. ఏపీలో జరుగుతున్న దారుణాలను చూసి రాష్ట్రపతి పాలన విధించాలన్నారు. హిందూపురంలో అత్తాకోడళ్లపై గ్యాంగ్ రేప్ జరిగితే స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ సినిమా షూటింగ్స్‌లో పాల్గొన్నారు. కనీసం బాధితులను పరామర్శించలేదన్నారు. డమ్మీ హోంమంత్రిని పెడితే మహిళల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం అవుతోంది. వైసీపీ అధినేత జగన్ తిరుపతికి వస్తున్నారన్న సమాచారంతో బాధితులను బెదిరించి వారితో మాట్లాడిస్తున్నారని రోజా మండిపడ్డారు.

# యూపిలో వేలాది మదర్సాలకు భారీ ఊరట

### మదర్సాల నిర్వహణ చట్టబద్ధమే

### అలహాబాద్ హైకోర్టు తీర్పును తోసిపుచ్చిన సుప్రీం



**న్యూఢిల్లీ,నవంబర్5( వెలుతురు):**
మదర్సాల విషయంలో మంగళవారం నాడు సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. మదర్సాల నిర్వహణకు సంబంధించి ఉత్తరప్రదేశ్ బోర్డ్ ఆఫ్ మదర్సా ఎడ్యుకేషన్ యాక్ట్ 2004 రాజ్యాంగ విరుద్ధమంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఈ చట్టం రాజ్యాంగబద్ధమేనని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. దీంతో ఉత్తర్‌ప్రదేశ్ లో వేల సంఖ్యలో ఉన్న మదర్సాలకు భారీ ఊరట లభించింది. యూపీ మదర్సా ఎడ్యుకేషన్ చట్టం రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు కీలకతీర్పు వెలువరించింది. ఈ చట్టాన్ని సమర్థించిన అత్యున్నత న్యాయస్థానం.. గతంలో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేసింది. ఉత్తరప్రదేశ్ మదర్సా చట్టం రాజ్యాంగ వ్యతిరేకమని పేర్కొంటూ గతంలో అలహాబాద్ హైకోర్టు దానిని రద్దు చేసిన సంగతి తెలిసిందే. అది లౌకికవాద భావనకు విరుద్ధమైనదని ఆ సందర్భంగా తెలిపింది. దాంతో ఆ అంశం సుప్రీంకోర్టుకు చేరింది. ఇది రాజ్యంగ విరుద్ధమంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పు సరైనది కాదని తెలిపింది. ఈ తీర్పు 10వేల మదర్సా టీచర్లు, 17 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుపైనా ప్రభావం చూపుతోందని అప్పట్లో పేర్కొంది. ప్రస్తుత తీర్పుతో 16వేల మదర్సాల కార్యకలాపాలు యథావిధిగా కొనసాగనున్నాయి. అంతేకాదు.. విద్యా సంస్థలు స్థాపించి, నిర్వహించే హక్కులను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవద్దని తేల్చి చెప్పింది. విద్యా హక్కు చట్టం 2004లో కూడా ఇందుకు సంబంధించి కొన్ని మినహాయింపులు ఉన్నాయని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. దేశ సర్వోన్నత న్యాయస్థానం తీర్పుతో ఉత్తరప్రదేశ్‌లోని 16,000 మదర్సాలలో చదువుకుంటున్న 17 లక్షల మంది విద్యార్థులకు భారీ ఊరట కలిగినట్లయ్యింది. భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జేబీ పార్దీవాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం.. హైకోర్టు తీర్పును తప్పుపట్టింది. యూపీ మదర్సా ఎడ్యుకేషన్ యాక్ట్ చెల్లుబాటును సమర్థిస్తున్నట్లు ప్రకటించింది.

# వరంగల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

### విజన్ 2025 పేరుతో మాస్టర్ ప్లాన్ రూపకల్పన

### మంత్రిపొంగులేటి కీలక ప్రకటన




**హైదరాబాద్,నవంబర్5( వెలుతురు):**
మౌలిక వసతుల అభివృద్ధితో పాటు, ఆధునిక టెక్నాలజీని కూడా జోడించి వరంగల్ నగరాన్ని మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దనున్నట్టు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వరంగల్ నగర అభివృద్ధి కోసం కీలక ప్రకటన చేశారు. విజన్–2025 పేరుతో మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేసుకున్నామని ఆయన తెలిపారు. ఈ ప్రణాళికలో భాగంగా, వరంగల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం పనులు యుద్ధ ప్రాతిపదికన త్వరలో ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఇటీవల వరంగల్ పర్యటనలో ఉన్న మంత్రి, నగర అభివృద్ధిపై చాలా కీలక నిర్ణయాలు తీసుకుంటామని ప్రకటించారు. వరంగల్‌ను తెలంగాణ రెండవ రాజధానిగా అభివృద్ధి చేయాలని మా లక్ష్యం. మన నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటాం, అని మంత్రి చెప్పారు. మంత్రి ఇచ్చిన హామీ ప్రకారం, నగర అభివృద్ధికి సంబంధించిన పనులు త్వరలో ప్రారంభమవుతాయని, మొదటి ప్రాధాన్యతగా విమానాశ్రయ నిర్మాణానికి శ్రీకారం చుడతామని ప్రకటించారు. ఈ ప్రకటనతో వరంగల్ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. వరంగల్ ప్రజలకు మంత్రి కొండా సురేఖ తీపి కబురు అందించారు. వరంగల్ ప్రజల చిరకాల వాంఛ అయిన మామునూరు ఎయిర్ పోర్టు కల సాకారం కానుందని మంత్రి కొండా సురేఖ తెలిపారు. ప్రయాణికుల సర్వీసులతో పాటు కార్గో సర్వీసులు అందించే దిశగా ఎయిర్ పోర్ట్ ను అభివృద్ధి చేసే దిశగా సీఎంతో చర్చిస్తానన్నారు మంత్రి సురేఖ. అత్యుత్తమ నగరంగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని మంత్రి పునరుద్ఘాటించారు. జిడబ్ల్యుఎంసి మాస్టర్ ఎ÷–లాన్ అమలుకు ప్రత్యేక అధికారి నియమించాలని ఎంఎయుడి ముఖ్య కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు.

# బేస్‌బాల్‌ఆడుతూ విద్యార్థి మృత్యువాత

**వెలుతురు ):**
బేస్ బాల్ ఆడుతూ ఓ విద్యార్థి మృత్యు ఒడిలోకి చేరాడు. ఈ విషాదకర సంఘటన మంగళవారం ఉదయం నిర్మల్ జిల్లాలో చోటు చేసుకుంది. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎంజేపీ పాఠశాలలో తొమ్మిదవ తరగతి విద్యార్థి ఫయాజ్ హుస్సేన్ ఉదయం బేస్ బాల్ ఆడుతూ అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన ఉపాధ్యాయులు వెంటనే ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు విద్యార్థి మృతి చెందినట్లు ధృవీకరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# హైదరాబాద్ నగరంలో మరో దారుణం

### మహిళపై దారుణంగా సామూహిక అత్యాచారం

### మహిళ ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు

**హైదరాబాద్,నవంబర్5( వెలుతురు):**
హైదరాబాద్ నగరంలో మరో దారుణం జరిగిం. మరో మహిళ సామూహిక అత్యాచారానికి గుయ్యింది.పనికోసం వచ్చిన ఆ మహిళ మృగాళ్ళను నమ్మి వెళ్లి అత్యాచారానికి గురయ్యింది. పొట్ట కూటి కోసం భవన పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఎప్పటిలాగే సోమవారం కూడా ఆ మహిళ పనికి వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చే సమయంలో అనుకోని ఆపద ఆమెను చుట్టుముట్టింది. ముగ్గురు వ్యక్తుల మాయ మాటలు చెప్పి పని ఉందని తమవెంట తీసుకుని వెళ్లారు. తీరా అక్కడికి తీసుకుని వెళ్లి సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. హైదరాబాద్‌లోని మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ దారుణం చోటు చేసుకుంది. ఓ కార్మికురాలిపై ముగ్గురు కామాంధులు దారుణంగా అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలు ఓ భవనంలో పని చేస్తోంది. ఉదయం పనికి వెళ్లిన మహిళ సాయంత్రం భవనంలో పని ముగించుకుని ఇంటికి బయలుదేరింది. హైటెక్ సిటీ క్రాస్ రోడ్డు వద్ద బస్సు కోసం మహిళ ఎదురు చూస్తోంది. ఈ క్రమంలో ఎప్పటి నుంచో ఆమెపై కన్నేసిన ముగ్గురు కామాంధులు ఆటోలో ఆమె వద్దకు వచ్చారు.

ఆమెకు మాయ మాటలు చెప్పి వాళ్లతో తీసుకెళ్లారు. ఆపై దారుణానికి పాల్పడ్డారు. తమ ఇంట్లో బట్టలు ఉతికే పని ఉందని మహిళకు చెప్పారు. దీంతో బట్టలు ఉతికితే డబ్బులు వస్తాయని ఆశ పడి వారిని నమ్మి వెళ్లింది. ముగ్గురు వ్యక్తులు ఆటోలో మహిళను మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తాము ఉంటున్న రూంకు తీసుకువచ్చారు. ఆపై మహిళపై అతి దారుణంగా అత్యాచారానికి పాల్పడ్డాడు. కామాంధుల అఘాయిత్యంతో మహిళ గట్టిగా కేకలు వేసింది. దీంతో పక్కనే ఉన్న ఓ మహిళ అక్కడకు వచ్చి జరుగుతున్న దారుణాన్ని చూసి అవాక్కయ్యింది. అయితే మహిళ రావడాన్ని చూసిన ముగ్గురు వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యారు. ఆపై బాధితురాలు తనకు జరిగిన అన్యాయం గురించి సదరు మహిళకు చెప్పి భోరున విలపించింది. దారుణాన్ని చూసిన సదరు మహిళ మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన మధురానగర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాధిత మహిళను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పరారైన ముగ్గురు వ్యక్తుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

## బాలికపై అత్యాచారం వార్త అసత్యం

### ఇలాంటి వార్తలు రాసేప్పడు జాగ్రత్త అవసరం

### తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు వెల్లడి

**తిరుపతి,నవంబర్ 5( వెలుతురు):**
తిరుపతిలో మైనర్ బాలికపై అత్యాచారం జరగనప్పటికీ జరిగినట్లు సా కథనం ప్రచురితం సరికాదని తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు అన్నారు. అత్యాచారం జరిగిందని పాప గాని, పాప తల్లిదండ్రులు గాని చెప్పకపోయినా అత్యాచారం జరిగినట్టు ప్రచారం చేయడం నేరమన్నారు. ఫోక్సో చట్టం కింద కఠినమైన చర్యలు ఉంటాయన్నారు. మంగళవారం ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ.. బాలికకు పీహెచ్‌సీలో మొదట వైద్య పరీక్షలు జరిగాయని... ఆ తరువాత తిరుపతి మెటర్నిటీలో కూడా నిష్ణాతులైన వైద్యుల చేత వైద్య పరీక్షలు కోసం రాత్రి తిరుపతికి తీసుకొచ్చినట్లు తెలిపారు. రేప్ జరిగిన ఆధారాలు లేవని తిరుపతి మెటర్నిటీలోని వైద్యులు రాత్రి స్పష్టంగా చెప్పారన్నారు. పాప స్టేట్‌మెంట్‌లో సందిగ్ధం ఉందని రాత్రి చెప్పామని.. రాత్రి మెడికల్ ఎగ్జామినేషన్‌లో అత్యాచారం జరగలేదని వైద్యులు చెప్పిన విషయం మీడియాకు కూడా చెప్పామని తెలిపారు. అయినా కొంతమందిలో ఎందుకు అంత ఉత్సాహం అంటూ మండిపడ్డారు. ఫోక్సో చట్టంలో మైనర్‌కు చాలా హక్కులు ఉన్నాయన్నారు. మళ్లీ ఇలాంటివి రిపీట్ కాకుండా చర్యలు ఉంటాయని తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు వెల్లడించారు. కాగా... తిరుపతిలో జిల్లాలో మైనర్ బాలికపై అత్యాచారం జరిగినట్లు సాక్షి పత్రిక మెయిన్ పేజీలో వార్త వచ్చింది. అయితే ఈ వార్తపై బాలిక తండ్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలికపై అత్యాచారం జరగలేదని స్పష్టం చేశారు.

# ఎన్వీఎస్ ప్రభాకర్‌పై పరువు నష్టం కేసు


### నాంపల్లి కోర్టుకు హాజరైన దీపాదాస్ మున్షీ




**హైదరాబాద్,నవంబర్5( వెలుతురు):**
బిజెపి నేత, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై ఏఐసీసీ ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షి పరువునష్టం కేసు దాఖలుచేశారు. ఈ కేసు కోసం మంగళవారం ఆమె నాంపల్లి క్రిమినల్ కోర్టుకు హాజరయ్యారు. బీజేపీ నేత ప్రభాకర్ చేసిన వ్యాఖ్యల విషయంలో ఆమె పరువునష్టం కేసు వేశారు. ఈ పిటిషన్ పై నాంపల్లి కోర్టు విచారణ జరుపుతోంది. ఈ నేపథ్యంలో దీపాదాస్ మున్షి కోర్టుకు హాజరయ్యారు.ఆమెకు మద్దతుగా కాంగ్రెస్ ఎంపీలు, మాజీ ఎంపీలు కార్యకర్తలు నాంపల్లి కోర్టుకు వచ్చారు. బీజేపీ నేత ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై దీపాదాస్ మున్షి పరువునష్టం కేసు వేయగా, ఈ పిటిషన్‌పై నాంపల్లి కోర్టు విచారణ చేస్తోంది. అయితే పలుమార్లు కోర్టుకు బీజేపీ నేత ప్రభాకర్ గౌర్హాజరయ్యారు. ప్రభాకర్ చేసిన ఆరోపణలకు ఆధారాలతో కోర్టుకు హాజరవ్వాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేయడంతో నాంపల్లి కోర్టులో బీజేపీ నేత ప్రభాకర్ హాజరయ్యారు. అయితే ఈకేసును డిసెంబర్ 5వ తేదీకి నాంపల్లి కోర్టు వాయిదా వేసింది. తెలంగాణ బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్–ఎస్ ప్రభాకర్ తనపై చేసిన అవినీతి ఆరోపణలపై ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీ నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. తాను 'క్విడ్ ప్రో కో'కు పాల్పడ్డానంటూ గతంలో ప్రభాకర్ చేసిన ఆరోపణలపై దీపాదాస్ మున్షీ పరువునష్టం దావా వేసిన విషయం తెలిసిందే. ఎన్నికల సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్‌లో టికెట్ల కోసం పలువురు నేతలు ఆమెకు బెంజ్ కార్లు గిఫ్ట్‌గా ఇచ్చారంటూ ప్రభాకర్ చేసిన ఆరోపణలు సంచలనంగా మారాయి.

# బీఆర్ఎస్ ను వెంటాడుతున్న సంఘటనలు

**హైదరాబాద్,నవంబర్5( వెలుతురు):**
రాజ్ పాకాల కేవలం ఫ్యామిలీ మెంబర్స్, ఆత్మీయులకే ఆ పార్టీ ఇచ్చాడని చెప్పాడు. కానీ.. ప్రచారం మాత్రం అందుకు భిన్నంగా ఉంది. అయితే.. ఇంతటి వ్యతిరేక ప్రచారం రావడానికి కారణాలూ లేకపోలేదు. 'మనం ఏది చేస్తా.. మనకు అదే వస్తుంది' అన్నట్లుగా గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రాజకీయమే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నట్లుగా టాక్ వినిపిస్తోంది.తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ఆదివారం సంచలనాలు నమోదయ్యాయి. ఓ చిన్న పార్టీ చివరకు కేసీఆర్ ఫ్యామిలీని రచ్చకీడ్చింది. కేసీఆర్ కుటుంబం వ్యవహారంపై రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఓ ఫ్యామిలీ పార్టీ కాస్త ఈ వివాదానికి కారణమైంది. నిన్న కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఫాంహౌజ్‌లో జరిగిన పార్టీ చిలికిచిలికి గాలివానగా మారింది. చివరకు పోలీసులు రాజ్ పాకాలకు నోటీసులు ఇవ్వాల్సి వచ్చింది. అయితే.. అది ఫ్యామిలీ పార్టీ అయినప్పటికీ పెద్ద కేసుగానే ప్రచారం జరిగింది. కానీ.. కాస్త ఆలోచిస్తే ఇది అంత పెద్ద కేసు కాదని అర్థం చేసుకోవచ్చు. కేవలం ఫ్యామిలీ కోసమే రాజ్ పాకాల ఈ పార్టీని ఏర్పాటు చేశాడు. దీనిపై కేటీఆర్ కూడా క్లారిటీ ఇచ్చాడు. రాజ్ పాకాల కేవలం ఫ్యామిలీ మెంబర్స్, ఆత్మీయులకే ఆ పార్టీ ఇచ్చాడని చెప్పాడు. కానీ.. ప్రచారం మాత్రం అందుకు భిన్నంగా ఉంది. అయితే.. ఇంతటి వ్యతిరేక ప్రచారం రావడానికి కారణాలూ లేకపోలేదు. 'మనం ఏది చేస్తా.. మనకు అదే వస్తుంది' అన్నట్లుగా గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రాజకీయమే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నట్లుగా టాక్ వినిపిస్తోంది. రాజ్ పాకాల తన ఫాంహౌస్‌లో నిర్వహించింది చిన్నపాటి లిక్కర్ పార్టీనే అనేది తెలు స్తోంది. కాకుంటే అనుమతి లేకుండా నిర్వహించడాన్ని పోలీసులు తప్పుపట్టారు. ఈ క్రమంలో చిన్నపాటి కేసు నమోదయ్యే అవకాశాలు ఉండేవి. కానీ.. ఇప్పుడు ఫాంహౌస్ ఓనర్, పార్టీ నిర్వహించిన రాజ్ పాకాలనే కనిపించకుండా పోవడంతో సీరియస్‌గా మారిపో యింది. మరోవైపు.. పార్టీలో పాల్గొన్న వారికి చేసిన టెస్టుల్లోనూ ఒకరికి కొకైన్ పాజిటివ్‌గా తేలింది. తనకు రాజ్ పాకాలనే ఆ కొకైన్ ఇచ్చినట్లుగా



సదరు వ్యక్తి చెప్పాడు. దీంతో ఈ వివాదం కాస్త డ్రగ్స్ వైపునకు దారితీసింది. ఆ కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా డ్రగ్స్ వాడినట్లుగా ప్రచారం ఉంది. అయితే ఈ పార్టీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం పాల్గొన్నట్లుగా నిన్నటి నుంచి ప్రచారం జరుగుతోంది. పోలీసులు వచ్చే కాసేపటికే ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారని పలువురు ఆరోపించడం కనిపించింది. పార్టీలో నుంచి వెళ్లిపోతున్నట్లు కేటీఆర్‌కు సంబంధించిన వీడియో క్లిప్ కూడా సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆయన పాల్గొన్నది లేనిది ఇప్పటివరకు కూడా ఎలాంటి క్లారిటీ లేదు.ఇదిలా ఉండగా.. రాజ్ పాకాల కనిపించకుండా పోవడంతో ఎక్సైజ్ పోలీసులు ఓరియన్ విల్లాస్లోని ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తాళాలు బద్దలు కొట్టారు. సోదాలకు ప్రయత్నించారు. ఆ తర్వాత నందినగర్‌లోని కేటీఆర్ ఇంటి వద్ద కూడా పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. దాంతో ఈ మందు పార్టీ వ్యవహారం కాస్తా బీఆర్ఎస్‌లో ప్రకంపనలకు దారితీసింది. దీనిని ఎలా సమర్థించుకోవాలో కూడా తెలియక గులాబీ పార్టీ నేతలు సతమతం అవుతున్నారని తెలుస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాలో ఒకవిధంగా ఉండేవి. కానీ.. తెలంగాణ రాష్ట్రం ఎప్పుడైతే ఏర్పడిందో..

బీఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పుడైతే కొలువుదీరిందో అప్పటి నుంచి రాజకీయాలు ఇంట్రస్టింగ్‌గా మారాయి. రాజకీయ ప్రత్యర్థుల్ని ట్రాప్ చేయడం లేదంటే బ్లాక్ మెయిల్ చేయడం వంటి రాజకీయాలు చాలా వరకు పెరిగిపోయాయి. అవి ఎంతలా అంటే బీఆర్ఎస్ హయాంలో కిందిస్థాయి నుంచి పెద్దల స్థాయి వరకూ ఈ కుట్రలు జరిగాయని అందరూ చెప్పే మాటే. కేసులు నిర్ధారణ కాకున్నా కొంత మందిని అరెస్టు చేసి రోజుల తరబడి జైళ్లో పెట్టిన దాఖలాలు ఉన్నాయి. వారిపై ఇష్టం వచ్చినట్లుగా కామెంట్స్ చేస్తూ? ప్రచారం చేశారు. అటు కాంగ్రెస్ నేతలు కానీ.. ఇటు బీజేపీ నేతలు కానీ.. అందరూ ఈ బాధలు అనుభవించారు.అయితే.. గతంలో ఆ బాధలు అనుభవించిన వారంతా ఇప్పుడు వివిధ పదవుల్లో ఉన్నారు. రాష్ట్రంలో ఓ నాయకుడి వాయిస్ కాస్త గట్టిగా వినిపిస్తున్నది అంటే.. అతడిని గత బీఆర్ఎస్ హయాంలో తొక్కిపెట్టే ప్రయత్నమే జరిగిందని చెప్పాల్సిందే. ప్రతీ నేత బీఆర్ఎస్ కుట్రలకు బలైన వారే. అలా.. ముందుగా ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డిని ట్రాప్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోన్లను సైతం ట్యాప్ చేశారు. ఆ తరువాత ఎమ్మెల్యేల ట్రాప్ అంటూ బీజేపీని ట్రాప్ చేశారు. బీజేపీ అగ్రనేతలను అరెస్టు చేసేందుకూ నానా హంగామా చేశారు. చివరకు ఆ కేసులో కూడా బీఆర్ఎస్ అభాసుపాలైంది. పక్క రాష్ట్రాల కోసం డేటా చోరీ అంటూ మరో గేమ్‌కు తెరలేపారు. పేపర్ లీకేజీ విషయంలో బండి సంజయ్ కుమార్‌ను అరెస్టు చేసి జైలులో పెట్టారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో కీలక అరెస్టులు ఉన్నాయి. ఎన్నో కుట్రలూ ఉన్నాయి. పదేళ్ల కాలంపాటు అధికారంలో ఉన్నామని అడ్డగోలు రాజకీయాలు బీఆర్ఎస్ చేసింది. అవన్నీ ఇప్పుడు రాష్ట్రంలో మరోసారి చర్చకు వచ్చాయి. దాంతో ఇప్పుడు గులాబీ పార్టీకి కనీసం సానుభూతి దొరకని పరిస్థితి వచ్చింది. ఇప్పుడు రాజ్ పాకాల కేసు విషయంలోనూ ఎవరూ పెద్దగా వ్యతిరేకించడంలేదు. గతంలో చేసిన వాటికి ఈ మాత్రం ఎదుర్కోక తప్పదనే కామెంట్స్ వినిపిస్తుండడం బీఆర్ఎస్ పార్టీపై ఉన్న వ్యతిరేకతను తెలుపుతోంది.

# మరో యుద్ధం తప్పదా....



**ఇజ్రాయెల్, నవంబర్5( వెలుతురు):**
పశ్చిమాసియాలో ప్రతికార యుద్ధం పీక్స్‌కు చేరుకుంది. గొలుసులా కొనసాగుతున్న పరిణామాల మధ్య యుద్ధంలో చివరి అంకం మొదలైనట్లే కనిపిస్తోంది. దాదాపు ఐదు దేశాల్లోని మిలీషియాతో తలపడుతున్న ఇజ్రాయెల్.. చివరిగా ఇరాన్‌పై దృష్టి పెట్టింది. 45 ఏళ్ల తర్వాత ఇరాన్‌కు ఇజ్రాయెల్‌కు మధ్య ప్రత్యక్ష యుద్ధం షురూ అయ్యిందనే సూచనలు కనిపిస్తున్నాయి. మొత్తానికి మిడిల్ ఈస్ట్, అత్యంత భయంకరమైన పరిస్థితుల మధ్య అల్లాడుతోందిమిడిల్ ఈస్ట్‌లో ప్రధాన ప్లేయర్ల మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఈ రెండు దేశాలూ తలపడితే మధ్య ప్రాచ్యం మసై పోతుందేమో అనే అనుమానాలు ఇప్పుడు మరింత ఎక్కువయ్యాయి. అక్టోబరు 1న, ఇరాన్ ఇజ్రాయెల్‌పై ప్రయోగించిన క్షిపణి దాడికి 25 రోజుల తర్వాత ఇజ్రాయెల్ ప్రతిస్పందించింది. ఇరాన్‌పై "ఖచ్చితమైన దాడులు" అనే పేరుతో అక్టోబర్ 26 తెల్లవారుజామున బాంబుల వర్షం కురిపించింది. గత కొన్ని నెలలుగా ఇరాన్ ఇజ్రాయెల్‌పై చేస్తున్న నిరంతర దాడులకు ప్రతిస్పందనగా.. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్, ఇరాన్ సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు నిర్వహిస్తుందని ఒక ప్రకటనలో ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని సైనిక స్థావరాలపై సూర్యోదయానికి ముందే ఇజ్రాయెల్ దాడి ముగిసింది. ఇరాన్‌లోని సైనిక లక్ష్యాలపై ఖచ్చితమైన దాడులను నిర్వహించడం ద్వారా ప్రస్తుతానికి ఇజ్రాయెల్ సైన్యం లక్ష్యం నెరవేరిందని పేర్కొంది.అక్టోబరు 1న, ఇరాన్ ఇజ్రాయెల్‌పై దాదాపు 180 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. వీటిలో చాలా క్షిపణులను అమెరికా దళాల సహాయంతో నిర్మించిన ఇజ్రాయెల్ వైమానిక రక్షణ వ్యవస్థ కూల్చివేసింది. అయితే, ఇరాన్ చేసిన ఆ దాడి? లెబనాన్‌లోని హిజ్బుల్లాకు, ఇరాన్‌కు వ్యతిరేకంగా ఇజ్రాయెల్ చేసిన వరుస దాడులకు ప్రతిస్పందనగా చేసినట్లు ఇరాన్ పేర్కొంది. అలాగే, హిజ్బుల్లా నాయకుడు హసన్ నస్రల్లాను వైమానిక దాడిలో చంపేసింది ఇజ్రాయెల్. ఆ తర్వాత, సరిహద్దుల గుండా దక్షిణ లెబనాన్‌లోకి ఇజ్రాయెల్ సైన్యాన్ని పంపింది. లెబనాన్‌పై కూడా వైమానిక దాడులు తీవ్రతరం చేసింది. ఈ దాడుల్లో హిజ్బుల్లాను తుడిచిపెట్టేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. దీనితో లెబనాన్‌లో వేల మంది ప్రాణాలు కోల్పోయారు. ఆకస్మిక దాడులతో లెబనాన్ అల్లకల్లోలం అయ్యింది., ఈ ఏడాది ఏప్రిల్‌లో కూడా ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణులతో దాడులు చేసింది. దశాబ్దాలుగా ఇజ్రాయెల్‌పై దాడులు చేయడానికి ఇరాన్ ప్రాక్సీలుగా మిడిల్ ఈస్ట్‌లోని పలు తీవ్రవాద గ్రూపులను వినియోగించుకుంటుంది. అయితే, ఇటీవల కాలంలో ఇరాన్ నేరుగా ఇజ్రాయెల్‌పై చేసిన దాడి మాత్రం ఏప్రిల్ నెలలోనే జరిగింది. నిజానికి, ఇజ్రాయెల్‌పై పాలస్తీనా మిలిటెంట్ గ్రూప్ హమాస్ ఆకస్మిక దాడి ప్రారంభించిన మరుసటి రోజు, అంటే, గతేడాది అక్టోబర్ 8 నుండి ఇజ్రాయెల్, హిజ్బుల్లా సరిహద్దు కాల్పుల యుద్ధంలో ఉన్నారు.యుద్ధం తీవ్రమయ్యి గాజాలో ఇజ్రాయెల్ దాడులపై అంతర్జాతీయంగా విమర్శలు కూడా వచ్చాయి. గాజా స్ట్రిప్‌ని బాంబులతో జల్లెడ పట్టిండి ఇజ్రాయెల్. పదుల సంఖ్యలో హమాస్ అగ్ర నాయకత్వాన్ని అంతం చేస్తూ వచ్చింది. అయితే, హమాస్‌కు సంఘీభావంగా లెబనాన్ కేంద్రంగా నడుస్తున్న హిజ్బుల్లా ఇజ్రాయెల్‌పై రాకెట్లను కాల్చడం ప్రారంభించింది. దీనితో, కొన్ని రోజులు ఇజ్రాయెల్–హిజ్బుల్లా యుద్ధం భీకరంగా కొనసాగింది. ఇక, ఇరాన్ బ్యాకప్‌గా ఉన్న ఈ గ్రూపులపై ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధంలో అప్పుడప్పుడు ఇరాన్ కూడా కలుగజేసుకుంటూ ఉంది. అదే, తాజాగా ఇజ్రాయెల్ ఇరాన్‌పై దాడి చేయడానికి కారణం అయ్యిందియుద్ధం మొదలైనప్పటి నుండీ ఇజ్రాయెల్‌కు అమెరికా సహకారం ఎక్కువగా ఉంది. ఎర్రసముద్రంలో ఇజ్రాయెల్‌కు వెళ్లి వచ్చే ఓడలపై దాడి చేస్తున్న హౌతీ తీవ్రవాదులను ఎదుర్కోవడం దగ్గర నుండీ ఇజ్రాయెల్‌కు ఆయుధ సహకారం, సైనిక శిక్షణా సహకారం వంటివి అందిస్తూనే ఉంది. అయితే, ఇరాన్‌పై చేస్తున్న దాడుల్లో మాత్రం అమెరికా నేరుగా పాల్గొనలేదని పేర్కొంది. అయితే, యూఎస్ ప్రెసిడెంట్ బైడెన్, ఇతర ఉన్నతాధికారులు ఇజ్రాయెల్ చేస్తున్న నిర్దిష్ట లక్ష్య దాడులను కొనసాగించమని ప్రోత్సహిస్తున్నారు. ఇరాన్‌పై తాజా దాడి కూడా అందులో భాగంగానే జరిగినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక, ఈ దాడులకు ఇరాన్ ప్రతిస్పందిస్తే, దాని నుండి ఇజ్రాయెల్‌ని రక్షించడానికి యునైటెడ్ స్టేట్స్ సిద్ధంగా ఉందని, ఇజ్రాయెల్ వైమానిక రక్షణ వ్యవస్థలను బలోపేతం చేయడానికి అధికారులు రెడీ ఉన్నారని అమెరికా వెల్లడించింది.ఇజ్రాయెల్ తాజాగా చేసిన దాడులను ఇరాన్ రక్షణ వ్యవస్థ అడ్డుకున్నట్లు ఇరాన్ పేర్కొంది. దీనివల్ల "పరిమిత నష్టం" మాత్రమే జరిగిందని ఇరాన్ వెల్లడించింది. అక్టోబర్ 26 తెల్లవారుజామున ఇరాన్ వ్యాప్తంగా సైనిక కేంద్రాలపై ఇజ్రాయెల్ దాడి చేసినట్లు తెలిపింది. టెహ్రాన్, ఖుజెస్తాన్, ఇలాం ప్రావిన్సులలోని సైనిక కేంద్రాలలోని కొన్ని భాగాలపై ఈ దాడి జరిగినట్లు ఇరాన్ నివేదించింది. "ఈ దాడిని ఇరాన్ సమగ్ర వాయు రక్షణ వ్యవస్థ విజయవంతంగా అడ్డుకుందని వెల్లడించింది. టెహ్రాన్‌తో పాటు దేశం చుట్టూ అనేక ప్రాంతాలలో వైమానిక రక్షణను మోహరించినట్లు ఇరాన్ అధికారులు చెప్పారు.అయితే, "ఇటీవల కాలంలో ఇరాన్ చేసిన దాడులకు ప్రతిస్పందన ఈ తాజా దాడితో ముగిసిందనీ.. ఇజ్రాయెల్‌కు ఉన్న తక్షణ బెదిరింపులను అడ్డుకున్నామని" ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ వెల్లడించింది. "ఇక ఇరాన్ కొత్తగా మరో రౌండ్ దాడులు ప్రారంభిస్తే.. ఇజ్రాయెల్ మరింత తీవ్రంగా ప్రతిస్పందస్తుందని" హెచ్చరికలు కూడా చేశారు. ఈ విషయంలో ఇజ్రాయెల్ స్పష్టంగా ఉందనీ.. ఇజ్రాయెల్‌ను ఇంకా ఎవరైనా బెదిరించే ప్రయత్నం చేసినా.. ఈ యుద్ధాన్ని ఇంకా విస్తరించాలని కోరుకున్న పరిణామాలు తీవ్రంగా ఉంటాయని పేర్కొంది. ఇజ్రాయెల్‌కు హాని కలిగించాలని కోరుకునే వారందరూ దానికి భారీ మూల్యం చెల్లించవలసి ఉంటుందని వెల్లడించారు. "నిర్ణయాత్మకంగా వ్యవహరించే సామర్థ్యం, సంకల్పం రెండూ ఇజ్రాయెల్ దగ్గర ఉన్నాయని ఈ రోజు నిరూపించమని" అన్నారు. ఇజ్రాయెల్ ప్రజలను రక్షించడానికి ఎలాంటి నేరమైన చేస్తామని, ఇజ్రాయెల్ ప్రజల రక్షణ కోసం సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.

## వడ్లు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో ఆఫీసర్



**వెలుతురు నారాయణఖేడ్ నవంబర్ 05 :**
నారాయణఖేడ్ మండలం వెంకటాపూర్ గ్రామంలో చౌరస్తా వద్ద ఏర్పాటుచేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని నారాయణఖేడ్ రెవెన్యూ డివిజన్ అధికారి అశోక చక్రవర్తి తాసిల్దార్ భాస్కర్ ఏఈఓ సురేష్ ఆకస్మిక తనిఖీసారు వెంకటపూర్ గ్రామానికి చెందిన ఒక రైతు మలగొండ రెవెన్యూ డివిజన్ అధికారికి ఫోన్ చేయడంతో స్పందించిన డివిజన్ అధికారి వెంటనే వడ్ల కొనుక్కుని కేంద్రానికి చేరుకొని రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఎందుకు రైతులు పండించిన వరి ధాన్యాన్ని ఎందుకు తూకం చేయడం లేదని ప్రశ్నించడంతో వెంటనే స్పందించిన రెవెన్యూ డివిజన్ అధికార అశోక చక్రవర్తి రైస్ మిల్ యజమానులతో మాట్లాడారు అదే విధంగా జిల్లా జాయింట్ కలెక్టర్ దృష్టికి రైతుల సమస్యలను తీసుకెళ్లారు రైతులు పండించిన ధాన్యాన్ని సెంటర్లో తెచ్చి ఆరబెడుతూ ఉన్నారు వాటిని తూకం చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేయడంతో జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించి రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కృషి చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు రైస్ మిల్ యజమానుల ఇబ్బంది కారణంగా వడ్లను తూకం చేయడం లేదని ఆర్డిఓ పేర్కొన్నట్లు రైతు మలగొండ పేర్కొన్నారు అధికారులు వచ్చిన తనిఖీ పరిశ్రమలో సిఏ సాయిలు అందుబాటులో ఉన్నారు

## ఎమ్మెల్సీ ఎన్నికల కోసం బాధ్యతతో ఓటు నమోదు చేసుకోండి

### ఎంఐఎం అధ్యక్షులు మోహీద్ పటేల్




**వెలుతురు నారాయణఖేడ్ నవంబర్ 05 :**
నారాయణఖేడ్ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించేందుకు ఓటును ఆఫ్లైన్ లేదా ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని నారాయణఖేడ్ ఎంఐఎం అధ్యక్షులు, న్యాయవాది మోహీద్ పటేల్ పటేల్ పిలుపునిచ్చారు. రాబోయే ఉమ్మడి జిల్లా మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల, టీచర్ల శాసనమండలి ఎన్నికల్లో ఓటరు హక్కు వినియోగించేందుకు 2021 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తిచేసిన వారు అర్హులని తెలిపారు. అర్హులైన వారు ఫారం-18ను పూర్తిచేసి నవంబర్ 6లోపు తమ ఓటు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సిన బాధ్యత ఉందని మోహీద్ పటేల్ సూచించారు.

## చిరుధాన్యాల సమాఖ్య సదస్సులో పాల్గొన్న శాసనసభ్యులు కోనింటి మాణిక్ రావు...



**జహీరాబాద్ వెలుతురు నవంబర్ 05:**
జహీరాబాద్ డెక్కన్ డెవలప్మెంట్ సొసైటీ వారి ఆహ్వానం మేరకు జాతీయ చిరుధాన్యాల సమాఖ్య వారి అధ్వర్యంలో జరిగిన సదస్సులో జహీరాబాద్ శాసనసభ్యులు కోనింటి మాణిక్ రావు పాల్గొన్నారు. ఈ సంధ్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిరు ధాన్యాలతో ఆరోగ్యంతో పాటు ఆర్థికంగా బలపడేందుకు ప్రభుత్వం చిరు ధాన్యాల సాగును ప్రోత్సాహకాలు అందించి పంటలకు మద్దతు ధరను పెంచాలని కోరారు. గత 40 సంవత్సరాలుగా చిరు ధాన్యాల సాగుకు డి డి ఎస్ సంఘం వారు చేస్తున్న కృషి అభినందనీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, ఝరసంఘం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, మిల్లెట్ సిస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.ఐ

## కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పెద్దులు ను పరామర్శించిన కాట సుధా శ్రీనివాస్ గౌడ్

**అమీన్ పూర్ వెలుతురు నవంబర్ 05:**
కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పెద్దులు ప్రమాదవశాత్తు ఆక్సిడెంట్ కు గురై చందానగర్ లోని సాయి దీప హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని వారిని పరామర్శించిన సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, అమీన్ పూర్ 15వ వార్డ్ కౌన్సిలర్ కాట సుధా శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల జనాప్రకారం రిజర్వేషన్ కల్పించాలి

### ప్రభుత్వానికి డిమాండ్ హైకోర్టు న్యాయవాది వంశీకృష్ణ కురుమ



**వెలుతురు నారాయణఖేడ్ నవంబర్ 05 :**
నారాయణఖేడ్ ఆర్ ఎం బి గెస్ట్ హౌస్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హైకోర్టు న్యాయవాది వంశీకృష్ణ మాట్లాడుతూ రానున్న సర్పంచ్ ఎన్నికల్లో బీసీలకు జనాభా ప్రతిపాదికన ప్రకారము స్థానిక సంస్థ ఎన్నికల్లో రిజర్వేషన్లను కల్పించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు నారాయణఖేడ్ నియోజకవర్గం కురుమ సంఘం తాలూకా ఉపాధ్యక్షులు మలిగొండ జిల్లా నాయకులు దశరథ్ కురుమ మనూరు మండల కురుమ అధ్యక్షులు మల్లేశం అరుణ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు గతంలో కులగన ఏర్పాటు సర్వే చేయాలని హైకోర్టులో సత్యనారాయణ అనే వ్యక్తి న్యాయవాది కేసు వేయడంతో హైకోర్టు కులగన సర్వే నిర్వహించి బీసీలకు న్యాయం చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో కాంగ్రెస్ ప్రభుత్వం కులగన సర్వే ప్రారంభించిందని ఆయన పేర్కొన్నారు కులగన సర్వే ప్రకారము కురుమ సంఘం బాధ్యులు అందరూ కురుమ అనే పదాన్ని అందులో రాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు సర్పంచ్ ఎన్నికల నుండి ఎంపీటీసీ జెడ్పిటిసి ఎంపీపీ ఎమ్మెల్యే ఎంపీ అన్ని స్థానాల్లోనూ కురుమ సంఘాల నాయకులకు అవకాశం కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు జనాభా ప్రకారం కుర్మవారికి రిజర్వేషన్లు కల్పించి అన్ని స్థానాల్లోనూ రాజ్యాధికారంలో అవకాశం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు లేని పక్షంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తామని ఆయన డిమాండ్ చేశారు అందుకోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కురుమ సంఘం బాధ్యులకు స్థానిక సంస్థ ఎన్నికల్లో జనా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని మరోసారి విజ్ఞప్తి చేశారు ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కురుమ సంఘం నాయకులకు గుర్తించి న్యాయం చేస్తారని ఆశిస్తున్నట్లు హైకోర్టు న్యాయవాది వంశీకృష్ణ పేర్కొన్నారు

## తపస్ ధర్నాకు భారీగా తరలివచ్చిన ఉపాధ్యాయులు




**మెదక్ వెలుతురు నవంబర్ 05:**
తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఉద్యమ కార్యచరణలో భాగంగా ఈరోజు మెదక్ జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా భారీ ఎత్తున హాజరైన ఉపాధ్యాయులను ఉద్దేశించి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న నాలుగు డీఏ లను వెంటనే ప్రకటించాలని, పి ఆర్ సి రిపోర్ట్ తెప్పించుకొని 60% ఫిట్మెంట్ తో అమలు చేయాలని, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, జీ ఓ 317 బాధితులకు వెంటనే న్యాయం చేయాలని, జిపిఎఫ్ పెండింగ్ బిల్లును వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో 317 విషయంలో ప్రభుత్వం నియమించిన కమిటీ ఇచ్చిన నివేదికను బయటపెట్టాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా తపస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, చల్లా లక్ష్మణ్, రాష్ట్ర బాధ్యులు దుబాషి భాస్కర్, ఆర్ వి రామారావు, తపస్ మహిళా అధ్యక్షురాలు స్వరూప రాణి, మహిళా ఉపాధ్యక్షులు మాధవి, రేఖ,సుమతి, విజయ,సంగీత,ప్రశాంత, తపస్ జిల్లా బాధ్యులు వెంకటస్వామి, చక్రవర్తి, కమ్మరి రవీందర్, నరేందర్ గౌడ్,మాధవ రెడ్డి, శ్రీధర్ రెడ్డి,కృష్ణమూర్తి,మల్లేష్,ప్రవీణ్, తపస్ అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

## అఖిల భారత చిరుధాన్యాల చెల్లండ్ల సమాఖ్య నాలుగవ జాతీయ సదస్సు ప్రారంభం..



**జహీరాబాద్ వెలుతురు నవంబర్ 05:**
డెక్కన్ డెవలప్మెంట్ సొసైటి అనుసంధాన అఖిల భారత చిరుధాన్యాల చెల్లండ్ల సమాఖ్య వారు నాలుగవ జాతీయ సదస్సుని సంగారెడ్డి జిల్లా డిడిగి గ్రామంలోని డిడియస్-కెవికె ప్రాంగణం లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా కె. మాణిక్ రావు, జహీరాబాద్ సశాసనసభ్యులు, డా. షేఖ్. ఎన్. మీరా, ఆటారి జోన్ x డైరెక్టర్, స్వాతి తివారీ, నాబార్డ్ డిప్యూటీ జనరల్ మేనేజర్, కృష్ణ తేజా, సంగారెడ్డి జిల్లా డిప్యూటీ మేనేజర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి 10 రాష్ట్రాలలో 15 సంస్థల నుండి సుమారు 100 మంది మహిళా రైతులు, ప్రతినిధులు, స్టాఫ్ సభ్యులు, మీడియా మిత్రులు పాల్గొన్నారు. ముందుగా డిడియస్ సంస్థాపకులు పి. వి. సతీష్ మృతికి ఒక నిమిషం మౌనం పాటించారు. జ్యోతి ప్రజ్వలన తో కార్యక్రమం ప్రారంభించారు. ముందుగా డిడియస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి. దివ్య మాట్లాడుతూ "ఎంతో దూరం నుండి వచ్చిన చిరుధాన్యాల చెల్లండ్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమాఖ్య లో చిరుధాన్యాలు అంటే కేవలం ఒక పంట గానే చూడకుండా దాని ఆధారిత పంటల సరళీకరణ పద్ధతులు కూడా చాలా ముఖ్యమని భావిస్తాము." అన్నారు. డా. షేఖ్. ఎన్. మీరా, ఆటారి జోన్ x డైరెక్టర్ మాట్లాడుతూ "చిరుధాన్యాలు గూర్చి అందరూ మరచిపోయిన వేలలో ఇవే పంటలు పట్టుకుని ముందుకు తీసుకువచ్చిన డిడియస్ మహిళలు మధ్య ఉండటం నేను అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఈ పట్టుదలతోనే మర్చిపోయిన పంటల నుండి అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం జరుపుకునే వరకు వచ్చినాము. మన దేశానికి అన్నీ విధాలుగా చిరుధాన్యాల అనుకూలమైన పంటలు. ఎన్నో కోట్లు పెట్టి నేడు వరిలో ఎట్లా పోషకాలు కలపాలి అని రిసెర్చ్ చేస్తున్నారు. కానీ మనకి తరతరాలుగా ఉన్న మిల్లెట్స్ ను పక్కన పెట్టడం దుర్భరమైన విషయం. వీటిని సంఘాలకు రిజిస్టర్ చేయటానికి మేము పూర్తి సహకారం అందిస్తాం. నేడు సైంటిస్టులు రాజకీయ నాయకులు ఈ చెల్లల మాటలు వినాలి. చిరుధాన్యలు పండిచటం దండగ అనే పరిస్థితి నుండి చిరుధాన్యాలు పండించటం పండుగ అనే పరిస్థితి తీసుకురావాలి" అని అన్నారు. స్వాతి తివారీ, నాబార్డ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ మాట్లాడుతూ "చాలా దశాబ్దాలు వ్యవసాయం అంటే దిగుబడి పెంచటం గూర్చి మాట్లాడేవాళ్ళం. నేడు వాతావరణ మార్పిడి, పోషకాహార భద్రత కూడా ముఖ్యం అని అందరూ గుర్తిస్తున్నారు. అన్నీ విధాలుగా చాలా తక్కువ తీసుకుని ఎక్కువ ఇచ్చే పంటలు చిరుధాన్యాలు మాత్రమే. మీ పనిని ఇంకా వ్యాపించటానికి మేము అన్నీ విధాలుగా సహకారం అందిస్తాము." అన్నారు. అనంతరం కె మాణిక్ రావు, జహీరాబాద్ శాసనసభ్యులు మాట్లాడుతూ "ఇక్కడకి రావటం నాకు చాలా ఆనందంగా ఉన్నది. కొన్ని ఏండ్ల ముందు మన ప్రాంతం లో అన్నీ జొన్నలు లాంటి చిరుధాన్యలే ఎక్కువ కనిపించేవి. నేడు అందరికీ బియ్యం దొరకటం వలన, మరియు ఈ పంటలకి ఎటువంటి సహాయం లేకపోవటం వలన చాలా మంది పండించటం మానేశారు. పత్తికి వరికి ఎక్కువ ధర ఉందని రైతులు అటు వైపే మొగ్గు చూపుతున్నారు. కానీ ఈ చిరుధాన్యాలు తింటేనే జనాలకి ఆరోగ్యం బాగుంటుంది. ఈ విషయంపై నాకు వీలు అయిన సహాయం చేస్తాను. అసెంబ్లీ లో కూడా ఈ మాట చెప్తాను." అన్నారు. అతిధుల సందేశాల అనంతరం 15 మంది చిరుధాన్యాల మహిళా రైతులకు సత్కరించారు.



## శేఖాపూర్ తాండలో పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్డెన్ సెర్చ్



**జహీరాబాద్ వెలుతురు నవంబర్ 05:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం శేఖాపూర్ తాండలో పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తండాకు చెందిన గంజాయి స్మగ్లర్ల కదలికల పెరగడంతో జహీరాబాద్ డిఎస్పి రామ్మోహన్ రెడ్డి నేతృతంలో ముమ్మర సోదాలు చేపట్టారు. రాష్ట్రంలో గంజాయి అక్రమ రవాణా ఘటనల్లో పట్టుబడుతున్న నిందితుల్లో శేఖాపూర్ తాండకు చెందినవారు ఉండడంతో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. జిల్లా నుంచి ప్రత్యేక బెటాలియన్ సహ ఐదు వందల మంది పోలీసులు తెల్లవారుజామున ఇళ్లలో జాగిలాలతో ప్రత్యేక తనిఖీలు చేశారు. అనంతరం ప్రత్యేక సమావేశం నిర్వహించి తండా వాసులకు హెచ్చరికలు జారీ చేశారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడే నిందితులు స్వచ్ఛందంగా లొంగిపోవాలని లేని పక్షంలో పీడీ యాక్ట్ నమోదు చేస్తామని అన్నారు. తాండలో గంజాయి స్మగ్లర్ల కదలికలు ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలని పాత నేరస్తులందరూ లొంగిపోయేలా చూడాలని ఆదేశించారు. లేనిపక్షంలో ప్రభుత్వం నుంచి అందే విద్యుత్ సహా తాగునీరు, పౌరసరఫరాల బియ్యం, రైతుబంధు అన్ని పథకాలు నిలిపివేసేలా ప్రతిపాదిస్తామని డిఎస్పి హెచ్చరించారు. తనిఖీల్లో సరైన పత్రాలు లేని 43 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి స్మగ్లర్లతో తరచూ ఫోన్లో మాట్లాడుతున్న పదిమంది అనుమానితులను అదుపులోకి తీసుకొని జహీరాబాద్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ టౌన్ సీఐ శివ లింగం, రూరల్ సీఐ జక్కుల హన్మంతు, జహీరాబాద్ డివిజన్ పరిధిలోని ఆయా పోలీస్ స్టేషన్ల ఎస్ ఐ లు, ఏ ఎస్ ఐ లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## శోక నగరాన్ని సందర్శించండి

### రాహుల్యాత్ర సందర్భంగా హరీష్ రావు పోస్ట్

**హైదరాబాద్,నవంబర్5( వెలుతురు):**
హైదరాబాద్‌కు వస్తున్న రాహుల్ గాంధీ ముందుగా అశోక్‌నగర్ వెళ్లాలని మాజీమంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాహుల్‌ను ఉద్దేశిస్తూ ఎక్స్‌లో పోస్టు చేశారు. హైదరాబాద్‌కు వస్తున్న రాహుల్ గాంధీ.. అశోక్‌నగర్ వెళ్లాలని.. అక్కడి నిరుద్యోగ యువతను కలవాలని.. ఆ యువత పట్ల ప్రభుత్వం ఎలా ప్రవర్తించిందో చూడాలంటూ సోషల్ మీడియా ఎక్స్‌లో మాజీ మంత్రి పోస్టు చేశారు. ఇటీవల గ్రూప్-1 విద్యార్థుల ఆందోళనలతో హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో తీవ్ర హైటెన్షన్ వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. జీవో నెంబర్ 29ను రద్దు చేసి జీవో నెం 55ను అమలు చేయాలంటూ నిరుద్యోగులు ఆందోళనకు దిగారు. పెద్ద ఎత్తున నిరుద్యోగులు నిరసనకు దిగడంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. దీంతో పోలీసులు వారిని అడ్డుకోవడంతో పాటు అరెస్టులు చేశారు. పలు చోట్ల లాఠీచార్జ్‌లు కూడా జరిగాయి. నిరుద్యోగుల ఆందోళన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంగళవారం హైదరాబాద్‌కు వస్తున్నారు. ఈ నేపథ్యంలో రాహుల్‌ను ఉద్దేశిస్తూ ఎక్స్‌లో పోస్టు చేశారు మాజీ మంత్రి హరీష్‌రావు. అశోక నగరాన్ని సందర్శించండి రాహుల్ గాంధీ.. మీరు ఎన్నికల ముందు అశోక్ నగర్‌లో నిరుద్యోగ యువతను కలిసిన ప్రదేశంలోనే, మీ సో-కాల్డ్ ప్రజా పాలన విద్యార్థులపై కర్కశంగా వ్యవహరించింది. లాఠీ చార్జ్ చేసి వీపులు పగలగొట్టింది. ఈ దారుణాలు మీకు తెలుసా. హైదరాబాద్‌కు వస్తున్న మీరు ఒకసారి అశోక్ నగర్‌ను సందర్శించి ఆ విద్యార్థులతో మాట్లాడి.. వారి ఆవేదనను వినండి, శోక నగర్‌గా మార్చిన మీ ప్రభుత్వ తీరును చూడండి. మీరు వాగ్దానం చేసిన 2 లక్షల ఉద్యోగాల్లో కనీసం 10? ఉద్యోగ నోటిఫికేషన్లు కూడా ఇవ్వలేదు. టీఎస్పీఎస్సీని యూపీఎస్సీ తరహాలో ప్రక్షాళన చేస్తామని ప్రకటించారు, ప్రక్షాళన సంగతి దేవుడెరుగు, టీఎస్పీఎస్సీని టీజీపీఎస్‌గా పేరు మార్చి చేతులు దులుపుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పారు, కానీ అది కేవలం జాబ్‌లెస్ క్యాలెండర్‌గా మిగిలిపోయింది. పది నెలల కాలంలో నిరుద్యోగ భృతి, 5 లక్షల రూపాయల యువ వికాసం పథకం వంటి హామీల ఊసు కూడా లేదు. నిరుద్యోగుల పట్ల, విద్యార్థుల పట్ల మీరు మీ పార్టీ చూపిన కపట ప్రేమ బట్టబయలైంది. కాంగ్రెస్ ప్రభుత్వ కర్కశ పాలనను నిరుద్యోగ యువత తప్పకుండా గుర్తుపెట్టుకుంటుందని అంటూ ఎక్స్‌లో హరీష్‌రావు పోస్టు చేశారు.

## పోలీసుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

### శాంతిభద్రతల పరిరక్షణలో కటువుగా ఉండాల్సిందే

### హోంమంత్రి అనిత స్పష్టీకరణ

**అనంతపురం,నవంబర్ 5( వెలుతురు):**
వైకాపా హయాంలో జరిగిన అరాచకాలను సరిదిద్దడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు హోం మంత్రి అనిత తెలిపారు. వైకాపా సైకో బ్యాచ్ అసత్యాలను ప్రచారం చేస్తూ.. ప్రజలను భయపెడుతుంటే.. జగన్ సూక్తులు చెప్పడం హాస్యాస్పదమన్నారు. అనంతపురం పోలీస్ శిక్షణ కేంద్రంలో నిర్వహించిన డీఎస్పీల పాసింగ్ ఔట్ పరేడ్‌కు అనిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. పోలీసుల సంక్షేమంతోపాటు వారికి మౌలిక సదుపాయాల కల్పన దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులను సమాయత్తం చేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. ఏమీ జరగకపోయినా.. ఏదేదో జరిగిపోయిందని దుష్ప్రచారం చేస్తూ ప్రజలను వైకాపా సైకోలు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో జగన్ ఇంటి భద్రత కోసం రూ.12 కోట్లు ఖర్చు చేశారు. వైకాపా ఐదేళ్ల పాలనలో పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులకు వైకాపా దుష్టపాలన పాపాలే కారణం. శాంతిభద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు. పోలీసు వ్యవస్థను పటిష్ఠం చేస్తాం. పోలీసులకు మౌలిక సదుపాయాలను కల్పించి, సాంకేతికంగా పోలీసు వ్యవస్థను బలోపేతం చేస్తామని అనిత స్పష్టం చేశారు.

## జెత్వానీ కేసులో సుప్రీంను ఆశ్రయించిన విద్యాసాగర్

**న్యూఢిల్లీ,నవంబర్ 5( వెలుతురు):**
ముంబై నటి కాదంబరి జెత్వానీ వ్యవహారంలో ప్రధాన నిందితుడు కుక్కల విద్యాసాగర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన అరెస్టును సమర్థిస్తూ... ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గత నెల 10న ఇచ్చిన తీర్పును సుప్రీంలో విద్యాసాగర్ సవాల్ చేశారు. విద్యాసాగర్ పిటిషన్‌పై జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ అరవింద్ కుమార్‌ల ధర్మాసనం విచారణ జరిపింది. ట్రయల్ కోర్టులో ఇప్పటికే బెయిల్ అప్లికేషన్ దాఖలు చేసినట్లు సుప్రీంకోర్టుకు విద్యాసాగర్ తరపు న్యాయవాదులు చెప్పారు. బెయిల్ అప్లికేషన్‌పై త్వరగా నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని విద్యాసాగర్ న్యాయవాదులు విజ్ఞప్తి చేశారు. మూడు వారాల్లో బెయిల్ అప్లికేషన్‌పై నిర్ణయం తీసుకోవాలని లోయర్ కోర్టుకు ధర్మాసనం మార్గదర్శకాలు ఇచ్చింది. అలాగే ప్రతివాదులకు సుప్రీం ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.

## చెట్టును ఢీకొన్న విద్యార్థులతో వెళుతున్న ఆటో

### 13మంది విద్యార్థులకు తీవ్ర గాయాలు

**సిద్దిపేట,నవంబర్5( వెలుతురు):**
విద్యార్థులను పాఠశాలలకు తరలించే ఆటో అదుపుతప్పి చెట్టుకు ఢీకొన్న ఘటనలో 13 మంది విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణ శివారులో చోటు చేసుకుంది. దుబ్బాక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కమ్మర్ పల్లి గ్రామానికి చెందిన 13 మంది విద్యార్థులు దుబ్బాక పట్టణంలోని రెండు ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్నారు. ఈ క్రమంలో కమ్మర్ పల్లి నుంచి 13 మంది విద్యార్థులతో బయలుదేరిన ఆటో పట్టణ శివారు చికోడు వద్ద అదుపు తప్పి చెట్టుకు ఢీ కొట్టింది. ఈ ఘటనలో బాబు, సుదర్శన్, రోహిత్, యశ్వంత్‌తో పాటు మరో ముగ్గురికి తీవ్ర గాయాలైనాయి. మరో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన ఏడుగురిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్వల్ప గాయాలతో బాధపడుతున్న 6 మంది విద్యార్థులను దుబ్బాకలోని ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ అజాగ్రత్త వల్లే ప్రమాదం చోటు చేసుకుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. ఆయా పాఠశాలల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులకు నచ్చజెప్పి శాంతింప చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

## నేటి నుండి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే, సర్వే చేసే వారికి శిక్షణ,




**గోదావరిఖని, వెలుతురు,నవంబర్,5**
బుధవారం నుండి సామాజిక,ఆర్థిక, విద్య,ఉపాధి,రాజకీయ ,కుల సర్వే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లకు ఎన్ టి పి సి మిలీనియం హాల్లో మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమీషనర్ ఎఫ్ ఎ సి,అరుణశ్రీ, రామగుండం మండల తహసీల్దార్ కుమార స్వామి,రామగుండం నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమీషనర్ రాజలింగు,మండల విద్యాధికారి గడ్డం చంద్రయ్య ,ఎ సి పి శ్రీధర్ ప్రసాద్,టి పి ఎస్ నవీన్, సూపరింటెండెంట్ ఆంజనేయులు, సీనియర్ అసిస్టెంట్ పబ్బాల శ్రీనివాస్, పాల్గొనగా,డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ లింగారెడ్డి,శిక్షణ ఇచ్చారు.కాగా రేపటి నుండి ఇంటింటికి వస్తున్న సిబ్బందికి పూర్తివివరాలు అందించి సహకరించాలని గృహస్థులను పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, రామగుండం నగర పాలక సంస్థ కమీషనర్ ఎఫ్ ఎ సి,అరుణ శ్రీ కోరారు.ఆధార్, ఆహార భద్రతా కార్డు, ధరణి తదితర వివరాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

## మధు మేహ పుష్కరించుకొని అవగాహన కల్పించిన డాక్టర్లు సిబ్బంది.




**గోదావరిఖని,వెలుతురు, నవంబర్.5**
ఆర్జీ. 1 జనరల్ మేనేజర్, డి.లలిత్ కుమార్, ఆదేశాల మేరకు మంగళవారం. సింగరేణి వైద్య ఆరోగ్యశాఖ ఏరియా ఆసుపత్రి విభాగం ద్వారాఈ నెల తేది 14.11.2024 "ప్రపంచ మధుమేహ దినోత్సవము"ఉన్న సందర్భంగాజిడికె 2ఏ ఇంక్లైన్ గని ఉద్యోగులకు హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కారం పద్మ,గుండె సంబంధించినవ్యాధి, మధుమేహం,బీపీ యొక్క లక్షణాలు, దుష్ప్రభావాలు, నివారణ చర్యల గురించి పలు సూచనలు సలహాలు అవగాహనకార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కారం పద్మ , తెలియజేస్తూ బి.పి,మధుమేహం ఉన్నవారుమందులు క్రమం తప్పకుండా వాడుతూ నియంత్రణలో ఉంచుకోవాలని తెలిపారు. మధుమేహం వచ్చే అవకాశాలుఎవరికి ఎక్కువగా ఉంటాయి మరియు మధుమేహ వ్యాధిలక్షణాలు గురించి వివరించడం జరిగినది.అలాగే మధుమేహ వ్యాధి నియంత్రణ లేకపోయినట్లయితే వచ్చే దీర్ఘకాలిక సమస్యల గురించి వివరించడంజరిగింది. వ్యాధి లక్షణాలు కనిపిస్తే సకాలంలో గుర్తించి వైద్యులను సంప్రదించాలిఅని సూచించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని కొనసాగించడంద్వారా మధుమేహ వ్యాధిని నివారించవచ్చు అని నివారణ-నియంత్రణ కు సంబందించిన వివిధ మార్గాలను సూచించారు. ఈ కార్యక్రమంలో గనిమేనేజర్ అల్లాఉద్దిన్,సెక్షన్ ఇంచార్జ్ టి శంకర్, డి.వెంకటేశ్వర్లు, సేఫ్టీ ఆఫీసర్, యం,తిరుపతి ఇఇ,డి.గణేష్, సంక్షేమాదికారి, వెంకన్న ఫిట్ సెక్రటరీ ఎఐటియుసి సూపర్వైజర్స్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఆటో బోల్తా:తప్పిన ప్రాణాపాయం

**సిద్దిపేట,నవంబర్5( వెలుతురు):**
సిద్దిపేట జిల్లాలో ఘోర ప్రమాదం తప్పింది. ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో 10 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన దుబ్బాక శివారులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విద్యార్థులను తీసుకొని స్కూల్‌కు వెళ్తుండగా దుబ్బాక శివారులోకి ఆటో రాగానే అదుపుతప్పి బోల్తా పడింది. గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను దుబ్బాక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

# విశ్వబ్రాహ్మణ ,విశ్వకర్మలను ఒకే కులస్తులుగా పరిగణించాలి

### మీడియా సమావేశంలో విశ్వకర్మ సంఘాల నేతలు...

**కరీంనగర్ వెలుతురు నవంబర్ 05:**
తెలంగాణలో బీసీ కమిషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న బీసీ కులగననలో విశ్వబ్రాహ్మణ , విశ్వకర్మ లను కులంగా కాకుండా వృత్తులుగా విడదీయడం సరికాదని, విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ లను ఒకే కులస్తులుగా పరిగణించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విశ్వకర్మ సంఘాల నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం కరీంనగర్ లోని ప్రెస్ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారులు బ్రహ్మశ్రీ వేములవాడ ద్రోణాచారి , విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బ్రహ్మశ్రీ చెల్లోజు రాజు, జిల్లా కన్వీనర్ శ్రీరామోజు రవీంద్ర చారి లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం , బీసీ కమిషన్ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలను వంచనకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. విశ్వబ్రాహ్మణలను ఒకే కులస్తులుగా పరిగణించాలని డిమాండ్ చేస్తూ ప్రణాళికా సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన కుల గణన ఫార్మాట్లో జరిగిన పొరపాటును వెంటనే సవరించాలని విజ్ఞప్తి



చేశారు. సాంప్రదాయ వృత్తులైన కమ్మరి - వడ్రంగి - ఇత్తడి - శిల్పి - స్వర్ణకార వృత్తులను నిర్వహిస్తున్న వారందరినీ ఒకే జాతులుగా గుర్తించాలని కోరారు . ఇది విశ్వబ్రాహ్మణల ఆత్మగౌరవానికి సంబంధించినదని తెలుపుతూ, పొరపాట్లను సరిదిద్దకుండా కుల గణన జరిపితే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని, రాష్ట్రమంతా నిరసనలు చేపడతామని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు. మీడియా సమావేశఅనంతరం విశ్వకర్మ సంఘాల నేతలు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ని కలిసి సర్వే ఫార్మేట్ లో జరిగిన పొరపాట్లను వివరించి వినతి పత్రం అందజేశారు.ఈ సమావేశంలో విశ్వబ్రాహ్మణ సంఘం నగర కన్వీనర్ తిప్పారావు శ్రీనివాస్, విశ్వబ్రాహ్మణ కార్పెంటర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎర్రోజు హయగ్రీవ చారి , జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షులు కడార్ల శివప్రసాద్ , జిల్లా వోప అధ్యక్షులు గద్దె సత్యనారాయణ , ప్రధాన కార్యదర్శి గాలిపెల్లి శంకరయ్య , వివా జిల్లా అధ్యక్షులు గద్దె జగదీశ్వరాచారి , విశ్వబ్రాహ్మణ పురోహిత సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్తపల్లి బ్రహ్మాచార్యులు , విశ్వబ్రాహ్మణ ప్రాథమిక సహకార సంఘము జిల్లా అధ్యక్షులు తోవిటి సదానందం , విశ్వకర్మ వేదిక బాధ్యులు శ్రీమంతుల సదానంద్ , మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చామనపల్లి లక్ష్మి- శంకరాచారి , ఎలక్ట్రికల్ అండ్ వైన్డింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కాయితోజు పవన్ కుమార్ , జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం కో- కన్వీనర్స్ కనపర్తి సత్యనారాయణ, నాగసముద్రము శ్రీనివాస్ ,ఉప్పుల సురేష్ చెల్లోజు అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హత్యయాత్నలకు, బెదిరింపులకు పాల్పడుతున్న రౌడీషీటర్ పై పిడి యాక్ట్,

### పీడీ యాక్ట్ అమలుకు చట్ట వ్యతిరేక కార్యకలాపాలు పాల్పడుతున్న మరి కొంతమంది జాబితా సిద్ధం.,

### రామగుండం సిపి శ్రీనివాస్,

**గోదావరిఖని, వెలుతురు,నవంబర్. 5**
రౌడీ షీటర్ పై రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్, మంగళవారం పీడీయాక్ట్ ఉత్తర్వులు జారీ చేశారు. రామగుండం పోలీస్ కమీషనరేట్ మంచిర్యాల పట్టణంలో ప్రజలను, రియల్ ఎస్టేట్ వ్యాపారస్థులను భయభ్రాంతులకు, ఇబ్బందులకు గురి చేస్తూ హత్యాయత్నం, అక్రమ ప్రవేశం, బెదిరింపులకు, దాడులు వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన గుంజపడుగు గ్రామం, మంథనిమండలం, పెద్దపల్లిజిల్లాప్రాంతానికి చెందినకుంట శ్రీనివాస్,పై రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్,ఐపిఎస్., ఐజి,జారీచేసిన పీడీయాక్ట్ ఉత్తర్వులను మంచిర్యాల పట్టణ ఇన్స్ స్పెక్టర్ ప్రమోద్ రావు,నిందితుడికి ఆదిలాబాద్ జిల్లా జైల్ లో ఉత్తర్వులు అందజేసి చర్లపల్లి జైలుకు తరలించారు. పీడీ యాక్ట్అందుకున్న నిందితుడుగత కొన్ని నెలలుగా మంచిర్యాల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోహత్యాయత్నం,భూకబ్జాలకు పాల్పడడం, అక్రమంగా ఇతరుల ఆస్థిలలోకిప్రవేశించడం, బెదిరింపులలకు, దాడులకు పాల్పడడం తో 04 కేసులు నమోదుచేయడం జరిగింది అట్టి కేసులలో అరెస్ట్ చేసి జైలుకు తరలించడం జరిగింది,అలాగే గతంలోరామగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో హత్య కేసులో జైలుకు వెళ్ళినఅతని నేర ప్రవృత్తి తీరులో



మార్పురాకపోవడంతో నిందితుడి పై పిడి యాక్ట్ నమోదు చేయడం జరిగిందని పోలీస్ కమీషనర్, తెలిపారు. గ్రూప్ లుగాఏర్పడి గొడవలకుపాల్పడి శాంతి భద్రతలకు ఎలాంటి విఘతాం కలిగించేచర్యలకు పాల్పడిన,హత్య యాత్నలకు,హత్య లకుపాల్పడిన నిందితులు,అక్రమ ఫైనాన్స్,గంజాయి అక్రమరవాణాచేసే వారి,పేకాట,పిడియస్ రైస్ అక్రమ రవాణా,భూ కబ్జాలకు పాల్పడే,వైట్ కాలర్ అఫెండార్స్ జాబితా సిద్ధంచేయడం జరిగిందనిత్వరలో వారిపై పిడి అమలు చేస్తాంఅనితెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితేఎంతటి వారైనాఉపేక్షించేది, సహించేదిలేదని వారిపై చట్టపరమైన చర్యలతో పాటు పీడీ యాక్ట్ క్రింద కేసు నమోదు చేయబడుతుందని పోలీస్ కమిషనర్, హెచ్చరించారు.

## ఎస్ అండ్ పి సి కి చిక్కిన 1.25 లక్ష స్క్రాప్ స్వాధీనం,

### అభినందించిన ఆర్ జీవన్ జిఎం లలిత్ కుమార్

**గోదావరిఖని, వెలుతురు, నవంబర్. 5**
ఆర్ జీ,వన్, డివిజన్ లోని, సింగరేణి ఎస్, అండ్, పిసి,ఇన్స్పెక్టర్ ఉమేష్, మంగళవారం, ఆధ్వర్యంలో షిఫ్ట్ జమేధర్, చంద్ర గౌడ్, సెక్యూరిటీ సిబ్బంది, సుంకర శ్రీనివాస్,తో వెళ్లి, జీడికే ఒకటవ బొగ్గు గాని ఏరియాలో ఆటో ట్రాలీ తనిఖీ చేశారు. అందులో సుమారు 300 రూప్ బోలెట్స్,ఉన్నాయి, ఇది సింగరేణి సంస్థకు చెందినవిగా గుర్తించారు. దీని విలువ సుమారు లక్ష 25 వేల రూపాయలు ఉంది. అని అధికారులు తెలిపారు. ఈ తనిఖీ లో జూనియర్, ఇన్స్పెక్టర్ చంద్ర శ్రీనివాస్, అక్బర్ ఆలీ, ఇంటెలిజెన్స్ టీం ఉన్నారు. ఈ సందర్భంగా ఆర్జీవన్ జయం డి లలిత కుమార్, అభినందించారు. ఎస్ ఎన్ టి సి అధికారి వీరారెడ్డి. సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## దుష్ట శిక్షణ.. శిష్ట రక్షణే తమ విధానం

### భద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు

### డీజీపీ ద్వారకా తిరుమలరావు

**అమరావతి, నవంబర్ 5 ( వెలుతురు):**
దుష్ట శిక్షణ.. శిష్ట రక్షణే తమ విధానం అని డీజీపీ ద్వారకా తిరుమల రావు స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో కొన్ని తప్పులు జరిగాయని.. అప్పట్లో జరిగిన తప్పులను సరిదిద్దడంపై దృష్టిపెట్టామని తెలిపారు. అనంతపురంలో మంగళవారం నిర్వహించిన ప్రొబిషన్ డీఎస్పీ పాసింగ్ పరేడ్‌లో హోం మంత్రి వంగలపూడి అనితతో కలిసి డీజీపీ పాల్గొన్నారు. ట్రైనింగ్ పూర్తి చేసుకున్న డీఎస్పీల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా డీఎస్పీలకు పలు సూచనలు చేశారు.శాంతి భద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని తెలిపారు. తాము రాజ్యాంగానికి కట్టుబడి పనిచేస్తామని పేర్కొన్నారు. రాజకీయ ఒత్తిళ్లలో పనిచేయమని స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై కామెంట్ చేయనని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పోలీసులు కూడా సరిగ్గా విధులు నిర్వహించలేదని తెలిపారు. ఓ పార్టీ కార్యాలయంపై దాడి జరిగినప్పటికీ బాధ్యతగా వ్యవహరించలేదని పేర్కొన్నారు. కేసు పెట్టకుండా భావ ప్రకటన స్వేచ్ఛ అంటూ నిందితులను అరెస్టు చేయలేదని చెప్పారు. ఈ ఘటనపై మూడేళ్ల తర్వాత చర్యలు తీసుకోవడమేంటని ప్రశ్నించడం సరికాదని అన్నారు. తప్పు జరిగితే 30 ఏళ్ల తర్వాత అయినా చర్యలు తీసుకోవచ్చని స్పష్టం చేశారు. కేరళలో తప్పు జరిగిన 20 ఏళ్ల తర్వాత ఓ ఐపీఎస్‌కు శిక్ష విధించారని తెలిపారు. న్యాయం చేసేందుకే చట్టాలు, కోర్టులు ఉన్నాయని పేర్కొన్నారు. ఫింగర్ ప్రింట్ టెక్నాలజీ ఉన్నప్పటికీ గత ప్రభుత్వంలో వినియోగించలేదని ఏపీ డీజీపీ తెలిపారు. మానవ హక్కులు, మహిళలు, చిన్నారుల రక్షణకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నామని డీజీపీ తెలిపారు. ప్రజలకు బాధ్యతాయుతంగా ఉండేలా పోలీసు వ్యవస్థలో చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఐజీ సంజయ్‌పై వచ్చిన ఆరోపణలపైనా విచారణ జరుగుతోందని అన్నారు. ఆయనపై విచారణ నివేదిక జీఏడీకి వెళ్లిన తర్వాత తమకు వస్తుందని తెలిపారు.

## బి.ఆర్.ఎస్ కార్పొరేటర్ ఫంక్షన్ హాల్ కూర్చువేత

### శ్రీ ఫంక్షన్ హాల్ కూల్చివేత కక్ష సాధింపు చర్యమైన,,

### అభివృద్ధి పేరుతో చిరు వ్యాపారుల షాపులను తొలగించి రోడ్డున పడి వేసిన సింగరేణి సంస్థ, కార్పొరేషన్,

### ఇంత జరుగుతున్న ప్రతిపక్ష పార్టీలు కార్మిక సంఘాలు నోరు విప్పడం లేదు,





**గోదావరిఖని, వెలుతురు, నవంబర్. 5**
బి ఆర్ ఎస్ రామగుండం కార్పొరేటర్ పెంట రాజేష్,ఫంక్షన్ హాల్, ను, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. మంగళవారం అడ్డగుండపల్లిలోని సిరి ఫంక్షన్ హాల్, ని మున్సిపల్ అధికారులు రెండు జెసిపిలతో నేల మట్టం చేశారు. నాలపై సిరి ఫంక్షన్ హాల్ ని నిర్మించింది. ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చిన ఫంక్షన్ హాల్ యజమాన్యం స్పందించలేదని, జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అక్రమంగా నిర్మించిన కట్టడాన్ని కూల్చి వేస్తున్నామని కార్పొరేషన్, అధికారులు, తెలిపారు. ప్రత్యక్ష నాయకుని ఫంక్షన్ హాల్ కూల్చి వేస్తున్నారని సమాచారం, పాత సినిమాకు ప్రాంతంలో వ్యాపించడంతో ప్రజలు అధిక చేరుకున్నారు. రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బి ఆర్ ఎస్, కార్పొరేటర్లు, నాయకులు, అక్కడికి చేరుకోవడంతో ఎలాంటి ఆవాంచనీయ సంఘటనలు, జరగకుండా వన్ టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డి. ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోలీస్ బంధవస్తు ఏర్పాటు చేశారు. అనేక అక్రమ కట్టడాలు ఉన్నప్పటికీ మొదట సిరి ఫంక్షన్ హాలు కూచివేతలు అనేక అనుమానాలకు వ్యక్తం అవుతున్నాయని, ప్రజలలో ప్రతిపక్ష పార్టీలలో వ్యక్తం అవుతున్నాయి, సిరి ఫంక్షన్,హాల్,కూల్చి వేత,పై వేడెక్కనున్న రాజకీయాలు,ఇది ముమ్మాటికీ, కక్ష, సాధింపు, చర్యగానేతీసుకుంటున్న,ప్రతిపక్ష నాయకులు,చర్చించుకుంటున్నారు. అభివృద్ధి పేరుతో చిరు దుకాణాలు, నిర్మించుకొని, పొట్ట కూటికోసం చిరు వ్యాపారం చేసుకుంటున్నామని, అభివృద్ధి పేరుతో కూర్చి వేసి చిరు వ్యాపారులను వీధిలో పాలు చేస్తున్నారని, మరోపక్క ఆరోపిస్తున్నారు. పేద ప్రజల ఇండ్లు,ను కూల్చి వేస్తుంటే ఇక్కడ విప్లవ పార్టీలు గాని,కమ్యూనిస్టు పార్టీలు, వాటి అనుబంధ కార్మిక సంఘాలు కూడా స్పందించడం లేదని బాధ్యతల నుండి వ్యక్తం అవుతుంది. గత ప్రభుత్వాలు చిరు వ్యాపారులకు నష్టం జరిగితే వేరే ప్రదేశంలో స్థలం చూపించి జీవనోపాధి చూపించారు, ఇప్పుడున్న ప్రజాప్రతినిధులు కూర్చి వేసి చిరుగాపులను రోడ్డుపాలు చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# సింగరేణి సంస్థ ను అభివృద్ధి చేసుకుందాం- ప్రైవేటీకరణ నుండి రక్షించుకుందాం.

### కార్మికుల హక్కులను కాపాడుకుంటూ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుదాం.

### సింగరేణి మనుగడ కొనసాగాలంటే సంస్థ లో పని చేసే అధికారులు అవినీతి లేకుండా, స్వార్థం వీడి నీతి, నిజాయితీగా వ్యవహరించేందుకు కృషి చేయాలి.

### సంస్థ మనుగడ కోసం - కార్మికుల హక్కుల కోసం ఏఐటియుసి నిరంతరం కృషి చేస్తుంది.

### ఓసిపి 5 గేట్ మీటింగ్ లో మాట్లాడుతున్న ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య,

**గోదావరిఖని, వెలుతురు, నవంబర్,5**
సింగరేణి ని ప్రైవేటీకరణ నుండి రక్షించుకుంటూ, సంస్థ అభివృద్ధి కోసం కార్మికులు,ఉద్యోగులు మరియు అధికారులు, యూనియన్.లు కలిసి కట్టుగాఉంటూ ముందుకుపోదామని, భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే విధంగా సింగరేణి సంస్థ మనుగడను కాపాడుకోవడానికి ఏఐటియుసి కృషి చేస్తుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి, అధ్యక్షులువాసిరెడ్డి సీతారామయ్య, పేర్కొన్నారు. మంగళవారం, సింగరేణిఆర్జీ వన్ ఏరియా లోని జిడికే ఓసిపి 5 లోజరిగిన గేట్ మీటింగ్ లో ఆయన పాల్గొని మాట్లాడుతూసింగరేణి కి రాష్ట్ర ప్రభుత్వం బకాయి ఉన్న 34 వేల కోట్ల రూపాయలు చెల్లించాలని, లేకపోతే సంస్థ మనుగడ కొనసాగడం కష్టమని, కొత్తగనులురావాలంటే సంస్థ,కుబడ్జెట్ అవసరమని ఆయన



అన్నారు. సింగరేణి లో గుర్తింపుసంఘం గా ఏఐటియుసి,గెలిచిన తరువాత రాష్ట్ర ముఖ్యమంత్రి ని, ఉప ముఖ్యమంత్రి ని సింగరేణి కి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను ఇప్పించాలని కోరడం జరిగిందని ఆయన అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం బకాయిలు ఇచ్చే పరిస్థితి లేదని వారు తెలిపారని ఆయన అన్నారు. సింగరేణి లో ప్రస్తుతం ఉన్న గనులు ఇంకో పది,పదిహేను సంవత్సరాలు కొనసాగుతాయని, భవిష్యత్తులో సంస్థ కొనసాగాలంటే,కొత్త గనులు రావాల్సిన అవసరం ఉందని, అందుకు రాష్ట్ర ప్రభుత్వంబకాయిలు ఇప్పిస్తే కొత్త గనుల ఏర్పాటు తో పాటు సంస్థ కు అవసరమైన యంత్రాలను,ఇతర పని ముట్లు,సేఫ్టీ పరికరాలుతీసుకోవాల్సినఅవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణి యాజమాన్యం గుర్తించిన గనులను వేలం ద్వారా ప్రైవేటు కు ఇవ్వకుండా సింగరేణి,కి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇస్తే తాడిచర్ల 2, భూపాలపల్లి లో కేటికే ఓసి,కొత్తగూడెం లోని వికే మైన్,శ్రావణ్ పల్లి మైన్, కోయగూడెం ఓసి,సత్తుపల్లి ఓసి లు ప్రారంభం చేసుకుంటే పాత గనులు మూతపడ్డ వీటి వల్ల కార్మికులకు భవిష్యత్తు ఉంటుందని ఆయన అన్నారు.అదేవిధంగా సింగరేణి,లోరాజకీయ జోక్యం,తో అధికారులు విచ్చలవిడిగా సంస్థ సొమ్మును అభివృద్ధి పేరుతో కార్మికుల కు చెందకుండా రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ఖర్చు చేయడం సరైంది కాదని ఆయన అన్నారు.సంస్థ సొమ్మును కార్మికుల సంక్షేమం కోసం మాత్రమే ఖర్చు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సంస్థ లోగుర్తింపు సంఘం ఏఐటీయుసి తో సంబంధం లేకుండా ఎమ్మెల్యే,ఎం.పి. మంత్రులు,సర్పంచ్, కార్పోరేటర్ల, రికమండేషన్ ల పేరుతో యాజమాన్యం సీనియారిటీ ని పరిగణనలోకి తీసుకోకుండా క్వార్టర్స్ కేటాయింపు, ట్రాన్స్ఫర్,లు చేయడం సరైంది కాదని ఆయన అన్నారు. ప్రజా ప్రతినిదులు వారి పరిది లో ప్రజలకు పని చేయాలని, సింగరేణి లో కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు గుర్తింపు సంఘం ఏఐటీయుసి ఉందని, వారికి సింగరేణి తో సంబంధం ఏమిటని ఆయన ప్రశ్నించారు. సింగరేణి లో పనిచేస్తున్న అధికారుల సంఘం నిజాయితీగా పని చేస్తున్న ఒక డైరెక్టర్ ను నెల రోజుల నుంచి ఒక రాజకీయ నాయకుడు తన పని వింటలేదని యాజమాన్యం పక్కకు పెడితే ఎందుకు యాజమాన్యాన్ని నిలదీయడం లేదని ఆయన ప్రశ్నించారు. అధికారులు సింగరేణి అభివృద్ధి కోసం మనుగడ కొనసాగడం స్వార్థం వీడి నీతి గా, నిజాయితీగా,గాపని చేయాలని,రాజకీయ జోక్యాన్ని అరికట్టేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. రాజకీయ జోక్యం తో అధికారులు పని చేస్తే సంస్థ అభివృద్ధి కుంటుపడుతుందని ఆయన అన్నారు. అదేవిధంగా ఇటీవల దీపావళి బోనస్ సందర్భంగా ఏఐటియుసి చేసిన సభ్యత్వం రికవరీ గురించి కొన్ని సంఘాలు గగ్గోలు పెడుతూ కార్మికుల ను రెచ్చగొట్టే విధంగా చర్యలు ఉన్నాయని, వాటిని కార్మికులు పట్టించుకోవద్దని ఆయన సూచించారు. అదేవిధంగా కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యం ఈ నెల లో స్ట్రక్చర్ సమావేశం ఏర్పాటు చేసే అవకాశం ఉందని అందులో కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని ఆయన అన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న సింగరేణి మనుగడ కోసం,కార్మికుల హక్కుల కోసం ఏఐటియుసి పోరాడుతుందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం లు మాట్లాడగా, నాయకులు జీగురు రవిందర్,ప్రభుదాస్, మాదన మహేష్,సంకె అశోక్,రంగు శ్రీనివాస్, ఎంచక్రపాణి,గండిప్రసాద్,చంద తిరుపతి,ఎడవెల్లి రాజిరెడ్డి,మల్లం తిరుపతి,ఉదయ భాను, చీకటి అంజయ్య, ఎం.ఎ.గౌస్, మానాల శ్రీనివాస్, పర్లపెల్లి రామస్వామి, సోహెల్, బలుసు రవి,రెడ్డి వెంకటస్వామి,ఇజ్జగిరి రాజు,మడ్డికిరణ్, ఎవిఎస్ ప్రకాశ్, సాంబమూర్తి,భక్తి శ్రీనివాస్,పాల్గొన్నారు. సమావేశం కు ఏఐటియుసి లో పలు యూనియన్ లకు చెందిన నాయకులు, కార్యకర్తలు,కార్మికులు చేరగావారికి సీతారామయ్య, పలువురు నాయకులు కండువాలు కప్పి యూనియన్ లోకి ఆహ్వానించారు. ఏఐటియుసి,లోచేరిన వారిలోనేరెళ్ళ సదయ్య,చింతల సత్యనారాయణ, గాజులవెంకట స్వామి,కొమురయ్య, కుమార్ రెడ్డి,నాయిని సమ్మయ్య, రమేష్, జి.టి.వెంకటేశ్వర్లు, గంగయ్య,సుదీర్ గౌడ్,శ్యాంకుమార్, జే.తిరుపతి, ఎస్.నర్సయ్య, జే.అశోక్,వి.తిరుపతి, చింతల వెంకటేష్, సార్ల తిరుపతి, అంజయ్య,సదయ్య, రాంరెడ్డి,రవిందర్, రాజ్ కుమార్,మేకల రాజయ్య,గురువయ్య గౌడ్,దాసరి సురేష్, కిరణ్,ఆకుల రవి, సిహెచ్.శ్రీనివాస్, భాస్కర్,శ్రీను, రామక్రిష్ణ,రాయమల్లు లు ఉన్నారు. అదేవిధంగా ఓసిప 5 కి చెందిన ఎలక్ట్రీషియన్ కాంపెల్లి లక్ష్మణ్ 60 వ పుట్టిన రోజు సందర్భంగా సీతారామయ్య అతని తో కలిసి బర్త్ డే కేక్ ను కట్ చేసి లక్ష్మణ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## బిష్ణోయ్ ఫొటోలతో టీషర్టులు

### ఇ-కామర్స్‌పై నెటిజన్ల ఫైర్




**న్యూఢిల్లీ, నవంబర్ 5 ( వెలుతురు):**
బాలీవుడ్ స్టార్ నటుడు సల్మాన్ ఖాన్‌కు వరుస హత్య బెదిరింపులు, బాబా సిద్ధిఖీ హత్య కేసు, జైల్లో ఉంటూనే టార్గెట్లను పూర్తి చేస్తుండటం వంటి కారణాలతో బిష్ణోయ్ పేరు దేశ వ్యాప్తంగా మార్మోగిపోతోంది. ఈ నేపథ్యంలో మీషో, ఫ్లిప్‌కార్ట్, టీషాపర్ వంటి ప్రముఖ ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు గ్యాంగ్‌స్టర్ చిత్రాలతో కొన్ని టీషర్టులను విక్రయించడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఆయా ప్లాట్ ఫామ్‌లు లారెన్స్ బిష్ణోయ్ చిత్రాలతో కూడిన టీషర్ట్‌లను ఆన్‌లైన్ ద్వారా విక్రయిస్తున్నాయి. ఆ టీషర్ట్స్‌పై బిష్ణోయ్‌ను 'గ్యాంగ్‌స్టర్', 'హీరో' అంటూ పేర్కొనడం ప్రధానంగా చర్చకు దారితీస్తోంది. మీషో సంస్థ ఈ టీషర్ట్స్ ధరను రూ.166 నుంచి రూ.177 తో విక్రయిస్తోంది. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకూ అన్ని సైజుల్లోనూ ఈ టీషర్ట్‌లను తమ సైట్‌లో అందుబాటులో ఉంచింది. వీటిని చూసిన అలీషాన్ జాఫ్రీ అనే జర్నలిస్టు ఆ ఫొటోలను ఎక్స్ వేదికగా పోస్టు చేయడంతో.. ఈ అంశం వెలుగులోకి వచ్చింది. దీనిపై నెటిజన్ల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సదరు ప్లాట్‌ఫామ్స్‌పై నెటిజన్లు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. నెటిజన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో మీషో దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. ఆయా ఉత్పత్తులను వెబ్‌సైట్ నుంచి తొలగించేందుకు తక్షణమే చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. 'ఉత్పత్తులను వెబ్‌సైట్ నుంచి తొలగించేందుకు తక్షణమే చర్యలు తీసుకున్నాం. మా వినియోగదారులందరికీ సురక్షితమైన, విశ్వసనీయమైన షాపింగ్ ప్లాట్‌ఫామ్‌ను అందించేందుకు మీషో కట్టుబడి ఉంది' అంటూ మీషో ప్రతినిధి ఒకరు తెలిపారు.

## వైసీపీ నేతకు హైకోర్టు షాక్




**అమరావతి, నవంబర్ 5 ( వెలుతురు):**
ఆంధ్రజ్యోతి విలేఖరి హత్య కేసులో వైసీపీ నేతకు హైకోర్టు షాకిచ్చింది. ఈ హత్య కేసులో వైసీపీ తుని మాజీ ఎమ్మెల్యే దాడిశెట్టి రాజా ముందస్తు బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేశారు. మంగళవారం బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణకు వచ్చింది. అయితే వైసీపీ మాజీ ఎమ్మెల్యే ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ హైకోర్టు ధర్మాసనం నిర్ణయం తీసుకుంది. కాగా... 2020లో ఆంధ్రజ్యోతి తుని రూరల్ విలేఖరి కె. సత్యనారాయణ హత్య రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ హత్యలో మాజీ ఎమ్మెల్యే దాడిసెట్టి రాజా ప్రమేయం ఉందని అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. అయితే ఈ కేసులో మాజీ ఎమ్మెల్యేపై కేసు లేకుండా చేశారు పోలీసులు. దీనిపై న్యాయవాది అయిన సత్యనారాయణ సోదరుడు.. ఈ కేసులో మాజీ ఎమ్మెల్యే రాజా ప్రమేయం ఉందని కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో మాజీ ఎమ్మెల్యేపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని హైకోర్టులో రాజా పిటిషన్ వేశారు. కె. సత్యనారాయణ... తుని నియోజకవర్గం తొండంగి మండలంలో ఆంధ్రజ్యోతి విలేఖరిగా పనిచేశారు. ఈ క్రమంలో 2020లో సత్యనారాయణను కొందరు వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. విధులు ముగించుకుని రాత్రి సమయంలో ఎస్. అన్నవరంలోని ఇంటికి బైక్‌పై వెళ్తుండగా.. లక్ష్మీదేవి చెరువుగట్టుపై కొందరు వ్యక్తులు అడ్డగించి దాడి చేశారు. తమతో తెచ్చిన కత్తులతో సత్యనారాయణపై విచక్షణారహితంగా దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే సత్యనారాయణ హత్యకు వైసీపీ నేత దాడిశెట్టి రాజానే కారణమని కుటుంబీకులు ఆరోపించారు. దీంతో దాడిశెట్టి రాజా సహా ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# గంజాయిని నిర్మూలించేందుకు టెక్నాలజీ

## రంగంలోకి అధునాతన డ్రోన్లు..



**విశాఖపట్టణం, నవంబర్ 5 ( వెలుతురు):**
అల్లూరి జిల్లా ఏజెన్సీ నుంచి గంజాయిని సమూలంగా నిర్మూలించేందుకు సరికొత్త యాక్షన్ ప్లాన్ ను సిద్ధం చేశారు పోలీసులు. మాయని మచ్చగా మారిన గంజాయిపై.. యుద్ధమే ప్రకటించారు. సరికొత్త యాక్షన్ ప్లాన్‌తో ముందుకు వెళ్తున్నారు. అందుకోసం ఇప్పటికే పాత గంజాయి కేసుల్లో పట్టుబడిన వారు, గంజాయి పంటను సాగు చేసే వారిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ దిశగా ఓ వైపు కఠినంగా వ్యవహరిస్తూనే, మరోవైపు అవగాహన కల్పిస్తున్నారు పోలీసులు.గంజాయి పంటను పండించే రైతులను మోటివేట్ చేయడం ద్వారా గంజాయికి దాదాపుగా బ్రేక్ వేయవచ్చన్నది పోలీసుల భావన. ఇప్పటికే ప్రత్యామ్నాయ పంటల వైపు దారి చూపిన పోలీసులు, అధికారులు.. చాలావరకు గంజాయి సాగును కంట్రోల్ చేశారు. కానీ ఇంకా ఎక్కడో అక్రమార్కుల మాటల్లో పడి.. గిరిజనులు మారుమూల ప్రాంతాల్లో సాగు చేస్తున్నట్టు పోలీసులకు ఉప్పందింది. దీంతో ఇక అధునాతన డ్రోన్లను రంగంలోకి దింపారు. కొండలు, లోయలో మధ్య గుట్టుగా సాగుతున్న గంజాయిని గుర్తించే పనిలో పడ్డారు. పంటను సాగు చేస్తున్న వారిపై ఇక నుంచి యాక్షన్ మామూలుగా ఉండదని సాఫ్ట్ గా సూచనలు జారీ చేస్తున్నారు పోలీసులు.అధికారులు పై చేయిఅల్లూరు ఏజెన్సీలో గంజాయి సాగుపై దాదాపుగా పోలీసులు, అధికారులు పై చేయి సాధించినప్పటికీ.. ఆంధ్ర ఒడిస్సా సరిహద్దులో ఇంకా మారుమూల ప్రాంతాల్లో గంజాయి సాగు జరుగుతుందనేది పోలీసులకు వచ్చిన సమాచారం. వాగులతో పాటు కొండ కోనల మధ్య మత్సగడ్డ పరివాహక ప్రాంతాల్లో గంజాయి అక్కడక్కడ గుట్టుగా సాగు జరుగుతుందని పోలీసులకు ఇంటలిజెన్స్ సమాచారం. అయితే ఆయా ప్రాంతాలకు పోలీసులు వెళ్లలేని పరిస్థితి. దట్టమైన అడవులు, కొండలు, లోయలతో ఆయా ప్రాంతాలకు వెళ్లాలంటే పోలీసులు ప్రత్యేకంగా సాహసం చేయాల్సిందే. దీంతో ఒకవైపు గిరిజనులకు అవగాహన కల్పిస్తూనే, డ్రోన్లను రంగంలోకి దించారు పోలీసులు.ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏజెన్సీలోని 11 మండలాలతోపాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఏజెన్సీ 11 మండలాలు కలిపి అల్లూరి సీతారామరాజు జిల్లా ఏర్పడింది. అయితే ఏజెన్సీలో ప్రధాన సమస్య గంజాయి. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో ఈ గంజాయి ఏపుగా పెరుగుతుంది అనేది నిత్య సత్యం. ఏపీ బోర్డర్లో చాలావరకు గంజాయి సాగు తగ్గించినా.. ఒడిస్సా సరిహద్దుల్లో మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉంది. దీనికి తోడు అంతరాష్ట్ర స్మగ్లర్లు అల్లూరి మన్యంలో పండే గంజాయి కన్నేసి.. గిరిజనులకు మాయమాటలతో మచ్చిక చేసుకుని, కోట్ల రూపాయల గంజాయిని తరలించిపోతున్నారు.అల్లూరి ఏజెన్సీ వ్యాప్తంగా.. ఆపరేషన్ గంజాయి సరికొత్త యాక్షన్ ప్లాన్ ను అమలు చేస్తున్నారు పోలీసులు. గంజాయి రవాణా, సాగు చేస్తూ పదేళ్లుగా రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో గంజాయి కేసులు నమోదైన వారిని ఇప్పటికే బైండోవర్ చేశారు పోలీసులు. ఇక ముందు గంజాయి కేసులో పట్టుపడితే ప్రభుత్వ సంక్షేమ పథకాలు కట్ చేస్తామని, అంతేకాదు రెండు లక్షల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరిస్తున్నారు. ఒకానొక దశలో ఈ గంజాయి మాకొద్దు బాబు అంటూ.. గిరిజనులు ప్రతిన పూనేలా చేశారు. అయినా.. మళ్లీ మారుమూల ప్రాంతాల్లో గంజాయి మూలాలు కలవర పాటుకు గురిచేస్తున్నాయి.అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో గంజాయి సాగుపై డ్రోన్లతో నిఘా పెట్టారు పోలీసులు. కొండలు, గుట్టలు, లోయల మాటున దాగి ఉన్న గంజాయిని ప్రత్యేకంగా డ్రోన్లతో పర్యవేక్షిస్తున్నారు పోలీసులు. జిల్లా పోలీస్ సూపరిండెంట్ అమిత్ బర్దర్ ఆదేశాలతో స్వయంగా పాడేరు ఏఎస్పీ ధీరజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసుల బృందం రంగంలోకి దిగారు. కొండల మాటున లోయల్లో గంజాయి సాగుపై నిఘా పెంచారు. గతంలో పాడేరు, హుకుంపేట మండలాల్లో గంజాయి సాగుతున్నట్టు గుర్తించి 9మందిపై ఇటీవల కేసులు పెట్టిన సంగతి తెలిసిందే..!పాడేరు, హుకుంపేట మండలాల్లో అధునాతమైన డ్రోన్లు సహాయం తో కొండ మూలల్లో ఉన్న గంజాయిని గుర్తించి గంజాయి పంట వేసిన వారిపై చర్యలు తీసుకున్నందుకు సిద్ధమయ్యారు పోలీసులు. గతేడాది ఇదే సీజన్లో పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించి.. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో పాడేరు, హుకుంపేట మండలాల్లో 8 కేసులు నమోదు చేసి తొమ్మిది మంది పంట వేసిన వారిని అరెస్టు చేశారు. ఇందులో పాడేరు కించూరు పంచాయతీ బోంగజంగి లో ఒక కేసు, తొట్లగొంది లో ఒక కేసు , ఇరాడపల్లి పంచాయతీ సరియపల్లి లో ఒక కేసు గంజాయి రైతుల పైన నమోదు చేశారు. అలాగే హుకుంపేట మండలం లో తీగలవలస పంచాయతి ఒలుబెడ్డ గ్రామంలో రెండు కేసులు , మత్యపురం పంచాయతీ పెదబోరుగుల గ్రామంలో రెండు కేసులు , గన్నేరుపుట్టు పంచాయతీ పోర్లు గ్రామం లో ఒక కేసు నమోదు అయ్యాయి. తాజాగా మళ్లీ పాడేరు హుకుంపేట మండలాలపై ప్రత్యేకంగా దృష్టి సాధించారు పోలీసులు. అలాగే చింతపల్లి, అరకు ఏజెన్సీ మారుముల ప్రాంతాల పైనా నిఘా పెంచారు.పాడేరు ఏజెన్సీలో మళ్ళీ పోలీసుల డ్రోన్ల చక్కర్లు కొడుతున్నాయి. పాడేరు మండలం సంగోడి, సందిగెడ్డ, సప్పపుట్టు, కించురు, వల్లాయి, బడిమెల, గొందేరు గ్రామాల పరిసర ప్రాంతాలపై ఏరియల్ సర్వే నిర్వహించారు పోలీసులు. కొండల మధ్యలో మారుమూల ప్రాంతాలు, వాగు పరివాహక ప్రాంతాల్లో ముమ్మరంగా డ్రోన్లతో తనిఖీలు చేశారు. గంజాయి అనర్ధాలపై గిరిజనులకు పోలీసుల అవగాహన కల్పించ్చారు. సాగు, రవాణా, వినియోగానికి దూరంగా ఉండాలని సూచనలు జారి చేశారు. జీవితాల్ని నాశనం చేసే గంజాయి పంటకు గిరిజనులు దూరంగా ఉండాలని, లేకుంటే రైతుల పైన పోలిసు కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలిస్తామని అంటున్నారు పోలీసులు.అయితే పోలీసులకు ఎన్ఫోర్స్మెంట్ వర్గాలకు పట్టుబడుతున్న వారు గిరిజనులే అయినప్పటికీ.. దీని వెనుక అంతర్రాష్ట్ర ముఠామే పని చేస్తున్నాయి అన్నది నిఘా వర్గాల సమాచారం. అయినప్పటికీ.. గంజాయిని సాగులోనే తుంచేస్తే.. సరిహద్దులో దాటదనేది పోలీసుల భావన. అందుకే ఇప్పటివరకు గంజాయి సాగు చేస్తున్న రైతులు, స్మగ్లర్లకు సహకారం అందిస్తున్న గిరిజనులను మోటివేట్ చేస్తూ కౌన్సిలింగ్ కూడా ఇచ్చారు. ప్రత్యామ్నాయ మార్గాలు కూడా చూపించారు పోలీసులు. గంజాయికి దూరంగా ఉండాలని చాలాసార్లు సూచించారు. అయినాప్పటికీ.. గుట్టుగా కొండలలోయల మధ్య గంజాయి సాగు చేస్తున్న వారిపై ఇక కఠిన చర్యలకు ఉపక్రమించారు పోలీసులు. ఆల్లూరి మన్యానికి మాయని మచ్చగా మారిన గంజాయి సాగును పూర్తిగా నియంత్రించి గంజాయి ఫ్రీ ఏజెన్సీగా చేసేందుకు సహకరించాలని కోరుతున్నారు పోలీసులు.

# దిగుమతుల నుంచి ఎగుమతుల స్థాయికి..



**న్యూఢిల్లీ, నవంబర్ 5 ( వెలుతురు):**
ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా వైరస్ మహమ్మారి ఆర్థిక వ్యవస్థలను చిన్నాభిన్నం చేసింది.. ఇప్పుడిప్పుడే పలు దేశాలు కోలుకుంటుంటుండగా.. మరికొన్ని దేశాలు అలానే ముందుకు సాగుతున్నాయి.. అయితే.. భారతదేశం అలా కాదు.. ఆర్థిక వ్యవస్థే కాదు.. ఎన్ని అవాంతరాలు వచ్చినా ధీటుగా ఎదుర్కొనేందుకు సిద్ధమవ్వడంతోపాటు.. మరింత బలంగా మారింది.. దానికి ప్రధాన కారణం కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే.. కరోనా తర్వాత.. ప్రధాని మోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంది.. ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించేందుకు పలు సంస్కరణలు తీసుకువచ్చింది. దీంతో విదేశీ పెట్టుబడులు సైతం భారీగా పెరిగాయి.. మేక్ ఇన్ ఇండియా.. ఆత్మనిర్భర్ భారత్, సబ్ కా సాత్ సబ్ కా వికాస్.. లాంటి నినాదాలతో పెట్టుబడులను ఆకర్షించింది. అంతేకాకుండా.. పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా సంస్కరణలు, మార్గనిర్దేశం, సహాయ సహకరాలను పెంచడం కూడా వ్యాపార వర్గాలను ఆకట్టుకునేలా చేసింది.. దానికి నిదర్శనం సెమీ కండక్టర్స్ రంగంలో భారీ పెట్టుబడులు.. మొబైల్ తయారీ యూనిట్లు పెరగడం.. ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీలు), బ్యాటరీలు వాటి సంబంధిత పరిశ్రమలు పెరగడం..మోదీ 2.0 కి మించి? ఇప్పుడు 3.0 సర్కార్ పాలన అన్ని వర్గాలను ఆకట్టుకోవడంతోపాటు.. ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా దూసుకెళ్తోంది. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే నాటికి అంటే.. 2047లో భారత్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలని.. వికసిత్ భారత్ నినాదంతో భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మక నినాదంతో ముందుకు సాగుతోంది.. ఆర్థిక శ్రేయస్సు, సామాజిక పురోగతి, పర్యావరణ స్థిరత్వం ఇలా అన్ని విషయాలతోపాటు.. తిరుగులేని శక్తిగా మార్చాలన్నదే ప్రధాని మోదీ నినాదం.. సంకల్పం.. దానికోసం ఇప్పటికే.. దూరదృష్టితో రోడ్ మ్యాప్ ను సిద్ధం చేస్తున్నారు.ముఖ్యంగా ఎంఎస్ఎంఈ (స్టార్టప్‌లు) సెక్టర్‌లను విస్తరించడం, ప్రోత్సాహకాలను అందించడం నుంచి వ్యాపార రంగానికి మరింత ఉత్సాహాన్ని ఇచ్చేలా నిర్ణయాలను తీసుకుంటోంది.. అలాగే ప్రతి రంగంలో కూడా ఆవిష్కరణలను ప్రోత్సహిస్తోంది.. డిజిటల్ ఇండియా నినాదంతో డిజిటల్ కనెక్టవిటీ, యూపీఐ పేమేంట్స్ పెరగడం, టెలికాం రంగంలో మార్పులు.. ప్రతి మూలకు ఇంటర్నెట్ సౌకర్యం.. ఇలా అన్ని రంగాల్లో సంస్క రణలు భారత ఆర్థిక వ్యవస్థకు దోహదపడుతున్నాయి.భారతదేశం గత దశాబ్దంలో మొబైల్ ఫోన్స్ ను దిగుమతి చేసుకుంటే.. ఇప్పుడు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగింది. ఇప్పుడు మొబైల్ ఫోన్ల యూనిట్లు 200పైగా ఉన్నాయి.. ప్రస్తుతం ఏకంగా ఆరు రెట్లు మొబైల్స్ను ఇండియాలోనే తయారు చేస్తున్నాం.. ఎగుమతి చేస్తున్నాం.. మేక్ ఇన్ ఇండియా అని చాటిచెబుతున్నాం.. అంటే.. మన సాంకేతిక పరిజ్ఞానం ఎంతలా పెరిగిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు..ప్రపంచ ఉఆఖ ర్యాంకింగ్ 2024 జాబితా ప్రకారం.. భారతదేశం ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది.. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, చైనా, జపాన్, జర్మనీ తర్వాత భారత్ ఉంది.. కరోనా నష్టం నుంచి దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కోలుకోవడానికి 12 ఏళ్లు పడుతుందని భారతీయ రిజర్వు బ్యాంకు నివేదిక తెలిపింది.. అయితే.. ఈ నివేదికలు, అంచనాల మధ్య ఆర్థిక వ్యవస్థలో భారత్ మరింత ముందుకు చేరుకుంటుందని.. వ్యాపార రంగంతోపాటు.. అన్ని రంగాల్లో ఇదే దూకుడును ప్రదర్శిస్తుందని వ్యాపార దిగ్గజాలు పేర్కొంటుండం ఆసక్తికరంగా మారింది.భారతదేశం బలమైన ఆర్థిక వృద్ధిగా కొనసాగుతుందని ఒపెక్ అంచనా వేసింది.. ఒపెక్ తన తాజా నెలవారీ అప్‌డేట్‌లో అక్టోబరులో భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధిలో స్వల్ప క్షీణతను చవిచూసిందని అయినప్పటికీ.. తిరుగులేని శక్తిగా అవతరిస్తుందని తెలిపింది. 2024-25లో 6.8 శాతంతో వృద్ధిని సాధిస్తుందని పేర్కొంది. భారతదేశ ఆర్థిక వ్యవస్థ 2024 రెండవ త్రైమాసికంలో స్వల్పంగా మందగమనాన్ని ఎదుర్కొంది.. మొదటి త్రైమాసికంలో 7.8% నుంచి 6.7% వార్షిక వృద్ధిని నమోదు చేసింది. ఈ మందగమనానికి ప్రధానంగా ఎన్నికల సీజన్‌లో ప్రభుత్వ వ్యయం తగ్గుముఖం పట్టింది. మందగమనం ఉన్నప్పటికీ, 2021 నుండి ఆర్థిక వ్యవస్థకు సగటున 54% సహకారం అందించిన సేవల రంగం, గత త్రైమాసికంలో 6.7%తో పోలిస్తే, 2ఖ24లో వృద్ధి 7.2%కి వేగవంతమై, స్థితిస్థాపకతను కనబరిచింది. సెప్టెంబరులో నిరుద్యోగం రేటు ఆగస్టులో 8.5% నుంచి 7.8%కి తగ్గడంతో కార్మిక మార్కెట్లో సానుకూల ధోరణిని నివేదిక హైలైట్ చేసింది. 2024 పూర్తి సంవత్సరానికి భారతదేశ ఆర్థిక వృద్ధి దాని మునుపటి అంచనాలకు అనుగుణంగా 6.8% వద్ద బలంగా ఉంటుందని ూఖఇఅ అంచనా వేసింది. ప్రభుత్వ మద్దతు, ఎన్నికల తర్వాత పునరుద్ధరించబడిన వ్యయం, నిరంతర వినియోగదారుల వ్యయం సంవత్సరం ద్వితీయార్థంలో వృద్ధిని పెంచుతాయని భావిస్తున్నట్లు తెలిపింది.మోదీ ప్రభుత్వం డిజిటల్ కనెక్టివిటీ ప్రాముఖ్యతను గుర్తించి.. అభివృద్ధికి బాటలు వేసింది. ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార్ మంగళం బిర్లా పేర్కొన్నారు. చిన్న చిన్న అవసరాలను సైతం గుర్తించి ఎన్నో అవకాశాలను అందిస్తుందని పేర్కొన్నారు. సాధికారత, సమ్మిళిత డిజిటల్ దేశం వైపు మమ్మల్ని నడిపించడానికి కృషిచేస్తామన్నారు.

### ఎందుకింత భయంకరంగా

# తయారవుతున్నారు..!



**న్యూఢిల్లీ, నవంబర్ 5 ( వెలుతురు):**
అన్యాయాలపై, అక్రమాలపై.. యుద్ధాలపై, హత్యలపై, అఘాయిత్యాలపై మాట్లాడేవారు ఎప్పుడూ ఉంటారు. అయితే ఏదేని ప్రపంచ వేదికపై విశిష్టంగా తమను కీర్తిస్తున్న వేళ, ఆ ప్రశంసలకు, పొగడ్తలకు తాము అర్హులము కామని, వేరెవరికో ఇవి చెందుతాయని చెప్పేవారు చాలా అరుదు. అలాగే ప్రపంచమంతా ఎదురుచూసే ప్రముఖ అవార్డు తీసుకున్నా, సంబరాలు, సంతోషాలు జరుపుకునే వాతావరణం ఇప్పుడు లేదని, విచారించే వ్యక్తులు కూడా చాలా తక్కువ మంది. కానీ ఇప్పుడు ఈ రెండు సందర్భాలు జరిగాయి. పాలస్తీనా గాజాలో ఇజ్రాయిల్ చేస్తున్న మారణహోమాన్ని ఎత్తిచూపుతూ, ఆ ప్రజలకు తమ గాఢ సంఘీభావాన్ని తెలిపారు ఇటీవల నోబెల్ అవార్డు గ్రహీతలు. వారెవరు.. ఏమన్నారు.. చూద్దాం. ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి జపాన్‌కి చెందిన 'నిహాన్ హిడాన్‌క్యో' సంస్థకి దక్కింది. ఈ సంస్థ నాటి అమెరికా అణుదాడి నుండి బయటపడిన వ్యక్తులతో నిర్వహించబడుతోంది. ఆనాటి భయంకర పరిస్థితులు ఇంకెప్పుడూ రాకూడదన్న ఉద్దేశంతో ప్రపంచమంతా శాంతి వ్యాపించాలన్న లక్ష్యంతో కొంతమంది వ్యక్తులు 'నిహాన్' సంస్థని నెలకొల్పారు. సంస్థ తరపున ప్రతి ఏడాది హిరోషిమా నాగసాకి డే పేరుతో న్యూక్లియర్ దుష్ప్రభావంపై విస్తృత శాంతి కార్యక్రమాలు చేస్తున్నారు. అణుదాడుల వల్ల కలిగే నష్టాలపై, ప్రజలను, ప్రభుత్వాలను అప్రమత్తం చేస్తూ నిర్వహిస్తున్న ఈ సేవకు గాను నోబెల్ అవార్డు ప్రకటించినట్లు నోబెల్ కమిటీ కూడా చెప్పింది. అయితే అవార్డు తీసుకున్న ఈ సంస్థ నిర్వాహకులు నిజమైన శాంతి బహుమతికి ఎవరు అర్హులో బహిరంగ వేదికపై మాట్లాడి ప్రపంచం దృష్టిని ఆకర్షించారు. జపాన్‌కి మించిన విధ్వంసం చూస్తున్నాం..: 'ఆగస్టు 6, 1945లో హిరోషిమా, నాగసాకిలపై అమెరికా దాడి చేసిన దానికంటే ఇప్పుడు పాలస్తీనాపై ఇజ్రాయిల్ మరింత ఎక్కువ దాడి చేస్తోంది. ఈ యుద్ధంలో అప్పటిలా అణ్వాయుధాలు ప్రయోగించడం లేదుగానీ, అంతకంటే భయంకరమైన శక్తివంతమైన బాంబులు వర్షంలా కురుస్తున్నాయి. తలదాచుకునే నిలువ నీడ లేక ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. ముక్కుపచ్చలారని పసిపిల్లలు శిథిలాల కింద ఛిద్రమైపోతున్నారు. గాయాలతో రక్తం కారుతున్న పిల్లలతో పరుగులు పెడుతున్న తల్లిదండ్రులు అక్కడ కనిపిస్తున్నారు. ఈ పరిస్థితులు 80 ఏళ్ల నాటి జపాన్‌ని గుర్తుకు తెస్తున్నాయి. ఇంతటి భయంకర పరిస్థితుల్లో తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి పనిచేస్తున్న గాజా పౌరులకు ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి వస్తుందని మేము ఆశించాం' అంటున్నారు సంస్థ నిర్వాహకుల్లో ఒకరైన మిమకి. ఇంకా ఆయన ఏం చెప్పారంటే.. 'రక్తం కారుతున్న పిల్లలు గాజాలో ప్రతి రోజూ కనిపిస్తున్నారు. ఈ పరిస్థితి అప్పటి అణుదాడిలో విధ్వంసమైన జపాన్‌లో లేదు. అప్పుడు అమెరికా మిలటరీ బలగాలు హిరోషిమా, నాగసాకిలపై అణుదాడి చేసినట్లు జపాన్‌లో చాలా తక్కువమంది ప్రజలకు మాత్రమే తెలిసింది. ఈ తరహా దాడి చేసిన ఘటనలు ప్రపంచంలో అదే మొదటిసారి. లక్షల మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఆ ప్రభావం ఇప్పటికీ ఉంది. అయితే.. ఆనాటి పరిస్థితికి మించి ఇప్పుడు గాజాలో కనిపిస్తోంది' అంటున్న మిమకి వ్యాఖ్యలు అక్షర సత్యాలు. చదరపు కిలోమీటరుకి 35 వేల మంది..: నాటి అణుదాడిలో హిరోషిమా, నాగసాకి నగరాలు పూర్తిగా అంతరించిపోలేదు. కానీ ఇప్పుడు గాజాపై ఇజ్రాయిల్ కురిపిస్తున్న బాంబు దాడికి నగరంలో ఇళ్లన్నీ ధ్వంసమౌతున్నాయి. శరణార్థ శిబిరాలు కూడా నేలకూలుతున్నాయి. అణుబాంబు దాడికి మించిపోయిన విధ్వంసం అక్కడ కనిపిస్తోంది. వేల కొలది లీథల్ బాంబులు అదేపనిగా ఇజ్రాయిల్ జెట్ల నుండి వర్షంలా కురుస్తున్నాయి. సురక్షిత ప్రాంతాలుగా ప్రకటించిన చోట కూడా బాంబుదాడులు జరుగుతున్నాయి. ఈ భూమ్మీద అత్యంత ఎక్కువ జనసాంద్రత గల మకావు (చదరపు కిలోమీటరుకి 21 వేలు) ప్రాంతం కంటే ఇప్పుడు గాజాలో ప్రజలు నివసిస్తున్నారు. అక్కడ చదరపు కిలోమీటరుకి 35 వేల మంది తలదాచుకుంటున్నారు. ఈ సంఖ్య యునైటెడ్ స్టేట్స్‌లో చదరపు కిలోమీటరుకి నివసించే 35 మంది జనాభాకి ఏమాత్రం పోల్చదగింది కాదు. అక్టోబరు ప్రారంభమైన ఈ తక్కువ రోజుల్లోనే ఇజ్రాయిల్ ఇప్పటివరకు గాజాలో మూడు స్కూళ్లపై, శరణార్థ శిబిరాలపై దాడికి తెగబడింది. ఈ పరిస్థితుల్లోనే మరో మానవత్వ హృదయం వారికి సంఘీభావం తెలిపింది. 'నోబెల్ అవార్డు పొందినందుకు సంబరాలు చేసుకోలేను' అంటూ దక్షిణాఫ్రికా రచయిత్రి హాన్‌కాంగ్ ఓ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. 'నేనెలా సంబరాలు చేసుకుంటాను..': 'మానవులు ఇంత భయంకరంగా ఎందుకు తయారవుతున్నారు' అని ఆమె ప్రశ్నిస్తున్నారు. 'తీవ్రమైన యుద్ధంతో అక్కడ ప్రతి రోజూ ప్రజలు చనిపోతున్నారు. ఎటు చూసినా బాంబు దాడులు. ఈ పరిస్థితుల్లో నేనెలా సంబరాలు చేసుకుంటాను' అని పాలస్తీనా ప్రజల పట్ల తన సంఘీభావం తెలిపారు ఆమె. నోబెల్ సాహిత్య బహుమతి గెలుచుకున్న హాన్‌కాంగ్ 2016లో రచించిన 'హ్యూమన్ యాక్ట్స్' చదివిన వాళ్లకి ఈ వ్యాఖ్యలు కొత్తగా అనిపించవు. ఆ రచనలో ఆమె ఎన్నో మానవత్వ హృదయాలను తట్టిలేపుతుంది. హాన్‌కాంగ్ పదేళ్ల ప్రాయంలో దక్షిణకొరియాలో హింస చెలరేగింది. వేలాదిమంది ప్రజలు గాయపడ్డారు. చనిపోయారు. ఆమెకి 13 ఏళ్లు వచ్చేసరికి అప్పటి ఛాయచిత్రాలను తండ్రి చూపించాడు. ఆ దృశ్యాలు ఆమె చిన్నారి మనసుపై చెరగని ముద్రవేశాయి. ఆ ప్రభావమే ఈ రచన. ఇజ్రాయిల్ మారణహోమానికి బలౌతున్న పాలస్తీయున్ల పట్ల ఎక్కడో ఓ చోట, ఏదో ఒక వేదికపై తమ సంఘీభావాన్ని తెలుపుతున్న ఇలాంటి మానవత్వ హృదయాలు మరిన్ని రావాలని కోరుకుందాం.

### ఎనిమిదేళ్ల బాలుడి చేతిలో మోసపోయా

# కోలీవుడ్‌లో యువనటి నివేదా పేతురాజ్

తాను ఎనిమిదేళ్ళ బాలుడి చేతిలో మోసపోయానని హీరోయిన్ నివేదా పేతురాజ్ వాపోయారు. తన చేతిలో ఉన్న కరెన్సీని బలవంతంగా లాక్కొని పారిపోయాడన్నారు. కోలీవుడ్‌లో యువనటి నివేదా పేతురాజ్ 'ఒరునాల్ కూత్తు', 'పొదువాగ ఎన్‌మనసు', 'టిక్ టిక్ టిక్' వంటి అనేక చిత్రాల్లో నటించిన ఆమె... ఇపుడు చెన్నై నగరంలోనే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో అడయార్ ప్రాంతంలో ఒక బాలుడు చేతిలో మోసపోయినట్టు ఆమె వెల్లడించారు. విషయంలోకి వస్తే.. 'అడయార్ సిగ్నెల్ వద్ద ఎనిమిదేళ్ళ బాలుడు డబ్బులు అడిగాడు. ఉచితంగా డబ్బులు ఇచ్చేందుకు నా మనసు అంగీకరించలేదు. దీంతో రూ. 50 విలువైన పుస్తకాన్ని కొనాలని చెప్పడంతో రూ. 100 నోటు తీయగా, ఆ బాలుడు రూ. 500 అడిగాడు. దీంతో పుస్తకాన్ని బాలుడికి తిరిగి ఇచ్చి, నేను ఇచ్చిన రూ.100 నోటు వెనక్కి తీసుకున్నాను. అయితే, ఆ పిల్లవాడు పుస్తకాన్ని కారులో పడేసి... చేతిలోని రూ.వంద నోటు లాక్కొని పారిపోయాడు' అని పేర్కొంది. ఇది చాలా సిగ్నల్స్ వద్ద జరుగుతున్న విషయమే. సోషల్ మీడియాలో కూడా ఇలాంటి ఘటనకు సంబంధించిన వీడియోనే ఒకటి వైరల్ అవుతుంటుంది. వాటర్ బాటిల్స్ అమ్మే అతను.. ఒక కారు దగ్గర నిలబడి మూత తీయడానికి ప్రయత్నించగా.. ఆ మూత రాకపోవడంతో, కారులోని యువతి ఆ బాటిల్ తీసుకుని మూత తీసి సదరు వ్యక్తికి ఇవ్వబోగా.. రూ. 20 ఇవ్వాలని అతను చెప్పడంతో చేసేది లేక ఆమె రూ. 20 చెల్లించుకుంటుంది. ఇలాంటి మోసాలు ప్రతి రోజూ చాలా అంటే చాలానే జరుగుతూ ఉంటాయి. ఇప్పుడు నివేదా పేతురాజ్ కూడా అలాంటి మోసానికే గురయింది. నివేదా పేతురాజ్ విషయానికి వస్తే.. తెలుగు ప్రేక్షకులకూ ఆమె సుపరిచితమే. 'అల వైకుంఠపురములో' చిత్రంలో సుశాంత్‌కి లవర్‌గా ఆమె నటించింది. 'మెంటల్ మదిలో, చిత్రలహరి, పాగల్, దాస్ కా ధమ్కీ' వంటి చిత్రాలలో నటించి తెలుగు ప్రేక్షకులను అలరించింది. ప్రస్తుతం ఆమె వెబ్ సిరీస్‌లతో బిజీ నటిగా గడుపుతోంది.



# జోరు తగ్గని త్రిష

## 'థగ్ లైఫ్'లో బిజీబిజీ

త్రిష కథానాయికగా సినిమాల్లో అడుగుపెట్టి 20 ఏళ్లు పైనే అయింది. అయినా తన జోరు ఇప్పటికీ తగ్గలేదు. అందం, అభినయంతో ఇప్పటికీ తన క్రేజ్‌ను అలాగే మెయిన్‌టెన్ చేస్తోంది. ప్రస్తుతం మరో చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్న సంగతి తెలిసిందే. కమల్ హాసన్ కథానాయకుడిగా దర్శకుడు మణిరత్నం తెరకెక్కిస్తున్న చిత్రం 'థగ్ లైఫ్' పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న చిత్రమిది. సముద్రపు దొంగల నేపథ్యంలో యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా చిత్రీకరణ పూర్తయిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ చిత్రంలో త్రిషతో ఓ పాట సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నట్లు ఇన్‌స్టా వేదికగా చిత్రబృందం వెల్లడించింది. ఇందులో శింబు, జోజు జార్జ్, నాజర్, గౌతమ్ కార్తిక్, పంకజ్ త్రిపాఠి, అలీ ఫజల్, అభిరామి, ఐశ్వర్య లక్ష్మి కీలక పాత్రలు పోషిస్తున్నారు. రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ చిత్రం త్వరలో సినీ ప్రియుల ముందుకు రానుంది. ఈ చిత్రంతోపాటు త్రిష చిరంజీవి హీరోగా నటిస్తున్న 'విశ్వంభర' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తోంది. వశిష్ట దర్శకత్వంలో యువి. క్రియేషన్స్ సంస్థ భారీ బడ్జెట్‌తో నిరిస్తోంది. సంక్రాంతికి విడుదల కావలసిన ఈ చిత్రం వాయిదా పడిన సంగతి తెలిసిందే.



# సింహంతో.. నరసింహం

## బాలకృష్ణతో సరదాగా సూర్య ముచ్చట్లు




బాలకృష్ణ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న 'అన్‌స్టాపబుల్ టాక్ షో' మూడు సీజన్లు పూర్తి చేసుకున్న నాలుగో సీజన్ నడుస్తోంది. తాజా ఎపిసోడ్‌కి తమిళ స్టార్ సూర్య అతిథిగా హాజరై సందడి చేశారు. తన భార్య జ్యోతిక, తమ్ముడు కార్తి గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. బాలకృష్ణతో సరదాగా మాట్లాడారు. కార్తి తన ఫోన్‌లో సూర్య నంబర్‌ను ఏమని సేవ్ చేసుకుంటారని అడగ్గా.. అది అవుట్ ఆఫ్ సిలబస్ అంటూ నవ్వులు పూయించారు. మొదటి క్రష్ ఎవరో చెప్పాలని కోరగా.. 'వద్దు సర్ ఇంటికి వెళ్లాలి.. గొడవలు అవుతాయని' సరదాగా చెప్పారు. జ్యోతిక లేకుండా తన జీవితాన్ని ఊహించుకోలేనని సూర్య ఎమోషనల్ అయ్యారు. మానవత్వం ఉన్న మనిషిగా నలుగురికి సేవ చేయడంలోనే తనకు ఆనందం ఉందన్నారు. బాలకృష్ణ కార్తికి లైవ్‌లో ఫోన్ చేసి సూర్య గురించి అడగ్గా.. ఒక హీరోయిన్ అంటే సూర్యకు బాగా ఇష్టమని అన్నాడు. దీంతో కార్తిని 'నువ్వు కార్తివి కాదు.. కత్తివి రా' అని సూర్య అన్నారు. ఇక ఈ కార్యక్రమంలో కంగువా టీమ్ కూడా పాల్గొంది. బాబీదేవోల్, దర్శకుడు శివ కూడా బాలకృష్ణతో సరదాగా చిట్‌చాట్ చేశారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. సూర్య హీరోగా శివ దర్శకత్వం వహించిన పీరియాడికల్ డ్రామా కంగువా విడుదలకు సిద్ధమైంది. స్టూడియో గ్రీన్ బ్యానర్‌పై కేఈ జ్ఞానవేల్ రాజా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 14న సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# బాక్సాఫీస్‌ను రూల్ చేయబోతున్న విజయ్



కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ అభిమానులు ఎక్జయిటింగ్‌గా ఎదురుచూస్తున్న సినిమా దళపతి 69. హెచ్ వినోథ్ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో పూజా హెగ్డే ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. ప్రేమలు ఫేం మమితా బైజు కీలక పాత్ర పోషిస్తోంది. ఈ మూవీలో ప్రకాశ్ రాజ్, ప్రియమణి, నరేన్, గౌతమ్ వాసుదేవ్ మీనన్, బాబీడియోల్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇటీవలే దళపతి 69 కొత్త షెడ్యూల్ షురూ అవగా.. విజయ్‌తోపాటు ప్రధాన తారాగణం పాల్గొంటున్నట్టు కోలీవుడ్ సర్కిల్ సమాచారం. కాగా ఇప్పుడొక ఆసక్తికర వార్త నెట్టింట వైరల్ అవుతూ.. విజయ్ అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తోంది. ఈ చిత్రం ఓవర్సీస్ థియాట్రికల్ రైట్స్ భారీ మొత్తానికి అమ్ముడుపోయాయన్న వార్త ఒకటి హాట్ టాపిక్‌గా మారింది. తాజా సమాచారం ప్రకారం రూ.78 కోట్లు పలికాయి. ఈ ధర ది గోల్, లియో చిత్రాల కంటే ఎక్కువ కావడం విశేషం. విజయ్ సినిమాకు క్రేజ్ ఎలా రేంజ్‌లో ఉందో ఈ ఒక్క వార్త చెప్పకనే చెబుతోంది. దళపతి–హెచ్ వినోథ్ కాంబో బాక్సాఫీస్‌ను రూల్ చేయడం పక్కా అని అర్థమవుతోంది. ఈ చిత్రానికి మ్యూజిక్ సెన్సేషన్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు. కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రం 2025 దీపావళి కానుకంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. విజయ్ పొలిటికల్ ఎంట్రీ నేపథ్యంలో దళపతి 69 చివరి సినిమా కానుందని తెలిసిందే. మరి విజయ్ లాస్ట్ సినిమా ఎలాంటి జోనర్‌లో ఉండబోతుందో అంటూ.. ఈ ప్రాజెక్టుపై అంచనాలు భారీగానే ఉన్నాయి.

# రహుల్ ప్రీతీపై దారుణమైన ట్రోలింగ్

రకుల్ ప్రీత్ సింగ్ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. కన్నడ మూవీ 'గిల్లి'తో సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. తెలుగులో తొలిసారిగా 'కెరటం'లో నటించింది. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ మూవీతో మంచి గుర్తింపును సాధించింది. ఆ తర్వాత సూపర్ స్టార్ మహేశ్‌బాబు, మెగా హీరో రామ్‌చరణ్, యంగ్ టైగర్ ఎన్టీఆర్ సినిమాల్లో అవకాశాలను దక్కించుకొని.. తక్కువ సమయంలోనే టాలీవుడ్‌లో అగ్ర హీరోయిన్‌గా ఎదిగింది. ప్రస్తుతం టాలీవుడ్‌కు దూరమైంది. చివరగా తెలుగులో కొండపొలం మూవీలో నటించింది. ఆ తర్వాత బాలీవుడ్‌లో బిజీగా మారింది. ప్రస్తుతం పెళ్లి చేసుకొని సెటిల్ అయ్యింది. పెళ్లయిన బాలీవుడ్‌లో సినిమాలు చేస్తూ వస్తున్నది. అయితే, ప్రస్తుతం సోషల్ మీడియాలో రకుల్ ప్రీత్ సింగ్‌పై ట్రోలింగ్ జరుగుతున్నది. దీపావళి పండుగ ఫైర్ క్రాకర్స్ గురించి చేసిన వ్యాఖ్యలను పలువురు సోషల్ మీడియాలో ట్రెండింగ్ చేస్తున్నారు. ఇంటర్వ్యూలో ఓ ప్రశ్నకు రకుల్ బదులిస్తూ.. 'దీపావళికి అంతా ఫైర్‌కాకర్స్ కాలుస్తుంటారు. చిన్నప్పుడు దీపావళి పండుగ సమయంలో మా పాప రూ.500 నోట్ ఇచ్చాడు. ఇప్పుడు రూ.500 ఎందుకిస్తున్నారు? అని అడిగాను. ఈ డబ్బుతోనే కదా నువ్వు ఫైర్‌కాకర్స్ కొని కాలుస్తావు. దాంతో ఎంత కాలుష్యమో తెలుసా? అని ప్రశ్నించారు. అదే డబ్బును అవసరం ఉన్న వారికి పేదవారికి ఇవ్వొచ్చని.. లేకపోతే చాక్‌లెట్స్, ఇంకా ఏమైనా కొని ఇవ్వచ్చని చెప్పారు. ఆయన చెప్పింది నిజమేనని అనిపించిందని, ఆ సమయంలో 5వ తరగతి చదువుతున్నాను.

అప్పటి ఇప్పటి వరకు మళ్లీ బాణాసంచా కాల్చలేదు' అంటూ రకుల్ వివరించింది. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. పలువురు ఆమెపై ట్రోల్ చేస్తున్నారు. ఓ యూజర్ ఖరీదైన బట్టలు ఎందుకు ధరిస్తున్నారు ? అదే డబ్బును పేదలకు దానం చేస్తారా? అని ఒకరు ప్రశ్నించారు. మరొకరు చికెన్ తినే సమయంలో నోట్లు కూడా తింటారా? మరో యూజర్ కామెంట్ చేశాడు. 'దేవుడికి ధన్యవాదాలు. నా తల్లిదండ్రులు ఇలా కాదు. నా బాల్యాన్ని ఎంజాయ్ చేసేందుకు అనుమతించారు. మంచి చెడులకు మధ్య తేడాను కూడా నేర్పించారు' మరో నెటిజన్ అంటూ స్పందించాడు. ఇదిలా ఉండగా.. రకుల్ ప్రీత్ సింగ్ చివరగా ఇండియన్–2 మూవీలో నటించింది. ప్రస్తుతం, హిందీలో అజయ్ దేవగన్‌తో 'దే దే ప్యార్ దే 2' మూవీలో నటించనున్నది. ఈ మూవీ వచ్చే ఏడాది విడుదల కానున్నది.




# ఆ కామెంట్‌కు నొచ్చుకున్న సమంత



టాలీవుడ్ స్టార్ నటి సమంత గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. తన అందం, అభినయంతోపాటు నటనతో కోట్లాది మంది అభిమానులను సొంతం చేసుకుంది. అనారోగ్య సమస్యల కారణంగా ఏడాదికాలంగా సినిమాలకు బ్రేక్ తీసుకున్న సామ్.. ప్రస్తుతం మళ్లీ ప్రొఫెషనల్ లైఫ్‌లో బిజీ అవుతోంది. తాను నటించిన 'సిటాడెల్: హనీ బన్నీ' సిరీస్‌తో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమైంది. ఈ సిరీస్ ప్రొమోషన్స్‌లో పాల్గొంటోంది. ఇందులో భాగంగా సోమవారం తన ఇన్‌స్టా వేదికగా ఆస్క్ మీ ఎనీ థింగ్ సెషన్ నిర్వహించింది. అభిమానులతో సరదాగా కాసేపు ముచ్చటించింది. అభిమానులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చింది. ఈ క్రమంలో ఓ నెటిజన్ సమంతను ఆసక్తికర ప్రశ్న వేశారు. కాస్త బరువు పెరగాలని విజ్ఞప్తి చేశారు. 'ప్లీజ్ మేడం, కాస్త బరువు పెరగండి' అంటూ నమస్కరిస్తున్న ఎమోజీతో కామెంట్ పెట్టారు. సదరు అభిమాని రిక్వెస్ట్‌పై సమంత తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. 'మళ్ళీ బరువు గురించే ప్రశ్న. మయోసైటిస్ కారణంగా వైద్యుల సూచనల మేరకు ప్రస్తుతం నేను చాలా స్ట్రిక్ట్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డైట్‌లో ఉన్నాను. అందువల్లే నా బరువు ఇలా ఉంది. నా ఆరోగ్య పరిస్థితుల వల్ల నేను ఇలానే ఉండాలి. ఇతరులను జడ్జ్ చేయడం ఆపండి. మనం 2024లో ఉన్నాం. దయచేసిన అవతలి వాళ్లను కూడా బతకనివ్వండి' అంటూ గట్టిగా సమాధానం ఇచ్చింది. ప్రస్తుతం ఈ వార్త నెట్టింట తెగ వైరల్ అవుతోంది.

# తలైవా కూలీ, ఖైదీ-2 అప్‌డేట్

## 2025 సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు కూలీ




తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ ఇటీవలే వెట్టైయాన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడని తెలిసిందే. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది. ఇక అభిమానులు, మూవీ లవర్స్ ఫోకస్ అంతా కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో నటిస్తోన్న కూలీ పైనే ఉంది. తలైవా అభిమానుల కోసం స్టన్నింగ్ వార్త ఒకటి బయటకు వచ్చింది. కూలీ చిత్రాన్ని 2025 వేసవి కానుకగా విడుదల చేయబోతున్నారు. అంతేకాదు మరోవైపు కార్తీతో లోకేశ్ కనగరాజ్ చేయబోతున్న బ్లాక్ బస్టర్ సీక్వెల్ ఖైదీ 2 వచ్చే ఏడాది ఆగస్టు నుంచి సెట్స్‌పైకి వెళ్లనుంది. ఒకేసారి రెండు వార్తలు రావడంతో ఆనందంలో ఎగిరిగంతేస్తున్నారు మూవీ లవర్స్. కూలీ టైటిల్ టీజర్‌లో బంగారంతో డిజైన్ చేసిన ఆయుధాలు, వాచ్ చైన్లతో సూపర్ స్టార్ తలైవా చేస్తున్న స్టైలిష్ ఫైట్ సన్నివేశాలు సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. గోల్డ్ అక్రమ రవాణా నేపథ్యంలో సాగే కూలీలో సత్యరాజ్, అక్కినేని నాగార్జున, మహేంద్రన్, మంజుమ్మెల్ బాయ్స్ యాక్టర్ సౌబిన్ షాహిర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. కూలీలో రజినీకాంత్ స్మగ్లర్‌గా కనిపించబోతున్నట్టు ఇప్పటివరకు వచ్చిన రషెస్ చెప్పకనే చెబుతున్నాయి.

# రాష్ట్రంలో మరోమారు సమగ్రసర్వే

### నేటి నుంచే వివరాల సేకరణకు రంగం సిద్ధం

### ఆస్తులు అప్పులు మొదలు కుటుంబ వివరాల సేకరణ

### వివరాలన్నీ గోప్యంగా కంప్యూటరీకరణకు చర్యలు




**హైదరాబాద్,నవంబర్5( వెలుతురు):**
రాష్ట్రంలో సమగ్ర కుటుంబ సర్వేను ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభించేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. సర్వేలో భాగంగా ఇంటింటికీ వెళ్లి మొత్తం 56 ప్రధాన ప్రశ్నలు వేస్తారు. వాటిలో కొన్నింటికి ఉప ప్రశ్నలు వేసి ప్రతి కుటుంబం నుంచి సమగ్రంగా సమాచారాన్ని సేకరించాలని ప్రభుత్వం గణకులకు నిర్దేశిరచింది. సర్వేలో కుటుంబ యజమాని, సభ్యుల వివరాలను నమోదు చేయడంతో పాటు కుటుంబంలోని ప్రతిఒక్కరి ఫోన్ నంబరు, వారుచేసే వృత్తి లేదా ఉద్యోగ వివరాలను సేకరిస్తారు. ఇందులో భాగంగా ఆస్తులెన్ని.. అప్పులెన్ని.. ఆదాయమెంత.. ఇంట్లో ఎంతమంది ఉంటారు.. ఎవరైనా విదేశాలకు, ఇతర రాష్ట్రాలకు వెళ్లారా.. ప్రజాప్రతినిధిగా ఎన్నికయ్యారా.. ఇలా మొత్తం 75 రకాల ప్రశ్నలతో గణకులు వివరాలను సేకరించేలా ప్రశ్నావళిని రూపొందించారు. ఉన్నత చదువు లేదా ఉద్యోగం, వ్యాపారం, పెళ్లి లేదా ఇతర అవసరాలకు వెళ్లారా.. అని కుటుంబ యజమానిని గణకులు అడుగుతారు. విదేశాల్లో యూకే, అమెరికా, గల్ఫ్, ఆస్ట్రేలియా, కెనడాలతో పాటు ఐరోపా దేశాలకు వెళ్లినట్లు చెబితే ఒక్కో దేశానికి ఒక ప్రత్యేక కోడ్ నమోదు చేస్తారు. మరే దేశానికి వెళ్లినా ఇతర దేశం అనే కోడ్ నమోదు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ నుంచి ఎందరు వలస వెళ్లారు.. ఏ కారణంతో బయటకు వెళ్లారనే సమగ్ర సమాచారం సేకరించడానికి ఈ ప్రశ్నలు రూపొందించినట్లు తెలుస్తోంది. ప్రజలు తీసుకున్న రుణాలపై ప్రత్యేకంగా మూడు ప్రశ్నలు అడుగుతారు. గత ఐదేళ్లలో ఏమైనా అప్పులు తీసుకున్నారా.. ఎందుకు తీసుకున్నారు.. ఎక్కడి నుంచి రుణం పొందారు.. అనే ప్రశ్నలను ప్రతి కుటుంబాన్ని అడగాలని నిర్ణయించారు. బ్యాంకులు, స్వయంసహాయక సంఘాల నుంచే కాకుండా వడ్డీ వ్యాపారుల నుంచి తీసుకున్నారా అనే వివరాలను కూడా చెప్పాలి. కుటుంబ సభ్యులందరి స్థిర, చరాస్తుల వివరాలన్నీ చెప్పాలి. చరాస్తుల వివరాలను వేర్వేరుగా నమోదు చేస్తారు. వీటిలో బైకు, స్కూటర్, సొంత అవసరాలకు వాడే కారు, కిరాయికి తిప్పుతున్న కారు వంటివి ఉన్నాయా? వాషింగ్ మిషన్, ఫ్రిజ్, ఏసీ, టీవీ, స్మార్ట్‌ఫోన్ ఇలా మొత్తం 18 రకాల చరాస్తుల వివరాలన్నీ చెప్పాలి. ఒక కుటుంబంలోని సభ్యులందరికీ కలిపి ఇవన్నీ ఎన్ని ఉన్నాయి.. వాటి విలువ ఎంత అనేది తెలపాలి. మీ ఇల్లు ఎన్ని గజాల్లో.. ఏ ప్రాంతంలో ఉంది? ఇంటిలో ఉన్న మొత్తం గదులెన్ని.. బాత్‌రూం, మరుగుదొడ్డి ఉన్నాయా ఇలాంటి వివరాలన్నీ చెప్పాలి. మీకు ఎంత భూమి, ఎన్ని ఎకరాల్లో ఉంది.. అది పట్టా భూమా? లేదా ప్రభుత్వం ఇచ్చిన ఎసైన్డ్ లేదా పట్టాలేని అటవీ భూమా.. వంటి వివరాలు కూడా సేకరిస్తారు. గత ఐదేళ్లలో ఏమైనా సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందారా? ఆ పథకాల పేర్లు ఏమిటి? వంటి వివరాలు సేకరిస్తారు. కుటుంబంలో ఎవరైనా ప్రజాప్రతినిధిగా ఎన్నికయ్యారా.. ఎన్నికైతే రిజర్వేషన్‌లోనా, ఎన్ని పర్యాయాలు అనేది చెప్పాలి. రాష్ట్రపతి, ప్రధాని తప్ప మిగతా ఏ హోదాలో ప్రజాప్రతినిధిగా పనిచేసినా వివరాలు చెప్పాలి. వార్డు సభ్యుడి నుంచి కేంద్రమంత్రి, గవర్నర్, సీఎం దాకా ఏ పదవి పొందినా సరే నమోదు చేయించాలి.సర్వే సమయంలో గణకులు కుటుంబాల నుంచి స్పష్టమైన సమాచారాన్ని తీసుకోవాలి. ప్రతి ఇంట్లో నివసించే కుటుంబసభ్యుల సంఖ్య తీసుకోవాలి. సర్వే ఫారంలో ఇంటి నంబరు, యజమాని పేరు వంటి వివరాలు నమోదు చేయాలి. సర్వే పూర్తయిన ఇంటిగోడపై స్టిక్కర్ అతికించాలి. సర్వే చేసిన తర్వాత ఫారాల్లో నమోదు చేసిన వివరాలను కంప్యూటర్లో నిక్షిప్తం చేయాలి. ఈ పక్రియ చాలా కీలకం. డేటాఎంట్రీ సమర్థంగా నిర్వహిస్తేనే విశ్లేషణ కచ్చితత్వం సాధిస్తుంది. ఈ నేపథ్యంలో ప్రణాళికశాఖ జిల్లా, మండలాల్లో అవసరమైన డేటాఎంట్రీ ఆపరేటర్లను గుర్తించి, వారికి శిక్షణ పూర్తిచేసింది. ప్రతిరోజూ గణకులు తీసుకువచ్చిన వివరాల్ని నమోదు చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చింది. ఆపరేటర్లు నమోదు చేస్తున్న వివరాలను సూపర్‌వైజర్ స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు.సర్వే సమయంలో కుటుంబం నుంచి తీసుకున్న సమాచారం విషయంలో గోప్యత పాటించాలని ప్రభుత్వం స్పష్టంగా ఆదేశించింది. ఈ విషయాన్ని గణకులు ముందుగానే యజమానికి వివరిస్తారు. ఎక్కడా ఈ సమాచారం బయటపెట్టరని హామీ ఇస్తారు. ఫారంలోని వివరాలన్నీ నింపిన తర్వాత వాటిని జాగ్రత్తగా భద్రపరుస్తారు. గణకులు వివరాలను డేటాఎంట్రీ కేంద్రంలోని ఆపరేటర్‌కు ఇచ్చి వాటిని పూర్తిచేయిస్తారు. ఆ సమయంలోనూ ఫారాలను గోప్యంగా ఉంచడంతో పాటు ఆ డేటాను ఇతరులతో పంచుకోకుండా జాగ్రత్త వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. రోజువారీ నిర్వహిం చిన సర్వే వివరాలు, పురోగతిని సాయంత్రం 6 గంటల్లోపు ప్రణాళికశాఖకు పంపించాలి.రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే అంటే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేయడానికి శాసనసభ తీర్మానం మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి అవసరమైన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలు మెరుగు పరిచేందుకు, అన్నివర్గాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపింది. ఈ సర్వేకు ప్రణాళికశాఖ నోడల్ విభాగంగా వ్యవహరిస్తోంది. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఈ సర్వే జరగనుంది. జిల్లా, మండల నోడల్ అధికారులు.. ఎన్యూమరేషన్ బ్లాక్(ఈబీ)ల గుర్తింపు, గణకుల నియామకం, ఇళ్ల జాబితా, డేటా ఎంట్రీతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాల్సి ఉంటుంది. సెన్సెస్ డైరెక్టరేట్ నుంచి ఈబీ మ్యాపులు తీసుకోవడం, లేనిప్రాంతాల్లో కొత్తవాటిని రూపొందించాల్సి ఉంటుంది. దాదాపు 80 వేల మంది ఉద్యోగులు సర్వేలో పాల్గొంటారు. వీరిలో విద్యాశాఖ నుంచి 48,229 మంది ఉంటారు. ఉపాధ్యాయులే కాకుండా ఇతర కేటగిరీల ఉద్యోగులను సైతం వీలును బట్టి సర్వేకు వినియోగిస్తారు.సర్వే చేయడానికి ఇళ్లను ఈబీలుగా విభజిస్తారు. ఒక గ్రామంలో కనీసం 175 కుటుంబాలుంటే మొత్తంగా దాన్ని ఒకే ఈబీగా నిర్ణయించి ఒక గణకుడికి అప్పగిస్తారు. అంతకన్నా ఎక్కువ కుటుంబాలుంటే వాటిని చిన్న యూనిట్లుగా.. కనీసం ఒక్కో ఈబీలో 150 ఇళ్లు ఉండేలా విభజించి గణకులను నియమించి సర్వేను సకాలంలో పూర్తిచేస్తారు. ఈ నెలాఖరుకల్లా సర్వే పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

## పవన్ మాటలతో మరింత బాధ్యత పనిచేస్తా

### ఆయన వ్యాఖ్యల్లో ఎటువంటి తప్పు లేదు

### ఆయన అలా ఎందుకు మాట్లాడారో నాకు తెలుసు : ఏపీ హోంమంత్రి అనిత



**అమరావతి, నవంబర్ 5 ( వెలుతురు) :**
డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యల్లో ఎటువంటి తప్పు లేదని హోంమంత్రి అనిత అన్నారు. మంగళవారం అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా పోలీసు అధికారులతో ఏపీ హోంమంత్రి అనిత సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పవన్ కల్యాణ్ ఏ కేసు విషయంలో అంత ఆగ్రహంతో మాట్లాడారో తెలుసని.. త్వరలోనే దాని గురించి ఆయనతో మాట్లాడతానని చెప్పుకొచ్చారు. పవన్ కల్యాణ్ మాటలను బాధ్యతగా తీసుకొని కలిసి పనిచేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, గంజాయి వంటి అంశాలను ఏ మాత్రం ఉపేక్షించేది లేదని అనిత స్పష్టం చేశారు. నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించామని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాలో జరిగిన గ్యాంగ్ రేప్ బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. ఇలాంటి వారిపై గతంలోనే చర్యలు తీసుకుని ఉంటే ఇప్పుడు ఇలాంటివి జరిగేవి కావని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న నేరాల విషయంలో అందరికీ ఆందోళన ఉందని అన్నారు. ఈవిషయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాత్రం బయటపడ్డారని.. తాము బయటపడలేదని చెప్పుకొచ్చారు. లా అండ్ ఆర్డర్ పకడ్బందీగా అమలు చేసేందుకు కృషి చేస్తున్నామని అనిత తెలిపారు. శిక్షలు తక్షణమే అమలు చేయడానికి ప్రత్యేక కోర్టులు కావాలని.. దీన్ని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. సోషల్‌మీడియాలో తప్పుడు పోస్టులు పెడుతున్నవారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## దువ్వాడ శ్రీనివాస్‌కు మాధురి మరిచిపోలేని గిఫ్ట్



**అమరావతి, నవంబర్ 5 ( వెలుతురు) :**
ఇటీవల దువ్వాడ శ్రీనివాస్ బర్త్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయనకు మాధురి మరిచిపోలేని గిఫ్ట్ ఇచ్చింది. తాజాగా దువ్వాడ శ్రీనివాస్ తన అనుచరులు, సన్నిహితుల మధ్యలో బర్త్ డే వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా దివ్వెల మాధురి సర్‌ప్రైజ్ గిఫ్ట్ ఇచ్చింది. ఒక ఖరీదైన వాచీని కొని దువ్వాడకు ప్రేమ కానుకగా అందజేసింది. దీనికి సంబంధించిన వీడియోను మాధురి సోషల్‌మీడియాలో పోస్టు చేసింది. ఇది కాస్త నెట్టింట వైరల్‌గా మారింది. దువ్వాడకు ప్రజెంట్ చేసిన వాచీ స్విట్జర్లాండ్‌కు చెందిన రాడో కంపెనీది.. దీని విలువ రూ.2లక్షలకు పైగానే ఉండొచ్చని నెటిజన్లు చర్చించుకుంటున్నారు.

## మాజీ మంత్రి సత్యనారాయణ కన్నుమూత

### వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సత్యనారాయణ



**అమరావతి, నవంబర్ 5 ( వెలుతురు) :**
కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ (99) మంగళవారం ఉదయం అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం పెదగోగాడలోని నివాసంలో కన్నుమూశారు. మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. తొలిసారిగా 1983 ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలుపొందారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేతల్లో ఆయన ఒకరు. ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆ సమయంలో ఆయనకు టికెట్ దక్కకపోవడంతో స్వతంత్ర అభ్యర్థి పోటీ చేసి విజయం సాధించారు. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆ పార్టీ తరపున నాలుగుసార్లు పోటీ చేసి విజయం సాధించారు. 1983, 1985, 1989, 1994, 1999 ఎన్నికల్లో వరుసగా పోటీ చేసి గెలుపొందారు. 2004 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో కేబినెట్‌లో పశుసంవర్ధక, మత్స్య, పాడిపరిశ్రమాభివృద్ధి శాఖల మంత్రిగా సేవలందించారు. టీటీడీ బోర్డు సభ్యుడిగా, అసెంబ్లీలో అంచనాల కమిటీ చైర్మన్‌గా వివిధ హోదాల్లో పని చేశారు.

# తిరుమల ప్రక్షాళన అంత ఈజీయేనా



**తిరుమల, నవంబర్ 5 ( వెలుతురు) :**
తిరుమల తిరుపతి పాలక మండలి ఏర్పాటు ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. 24 మందితో ధర్మకర్తల మండలి ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సగం మంది సొంత రాష్ట్రానికి చెందిన వారైతే మిగతా సగం ఇతర రాష్ట్రాల సభ్యులతో టీటీడీ పాలక మండలి ఏర్పాటైంది. ఎంతోమంది ఆశావాహులు మరెంతో మంది ప్రముఖులు టీటీడీ బోర్డు కు పోటీ పడ్డా ఎట్టకేలకు బీఆర్ నాయుడు చైర్మన్‌గా కూటమి సర్కార్ తిరుమల పాలక మండలిని నియమించింది. ఎన్నో సవాళ్లు మరెన్నో సమస్యలను చాలెంజ్‌గా టీటీడీ కొత్త పాలక మండలి ఏర్పాటు కాబోతోంది..!తిరుమల తిరు పతి దేవస్థానం. రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు టాప్ ప్రియారిటిగా ఉన్న టీటీడీలో పాలన అత్యంత పారదర్శకంగా ఉండాలన్నదే లక్ష్యం. ఈ మేరకు సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే తిరుమలలో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిన చంద్రబాబు ఇప్పుడు టీటీడీకి నియమించిన కొత్త పాలకమండలి ఏ రకమైన సవాళ్లను, సమస్యలను ఎదుర్కోబోతోంది అన్నది ఇప్పుడు చర్చ.24 మందితో ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ప్రముఖ రంగాలకు చెందిన ప్రముఖులకు బోర్డులో స్థానం కల్పించింది. ఏపీ నుంచి చైర్మన్ తో పాటు 12 మంది, మరో 12 మందిని ఇతర రాష్ట్రాల నుంచి ఎంపిక చేసిన ఏపీ సర్కార్ బోర్డు సభ్యులుగా మహిళలకు కూడా పెద్ద పీట వేసింది. కూటమిలోని పక్షాలు, అంకితభావంతో పనిచేసిన నేతలకు ప్రియారిటి ఇచ్చిన సీఎం చంద్రబాబు సొంత జిల్లాకు చెందిన బిఆర్ నాయుడును టీటీడీ చైర్మన్ గా నియమించారు.టీటీడీ బోర్డులో జిల్లాకు మరింత ప్రాధాన్యం ఉంటుందని భావించిన కూట మి పార్టీల శ్రేణులు మిశ్రమ స్పందన కనిపిస్తుండగా ఆశావాహులకు మాత్రం టీటీడీ బోర్డు లో స్థానం దక్కకుండా పోయింది. చైర్మన్ తోపాటు చిత్తూరు తిరుపతికి చెందిన వారికి ముగ్గురికి స్థానం దక్కింది. అన్యూహంగా కుప్పం క్లస్టర్ ఇంచార్జ్ శాంతారామ్, మాజీ ఎంపీ పనబాక లక్ష్మికి బోర్డులో స్థానం కల్పించారు. గత ఐదేళ్లలో టీటీడీ తీసుకున్న వివాదాస్పద నిర్ణయాలు, అమలు చేసిన పథకాలు, చేసిన ఖర్చులు పై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్న సమయంలో కొత్త పాలకమండలి తీసుకునే నిర్ణయాలు మరింత కీలకం కానున్నా యి. గత ప్రభుత్వం తిరుమలలో చాలా అరాచకాలకు పాల్పడిం దంటూ ఇప్పటికే ఆరోపణలు చేసిన కొత్త చైర్మన్ బిఆర్ నాయుడు తన ముందున్న లక్ష్యం ఏంటో స్పష్టం చేశారు. గత ఐదేళ్లుగా తిరు మలకే వెళ్లలేకపోయానన్న టీటీడీ బోర్డు కొత్త చైర్మన్ బిఆర్ నాయుడు తిరుమల పవిత్రతను కాపాడటమే లక్ష్యం అని తెలిపారు. భక్తులకు సంతృప్తికరమైన స్వామివారి దర్శనం కల్పించడంతోపాటు మెరుగైన వసతులు కల్పించడమే ప్రధాన లక్ష్యం కాబోతోంది.కొత్త పాలక మండలికి సాధారణ భక్తులే ప్రియారిటిగా మారబోతోంది. గత ప్రభుత్వంలో అత్యంత వివాదాస్పదంగా మారిన శ్రీవాణి ట్రస్ట్ వ్యవహారంపై కొత్త పాలక మండలి దృష్టి సారించబోతుంది. శ్రీవాణి ట్రస్ట్ రద్దు చేయాలన్న ఆలోచనలో కొత్త పాలక మండలి భక్తులకు గంటలోపే దర్శనంజరిగేలా ఎలాంటి విధానం అమలు చేయాలో దానిపై దృష్టి పెట్టే అవకాశం కనిపిస్తోంది. టైం స్లాట్ పద్ధతిని తీసుకురావడంతో పాటు త్వరితగతిన భక్తులకు స్వామివారి దర్శనం కల్పించేలా నిర్ణ యాలు తీసుకోవాలని భావిస్తోంది. అలాగే, వీఐపీ దర్శనాలు, వాళ్ళు ఇచ్చే సిఫారసు లెటర్ల తోపాటు ఈ మధ్యకాలంలో దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసిన కల్తీ నెయ్యి వ్యవహారం కొత్త పాలకమండలికి సవాళ్లుగా మారబోతున్నాయి. మరోవైపు గత ప్రభుత్వంలోని బోర్డు తీసుకున్న నిర్ణయాలు, అందులో దాగి ఉన్న అక్రమాలను బయట పెట్టడంతో పాటు తిరిగి అలాంటి నిర్ణయాలకు తావు లేకుండా చేయడమే కొత్త పాలకమండలి ముందున్న లక్ష్యంగా ఉంది. మరోవైపు గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన పాలకమండలిలోని సభ్యులే కొందరు కొత్త పాలకమండలి లోనూ ఉండడంతో అప్పుడు తీసుకున్న నిర్ణయాలు తప్పని ఇప్పుడు తేల్చే బాధ్యత ఎవరిదన్నది కూడా మరో చర్చగా మారే అవకాశం ఉంది. మరోవైపు టీటీడీ బడ్జెట్‌లో దాదాపు మొత్తం సొమ్ము ఇంజనీరింగ్ పనులకు కేటాయించడం, శ్రీవాణి ట్రస్ట్ నిధులను ఇష్టరాజ్యంగా ఖర్చు పెట్టడం ఎవరి ప్రయోజనాలకు మేలు జరిగిందన్న విషయాన్ని కూడా కొత్త పాలక మండలి తేల్చాల్సి ఉంది. చూడాలి మరీ కొత్త పాలక మండలి ఏమేరకు సంచలన నిర్ణయాలు తీసుకుంటుందో..!

# నేడు మెగా డీఎస్సీ ప్రకటన

## మార్చిలో పరీక్ష నిర్వహించే అవకాశం

**అమరావతి, నవంబర్ 5 ( వెలుతురు) :**
ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలను సోమవారం విడుదల చేసిన విద్యాశాఖ ఇప్పుడు మెగా డీఎస్సీ ప్రకటనకు సిద్ధమైంది. ఈ నెల 6వ తేదీన మెగా డీఎస్సీ ప్రకటన విడుదల కానుంది. దరఖాస్తుల ప్రక్రియ కూడా రేపటి నుంచే ప్రారంభమవుతుంది. నెల రోజుల పాటు అంటే డిసెంబర్ 6వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణకు సమయం ఇచ్చే అవకాశం ఉంది. ఫిబ్రవరి 3వ తేదీ నుంచి మార్చి 4వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. మొత్తం 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటన విడుదల కానుంది. ఇందులో ఎస్జీటీ 6371 పోస్టులు, స్కూల్ అసిస్టెంట్లు 7725 పోస్టులు, టీజీటీ 1781 పోస్టులు, పీజీటీ 286 పోస్టులు,, ప్రిన్సిపల్ 52 పోస్టులు, పీఈటీ 132 పోస్టులు ఉండనున్నాయి. ఎస్జీటీ పోస్టులు అత్యధికంగా కర్నూలు జిల్లాలో ఉన్నాయి. కాగా, డీఎస్సీని ఆన్‌లైన్‌లో నిర్వహిస్తుండటంతో అనేక విడతల్లో పరీక్ష నిర్వహించాల్సి వస్తుంది. ముఖ్యంగా ఎస్జీటీ పోస్టులకు సంబంధించిన పరీక్ష నిర్వహణకు వారం రోజుల సమయం పడుతోంది. దీంతో పరీక్షల ఫలితాలను నార్మలైజేషన్ చేసి విడుదల చేస్తున్నారు. ఈ సమస్య లేకుండా ఉండేందుకు రెండు, మూడు జిల్లాలకు ఒకేసారి పరీక్ష నిర్వహిస్తే ఎలా ఉంటుందని విద్యా శాఖ యోచిస్తోంది. ఏపీలో టెట్ ఫలితాలు నిన్ననే విడుదలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా టెట్ కోసం 4,27,300 మంది దరఖాస్తు చేసుకోగా.. 3,68,661 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 1,87,256(50.79 శాతం) మంది అర్హత సాధించారు.




## కూలిపోతున్న మిగ్.29 ఫైటర్‌జెట్

### వీడియో వైరల్

**న్యూఢిల్లీ, నవంబర్ 5 ( వెలుతురు) :**



భారత వాయుసేనకు చెందిన మిగ్-29 ఫైటర్‌జెట్ సోమవారం ఆగ్రా సమీపంలో కూలిపోయిన విషయం తెలిసిందే. సాధారణ శిక్షణలో భాగంగా పంజాబ్‌లోని అదంపూర్ నుంచి యూపీలోని ఆగ్రాకు ప్రయాణిస్తున్న ఈ యుద్ధవిమానం సాంకేతిక సమస్య కారణంగా కూలిపోయింది. పారాచూట్ సాయంతో పైలట్ సురక్షితంగా ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఫైటర్ జెట్ కూలిన వెంటనే భారీగా మంటలు చెలరేగాయి. ఘటనపై విచారణకు ఆదేశించినట్టు అధికారులు వెల్లడించారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగలేదు. అయితే, యుద్ధ విమానం కూలిపోతున్న దృశ్యాలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ విమానం భూమిని చేరడానికి ముందు వేగంగా కిందకు పడిపోతున్నట్లు వీడియోలో కనిపించింది. అంతేకాదు.. పారాచూట్ సాయంతో పైలట్ బయటకు రావడం కూడా కనిపిస్తోంది.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com